ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
సోమవారం 5, ఫిబ్రవరి 2024



మెప్మాలో మెక్కేశారు..!

నకిలీ గ్రూపులతో కొందరు ఆర్పీలు రూ.50కోట్లు స్వాహా

పొదుపు పేరుతో భారీగా బోగస్ రుణాలు

వైసీపీ మహిళా నాయకులే సూత్రధారులు

పలుచోట్ల బ్యాంకులకు బురిడీ

మరికొన్నిచోట్ల బ్యాంకు సిబ్బంది చేతివాటం

విచారణ చేపడితే మరిన్ని మోసాలు వెలుగుచూసే అవకాశం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 4 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అవినీతిలో కూరుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంస్థలో బోగస్ రుణాల బాగోతం నడిచింది. అధికారపార్టీ నాయకురాళ్ల ప్రోద్బలంతో పేర్లు మార్చి నకిలీ గ్రూపులతో ఆ సంస్థలోని ఆర్పీలు పెద్ద దందానే నడిపారు. వాస్తవానికి ఒక గ్రూపులో పది మంది సభ్యులు ఉంటారు. ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు నడుస్తుంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళా సభ్యుల పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును కూడా పూర్తిగా మార్చకుండా ముందు శ్రీ అనే పదాన్ని చేర్చి మరో గ్రూపుగా చూపెట్టారు. ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా వారికి పరిచయం చేశారు. దీంతో వారికి లక్షల్లో రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఇలా వందల సంఖ్యలో నకిలీ పొదుపు గ్రూపులను తయారుచేసి బ్యాంకర్లను బురిడీ కొట్టించి ఒంగోలు నగరంలోనే సుమారు రూ.50 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సమాచారం.

అవినీతి బాగోతంలో వైసీపీ నాయకులు..!

ఇటీవల ఒంగోలులో వైసీపీ నాయకుల అవినీతి వ్యవహారాలు అధికమయ్యాయి. నిన్న మొన్నటి వరకూ భూకబ్జాలతో చెలరేగిపోయిన విషయం విదితమే. అదేసమయంలో వైసీపీకి చెందిన కొందరు మహిళా నాయకులు రుణాల పేరుతో భారీగా బొక్కేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పొదుపు సంఘాలకు సంబంధించి మూడు జిల్లాల నాయకురాలిగా చెప్పుకునే ఓ మహిళా నేత 'బడుగు'ల పేరుతో భారీగా దోచుకున్నట్లు సమాచారం. ఆమె ఒంగోలులోని అలహాబాద్ బ్యాంకులో రుణాలు తీసుకోవడమే కాకుండా మెప్మాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ఓ మహిళా కార్పొరేటర్ భర్త కూడా ఆర్పీల సహకారంతో కొన్ని నకిలీ పొదుపు గ్రూపులను తయారు చేసి రుణాలు పొందారు. దీన్ని ఆ ప్రాంతానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) గుర్తించినట్లు సమాచారం. ఇలాంటి అవినీతి వ్యవహారాలు చేస్తే తన ఉద్యోగం పోతుందని ఆమె అడ్డం తిరగడంతో సదరు మహిళా కార్పొరేటర్ భర్త తిరిగి చెల్లించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మెప్మాకు సంబంధం లేని ఓ మహిళ తాను అధికారపార్టీకి చెందిన మనిషి నని చెప్పుకుంటూ బ్యాంకర్లను దారికి తెచ్చుకుని బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందినట్లు తెలిసింది. కొన్ని గ్రూపుల వద్ద వసూళ్లకు కూడా పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈమెపై మెప్మా పీడీ విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

ఇదేతరహాలో మరో మహిళా వైసీపీ నేత రూ.కోట్లు దండుకున్నట్లు చెబుతున్నారు. మొత్తంగా అధికారపార్టీలో కొందరు నాయకులు భూకబ్జాలకు పాల్పడగా, నాయకురాళ్లు తామేమీ తక్కువ కాదన్నట్లు మహిళల పేరుతో నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి రుణాలు పొందిన విషయం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటుచేసిన మెప్మా ఇప్పుడు అవినీతిపరులకు ఆదాయ వనరుగా మారింది. కొందరు ఆర్పీలు, వైసీపీ నాయకులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు తెరతీశారు. పొదుపు మహిళల పేరుతో రూ.కోట్లు మెక్కేశారు. లేని పొదుపు సంఘాలను ఉన్నట్లుగా చిత్రీకరించి మాయచేశారు. ఆధార్ కార్డులను మార్చేశారు. ఆన్‌లైన్‌లో గ్రూపులు కనిపించకుండా మాయచేశారు. మొత్తంగా బోగస్ రుణాలతో భారీగా దోచేశారు. కొందరు వైసీపీ మహిళా నాయకులు మెప్మాతో సంబంధం లేకపోయినా, తాము అధికారపార్టీ నేతలమంటూ రుణాల పేరుతో కొన్ని బ్యాంకులను బురిడీ కొట్టించారు. అయితే ఈ బాగోతం మెప్మా జిల్లా అధికారులకు తెలిసినప్పటికీ చర్యలకు వెనకడుగు వేయడం అనుమానాలకు తావిస్తోంది. అవినీతి వ్యవహారంలో వారికీ వాటా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బయటపడింది ఇలా..

బోగస్ రుణాలు తీసుకున్న కొన్ని గ్రూపులు సకాలంలో రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. సభ్యులను నెల వాయిదాలు చెల్లించాలని కోరడంతో అసలు తాము రుణాలే తీసుకోలేదని వాపోయారు. దీంతో ఆర్పీల మోసం బయటకు వచ్చింది. ఆతర్వాత ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నగరంలోని పలువురు ఆర్పీలు ఈ తరహా మోసానికి పాల్పడి పొదుపు పేరుతో రుణాలు దండుకున్నట్లు తేలింది. అయితే ఈ వ్యవహారంలో మెప్మా అధికారులు మౌనం దాల్చగా, కొందరు బ్యాంకర్లు సైతం అన్నీ తెలిసి కూడా కిమ్మనకుండా ఉన్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు యాభైకి పైగా నకిలీ సంఘాల ద్వారా రుణాల పేరుతో దోపిడీ జరిగినట్లు సమాచారం.

ఆర్పీలు, వైసీపీ నాయకులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు

బాగా చదువుకుని స్వయం ఉపాధి రుణాల కోసం బ్యాంకర్ల వద్దకు వెళితే సవాలక్ష ఆంక్షలతో కొర్రీలు వేసి, పైసా కూడా రుణం ఇవ్వని బ్యాంకర్లు ఇలాంటి బోగస్‌లకు మాత్రం కోట్లు మంజూరు చేయడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇందులో కొందరు ఆర్పీలు, వైసీసీ నాయకులు, ఆయా బ్యాంకుల సిబ్బంది కుమ్మక్కైనట్లు సమాచారం. రుణాలు మంజూరుచేసిన కొన్ని బ్యాంకుల సిబ్బందికి భారీగానే వాటాలు అందినట్లు తెలుస్తోంది. రుణాలు పొందిన అధికార పార్టీకి చెందిన నాయకులు, ఆర్పీలు పైసా చెల్లించకుండా దర్జాగా కార్లలో తిరుగుతున్నారు. కాగా ఆయా బ్యాంకుల ఉద్యోగులు ఇప్పుడు తిరిగి రుణాలను రికవరీ చేయలేక అల్లాడుతున్నారు.

ఈ బోగస్ రుణాలలో కొంతమంది ఆర్పీలు కీలకంగా వ్యవహరించారు. వైసీపీకి చెందిన నాయకులు వారికి అండదండలు అందించినట్లు సమాచారం. అయితే పొదుపు మహిళల పేరుతో నకిలీ గ్రూపులు సృష్టించి కోట్ల రూపాయలు కాజేసిన వ్యవహారంపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన

వాస్తవాలు వెలికితీస్తే మరిన్ని బోగస్ రుణాలు

అవసరం ఎంతైనా ఉంది. దీనిపై విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలకు కళ్లెం వేసినట్లు అవుతుందని, అలాగే వారిపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.



మెప్మా కార్యాలయం

అటెండెన్స్ అలజడి

ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ

మూడుసార్లు ఆలస్యంగా వస్తే ఒక రోజు సెలవుగా పరిగణన

అక్కడ్నుంచే సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు

నిత్యం ప్రజల మధ్యన ఉండే వైద్య సిబ్బందిలో ఆందోళన



ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : ముఖ ఆధారిత హాజరు విషయమై ఉద్యోగుల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలోనే ఆయా శాఖల పరిధిలో పర్యవేక్షణ జరగ్గా ఇప్పుడు దాన్ని రాష్ట్రస్థాయికి మార్చారు. నెలవారీ ఉద్యోగి ముఖ ఆధారిత హాజరు నమోదు వివరాలు నేరుగా వారి సెల్‌ఫోన్‌లకే మేసేజ్ రూపంలో వస్తున్నాయి. ఉద్యోగులు తమ సెల్‌ఫోన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ఉదయం సమయంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంది. అయితే సమయానికి కార్యాలయానికి వెళ్లినా నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయని పక్షంలో కొంత ఆలస్యంగా హాజరు నమోదు చేసుకుంటున్నారు. దాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. నెలలో మూడుసార్లు ముఖ ఆధారిత హాజరు ఆలస్యంగా వేస్తే ఒక రోజు సెలవు దినంగా నమోదు చేస్తోంది. సాయంత్రం సమయంలో నిర్దేశిత సమయం కన్నా ముందుగా హాజరు వేసినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ప్రధానంగా వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల కోసం నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా వైద్యశాఖలో సుమారు 2,600 మంది వరకు పనిచేస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులతోపాటు వివిధ కార్యక్రమాల్లో వైద్యశాఖను భాగస్వామ్యం చేశారు. దీంతో ఉద్యోగులు ఆ కార్యక్రమాల్లో పాల్గొనాలా? లేక ఆఫీసుకు వెళ్లి ముఖ ఆధారిత హాజరు వేయాలా? అన్నది అర్థంకాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

టీడీపీ గిద్దలూరు ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి

హైదరాబాద్‌లో ఉంటున్న నియోజకవర్గ ప్రజలతో సమావేశం


హైదరాబాద్‌లో గిద్దలూరు నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 4 : హైదరాబాద్‌లో ఉంటున్న గిద్దలూరు ప్రాంత ప్రజలంతా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. నియోజకవర్గానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న సెటిలర్లతో ఆదివారం రామంతపూర్ ప్రాంతంలోని యాదవ సంఘ కల్యాణ మండపంలో అశోక్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అయిన తనకు మద్దతు తెలిపి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గిద్దలూరు నుంచి వలస వచ్చి ఉపాధి పొందుతున్న వారు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. తనకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గిద్దలూరు మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ రాచర్ల మండల అధ్యక్షుడు యోగానంద్, నిర్వాహకులు దామెర్ల పవన్ కుమార్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మారుతోట మహేష్, తమ్మిశెట్టి రామారావు, భారీ సంఖ్యలో హైదరాబాద్‌లో స్థిరపడిన గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు. మెహిదీపట్నంలోని సన్‌సిటీ సమీపంలో కూడా అశోక్‌రెడ్డి మరో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు.

వైద్యారోగ్యశాఖలో కలకలం

వణుకుతున్న అధికారులు

2020లో ఉద్యోగం పొందిన అభ్యర్థుల్లో ఆందోళన

విచారణ నివేదికను అమలు చేస్తే ఉద్యోగాలు ఉఫ్

ఎన్నికల సమయం కావడంతో అమలుపై అనుమానాలు





ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కమిటీ కలెక్టర్‌కు అందజేసిన నివేదిక ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. 2020లో జరిగిన పోస్టుల భర్తీలో చోటుచేసుకున్న పరిణామాలన్నింటినీ నివేదికలో కమిటీ పొందుపర్చడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో నాలుగు విభాగాల్లో 395 ఉద్యోగాలు భర్తీచేయగా 41 మంది అనర్హులకు పోస్టులు ఇచ్చినట్లు కమిటీ గుర్తించడంతోపాటు అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంకోవైపు ఉద్యోగ నియామక ప్రక్రియ అంతా తప్పులతడకగా ఉందని కూడా తేల్చింది. దీంతో అనర్హులతోపాటు అప్పట్లో నియామకాలు చేపట్టిన అధికారుల్లో కూడా టెన్షన్ నెలకొంది. ఆ నివేదికను పూర్తిస్థాయిలో అమలు చేస్తారా? లేక మరో కమిటీని నియమించి సమగ్ర విచారణ చేయిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఆ నియామకాల్లో 41మంది అనర్హులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వారంతా ఉద్యోగాల్లో చేరి మూడున్నరేళ్లు కావడంతో ఇప్పుడు తొలగింపు సాధ్యమేనా? అన్న ప్రశ్న ఉత్పన్నమతోంది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది. విచారణ నివేదిక ఇచ్చినట్లు బహిర్గతం కావడంతో అప్పట్లో నియామకాలు చేపట్టిన అధికారులతోపాటు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఈ గండం నుంచి ఎలా బయటపడాలన్న విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నియామకాల సమయంలో ముగ్గురు డీఎంహెచ్‌వోలు పనిచేసినా ఫైళ్లపై సంతకాలు చేసింది ఒక్క అధికారేనని నిర్ధారించారు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు కూడా వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆ నివేదిక అమలుపై అనుమానాలు ఉన్నాయి. ఆ నివేదికను వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కలెక్టర్ దినేష్‌కుమార్ పంపనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఏలూరి అరెస్టుకు ఒత్తిడి



ఆయన్ని ఒక్కరోజైనా జైల్లో పెట్టాలని పోలీసులకు

వైసీపీ పర్చూరు ముఖ్యనేత పదేపదే ఫోన్లు

ముందస్తు బెయిల్ కోసం

హైకోర్టును ఆశ్రయించిన సాంబశివరావు

లోపలి పేజీల్లో...

మోటారు సైకిళ్లు ఢీ.. ఇద్దరి మృతి

నాగులుప్పలపాడు(ఒంగోలు రూరల్), ఫిబ్రవరి 4 : రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. చదలవాడకు చెందిన రావిచెట్ల అంజయ్య (55) ఇంటి వద్ద నుంచి స్థానిక బేకరీ వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే సమయంలో మద్దిరాలపాడు నుంచి ద్విచక్రవాహనంపై చదలవాడకే చెందిన రావూరి శివ(25), కారుమంచి అనిల్ వస్తున్నారు. ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అంజయ్య, శివలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అనిల్ ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దాహం కేకలు

తాగు నీటి కోసం తల్లడిల్లుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలు

ట్యాంకర్లతో సరఫరా నిలిపివేతతో ఇక్కట్లు

రోడ్డెక్కి ఆందోళనలు

నీటి వనరుల పరిశీలనలో అధికార యంత్రాంగం


ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న వైడిపాడు గ్రామస్థులు

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ప్రజానీకం తాగునీటి కోసం తల్లడిల్లుతోంది. దాహార్తితో అల్లాడుతోంది. గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేయడంతో నానాపాట్లు పడుతోంది. అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనలకు దిగుతోంది. శనివారం దోర్నాల మండలం తిమ్మాపురంలో, ఆదివారం పెద్దారవీడు మండలం వైడిపాడులో జనం నీటికోసం రోడ్డెక్కారు. ట్యాంకర్లతో నీటి సరఫరాలో వైసీపీ నేతల దోపిడీని అరికట్టేందుకు హేతుబద్ధమైన చర్యలకు బదులు అధికారులు ఏకంగా సరఫరా నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

వైసీపీ నేతల నిర్వాకంతోనే సమస్య

జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో శాశ్వత తాగునీటి వనరులు లేక వర్షాకాలం, వేసవి కాలం అన్న తేడా లేకుండా అనేక గ్రామాల్లో నీటి కోసం జనం అవస్థలు పడుతున్నారు. నిన్నమొన్నటి వరకూ ఆ ప్రాంతంలోని 12 మండలాల్లో 82 ఆవాసాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగింది. అయితే ట్యాంకర్లతో నీటి సరఫరాలో కాంట్రాక్టర్లుగా ఉన్న స్థానిక వైసీపీ నేతలు, కింది స్థాయి ప్రజాప్రతినిధులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అదేవిషయం ప్రభుత్వ ఉన్నతాధికారుల పరిశీలనలో కూడా తేలడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా నిలిపివేతకు ఆదేశించారు. దీంతో నాలుగు రోజులుగా పల్లె ప్రజల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి.

ఆందోళనలకు దిగుతున్న ప్రజలు

దోర్నాల మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీ వాసులు నీటి కోసం శనివారం రోడ్డెక్కగా, పెద్దారవీడు మండలం వైడిపాడు గ్రామస్థులు ఆదివారం రాస్తారోకోకు దిగారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, కొనకనమిట్ల, పొదిలి, త్రిపురాంతకం, దొనకొండ తదితర మండలాల్లో సమస్య తీవ్రంగా ఉండగా ఎక్కడికక్కడ ప్రజలు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

ప్రత్యామ్నాయంపై అధికారుల దృష్టి

ఆయా గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటన్నది పరిశీలించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. దీంతో పశ్చిమ ప్రాంత అధికారులు నీటి సమస్య ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ ఆదివారం త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలోనూ, ఇతర గ్రామాల్లో పలువురు అధికారులు పరిశీలనలు చేశారు. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది, తిరిగి నీటి సరఫరా చేస్తారా? లేదా? అన్నది అర్థంకాక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ 2కే వాక్



ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ఒంగోలులో ఆదివారం 2కే వాక్ నిర్వహించారు. స్థానిక మినీ స్టేడియం నుంచి చర్చి సెంటర్ వరకూ ఇది సాగింది. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా నిర్వహించిన ఈ వాక్‌లో యువతీయువకులు, వైద్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - ఒంగోలు కార్పొరేషన్

వరకట్న వేధింపులకు యువతి బలి

పోలీసుల అదుపులో భర్త

నిందితుడిని శిక్షించాలని దళిత సంఘాల డిమాండ్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 4: కులాంతర వివాహం చేసుకున్న యువతి, భర్త వేధింపులకు బలైంది. ఈ సంఘటన ఒంగోలు నగరం ఇందిరమ్మ కాలనీ రెండో లైన్‌లో జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక ఇందిరమ్మకాలనీలో నివాసం ఉండే లింగతోటి తులసిని అదే ప్రాంతంలో నివాసం ఉండే కేసిన సాయిరాఘవేంద్ర ప్రేమ పేరుతో వెంట పడి వేధించి ఏడాది క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. సాయిరాఘవేంద్రపై తాలుకా పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉంది. అయితే ఎలాంటి పనీపాట లేకుండా జులాయిగా తిరిగే సాయి రాఘవేంద్ర వివాహం చేసుకున్న తరువాత తులసిపై అనుమానం పెంచుకోవడంతో పాటు రూ.5లక్షలు కట్నం తెమ్మని వేధించి పుట్టింటికి పంపాడు. ఈక్రమంలో ఈనెల 22న వరసకు అన్నయ్య అయ్యే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఆసుపత్రి వెళ్లి తులసి ఇంటికి తిరిగి వచ్చింది. దీంతో భర్త ఆగ్రహంతో భార్యను ఇష్టమెచ్చినట్లు కొట్టడమేకాకుండా అడ్డువచ్చిన అత్తమామలపైకూడా దాడి చేశాడు. ఈ మేరకు మనస్థాపానికి గురైన తులసి ఎలకల మందు తిని రిమ్స్‌లో చికిత్స పొందుతు శనివారం మృతి చెందింది. ముందుగా తాలుకా పోలీసులు వరకట్నం, వేధింపుల కేసు నమోదు చేయగా ఆమె మృతి చెందిన తరువాత హత్యానేరంతోపాటు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి ఆదివారం డీఎస్పీ కిషోర్‌బాబు దర్యాప్తు ప్రారంభించారు. తులసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన బంధువులకు అప్పగించారు. నిందితుడు సాయిరాఘవేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాధితులకు న్యాయం చేసి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, దార అంజయ్య, కేరళ దిలీప్ డిమాండ్ చేశారు.

దామచర్ల హయాంలోనే ఒంగోలు అభివృద్ధి



మాట్లాడుతున్న నాగసత్యలత

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 4 : ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి దామచర్ల హయాంలోనే జరిగిందని, గడిచిన నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో ఒక్క తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత పేర్కొన్నారు. నగరం మరింత అభివృద్ధి జరగాలంటే జనార్దన్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆమె కోరారు. నారీ కోసం నాగసత్యలత కార్యక్రమం ఆదివారం స్థానిక 32వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మహిళతో సమావేశమయ్యారు. ప్రతి మహిళ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా శ్రీప్రతిభ కళాశాల వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నల్లూరి వెంకటేశ్వర్లు, సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు(విద్య) ఫిబ్రవరి 4 : ఒంగోలులోని ప్రతిభ జూనియర్ కళాశాల, శ్రీ గురుదత్త ఉన్నత పాఠశాల వార్షికోత్సవాలను ఆదివారం పేర్నమిట్ట క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించి ఎందరికో ఉజ్వల భవిష్యత్‌ను అందించామన్నారు. క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ నల్లూరి వెంకటేశ్వర్లు తక్కువ ఫీజులతో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని అభినందించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా 2022-23 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ వీవీ.సుబ్బారావు, డాక్టర్ రాంబాబు, డాక్టర్ చంద్రశేఖర్, సుబ్రమణ్యేశ్వరి, డాక్టర్ జీవన్, పంగులూరి గోవిందయ్య, సుంకర సాయిబాబు, రవికుమార్, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రజలను పీడిస్తున్న వైసీపీని ఓడించాలి : బీజేపీ



జెండాను ఆవిష్కరిస్తున్న శివారెడ్డి, యోగయ్యయాదవ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో ప్రజలను పట్టిపీడిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ కన్వీనర్ వై.సీ.యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు. శాశ్వత ప్రాతిపదికన పది ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఏర్పాటు చేయగా ర్యాలీ నిర్వహించి ఆ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వచ్చే ఎన్నికల్లో బీజేపీ గాలి వీస్తుందని, అందువల్ల రాష్ట్రంలో కూడా పార్టీని ఆదరించాలని కోరారు. యోగయ్యయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, కుటుంబ పార్టీలను ప్రజలు భూస్థాపితం చేయాలన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధితో నరేంద్రమోదీ ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు పొందారన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, నాగేశ్వరరావు, శివాజీ, శెగ్గం శ్రీనివాసరావు, తోగంటి శ్రీనివాసరావు, రాయపాటి అజయ్, పువ్వాడ దామోదర్, గుర్రం రంగనాథ్, సీతారామయ్య, కొఠారి సుధాకర్, దనిశెట్టి నాగేశ్వరరావు, రాము, గుర్రం సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, బి.నాగేశ్వరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఏమి చేశారని 'సిద్ధం' కావాలి

• ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నకేశవులు



రామలింగంకు నియామకపత్రాన్ని ఇస్తున్న చెన్నకేశవులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితుల సంక్షేమానికి దోహదపడే 28 పథకాలను రద్దు చేసి ఇప్పుడు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడం దుర్మార్గంగా ఉందని ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు చేయడమే కాకుండా హత్యలు చేసి రోడ్డున పడేసినందుకు సిద్ధం కావాలా అని ఆయన ప్రశ్నించారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చెన్నకేశవులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రభుద్ధ రిపబ్లికన్ పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన లింగంగుంట రామలింగంకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.సురేష్, సాలె కృపారావు, ఎల్.శ్రీను, పాండ్ర నాగరాజు, క్రాంతికుమార్, రమేష్, వేల్పూరి బాలకోటేశ్వరరావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి : సీపీఎం

కొత్తపట్నం(ఒంగోలు నగరం) ఫిబ్రవరి 4: ప్రభుత్వం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపట్నంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల సమావేశం పట్టపు ప్రకాశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పడి 54 ఏళ్లు అవుతున్నా అభివృద్ధిలో బాగా వెనుకబడి పోయిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిదని, ఎన్ని ప్రభుత్వాలు మారినా జిల్లా ప్రజల తలరాతను మాత్రం మార్చటం లేదన్నారు. ప్రాజెక్టులు పూర్తి కానందున తాగునీరు, సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి స్వామిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని, కొత్తపట్నంలో జరిగిన రోడ్ల విస్తరణలో షాపులు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలని కోరారు.

సైకో పోవాలి..చంద్రబాబు పాలన రావాలి..!

• టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



దామచర్ల జనార్దన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ముస్లింలు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి4: రాష్ట్రంలో సైకో పాలన పోవాలని, సంక్షేమ పాలన రావాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుందామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. బాబుష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ, జనం కోసం జనార్దన్ కార్యక్రమం ఆదివారం స్థానిక ఇస్లాంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలను ప్రేమతో పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, ఇక ప్రజలు ఉపేక్షించే పరిస్థితిలో లేరని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ షేక్ కపిల్‌బాషా, నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, నాయకులు కాట్రగడ్డ శింగయ్య, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. అలాగే దామచర్ల పర్యటన సందర్భంగా స్థానిక మహిళలు హారతులి ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.

టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక

వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు సయ్యద్ అన్వర్‌బాషా, ఆయనతోపాటు మరో 50కుటుంబాలకు చెందిన ముస్లింలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు దామచర్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్వర్‌బాషా మాట్లాడుతూ పేదల పార్టీ, ప్రజా సంక్షేమం కోరే పార్టీ తెలుగుదేశం అన్నారు. వైసీపీ పాలనలో సామాన్య ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితిలేదని, అన్ని ధరలు పెంచేడమే కాకుండా కరెంటు, చార్జీలు పెంచడం, ట్యాక్స్‌లు విధించడంతో అనిన వర్గాలపై ఆర్థిక భారాలు పడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం తామంతా కష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఇదే సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి సంక్షేమం కోసం తాను అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

7న జయహో బీసీ సభ

ఈనెల 7న ఒంగోలులో జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. ఆదివారం ఒంగోలులోని గుంటూరురోడ్డులో గల ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ బీసీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బీసీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని దామచర్ల కోరారు.

వైసీపీ అవినీతి పాలనను తరిమికొడదాం

సైకోను సాగనంపేందుకే తెలుగుదేశం పార్టీతో పొత్తు • జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అవినీతి పాలనను తరిమికొట్టేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో సైకో పాలనను అంతమొందించేందుకే తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. అధినేతను నమ్మి పార్టీలోకి వస్తున్నవారందరికీ ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఒంగోలు నగరం బలరాంకాలనీలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు ఆదివారం సాయంత్రం జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి రియాజ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఓటుతో తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా వచ్చాయని చెప్పారు. సామాన్యులు కూడా ఇబ్బందులు పడే విధంగా వైసీపీ పరిపాలన ఉందన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గతంలో ఇచ్చిన హామీలు విస్మరించి మరలా ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఒంగోలు ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే కనీసం మంచినీళ్ళు కూడా అందించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ఒంగోలు అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలన్నారు. మన తరాలు బాగుండాలన్నా, జీవితాలు బాగుపడాలన్నా జగన్‌ను తమ ఓటు ద్వారా తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ముందుకు పోతుందని తెలిపారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు. అంతకు ముందు అద్దంకి బస్టాండు నుంచి గోరంట్ల కాంప్లెక్స్ మీదుగా బలరాం కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ యూనిస్, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, పల్లి రాజేష్, దండే అనిల్, పల్ల ప్రమీల, టీడీపీ నాయకులు ముంతాజ్, ఆరిఫా పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ కూటమి విజయం తథ్యం

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



ర్యాలీలో పాల్గొన్న విజయ్‌కుమార్, ఆమంచి స్వాములు

చీమకుర్తి, ఫిబ్రవరి 4: రాబోయే ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమి విజయబావుటా ఎగురవేయటం తథ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎస్.విజయ్‌కుమార్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు ఘంటా బజాయించారు. ఆదివారం చీమకుర్తి పట్టణంలో జరిగిన నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు పట్టణ శివారు నుంచి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పల్లపు శివప్రసాద్ ఆధ్వర్యంలో జనసైనికులు ఘన స్వాగతం పలికారు. ఉరకలెత్తించే ఉత్సాహంతో యువకులు బైక్‌ర్యాలీలో ముందుభాగంలో ఉండగా బీఎన్, ఆమంచి స్వాములు, జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి రాయపాటి అరుణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందుకూరి వెంకటేశ్వరరావులు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో వారు ప్రసంగించారు. టీడీపీ, జసేన కార్యకర్తలు ఐక్యంగా ముందుకు నడచి రాక్షసపాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. నూతనంగా పట్టణ జనసేన అధ్యక్షుడుగా ఎన్నికైన తాతినేని శ్రీరామ్, ఇతర సభ్యులచే ప్రమాణస్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మన్నంప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు పాల్గొన్నారు.

రైతుల పంట రుణాలను మాఫీ చేయాలి

• రైతు సంఘం నాయకుల డిమాండ్

• 8న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం



మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్న రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కరువు, తుఫాన్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు బీమా పథకాన్ని వెంటనే అమలు చేయడంతో పాటు రైతులు, కౌలు రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రూ.15వేలను ప్రభుత్వం సాయం అందించాలన్నారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డె హనుమారెడ్డి, కె.వీరారెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు సకాలంలో సాగునీరు అందించి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకొని పోవడంతో వాటి స్థానంలో కొత్త గేట్లు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వతేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరైన జీవన విధానంతోనే క్యాన్సర్ నివారణ

• నగరంలో 2కే వాక్



నగరంలో అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న వైద్యులు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 4 : మంచి ఆహారపు అలవాట్లు, సరైన జీవన విధానంతో క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని బీఎంఆర్ అర్జున్ ఇన్‌ఫ్రా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులో ఆదివారం 2కె వాక్ నిర్వహించారు. స్థానిక మినీ స్టేడియం నుంచి చర్చి సెంటర్ వరకూ ఇది సాగింది. అనంతరం ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ మనం ప్రతి రోజూ తీసుకునే ఆహారం కారణంగానే క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. అవగాహన లోపం వల్లనే ఏటా క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నిరంతర వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లు, ప్రశాంతమైన జీవనం అలవర్చుకొంటే ఈ మహమ్మారికి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో అర్జున్ ఇన్‌ఫ్రా అధిపతి బొమ్మిశెట్టి శంకర్‌రావు, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ మణిబాబు, యూనీస్, శ్రావణి, శ్రీదేవి, మన్నే వీరయ్య చౌదరి, కోటిరెడ్డి, కమలహాసన్, దీప, రవికుమార్, రిమ్స్ వైద్యులు డాక్టర్ తిరుమలరావు, క్యాన్సర్ వైద్యులు రఘునాథ్, రామకృష్ణ, రమణారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం చర్చి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో..

ఒంగోలు(కార్పొరేషన్): నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ ప్రశాంతి, జనరల్ ఫిజీషియన్ బండారు అనుశ్రీ, డాక్టర్ సభా పుమేహానిలు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, సరైన జీవన విధానం, వ్యాయామం ద్వారా క్యాన్సర్‌ను అరికట్టవచ్చని తెలిపారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జగదీష్ పాల్గొన్నారు.

గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

• బిహార్‌వాసి మృతి, నలుగురికి గాయాలు



మృతుడు, క్షతగాత్రులను పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, ఫిబ్రవరి4 : గ్రానైట్ రాళ్లను లోడు చేసుకొని చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం ఎర్రగుడిపాడు డొంక సమీపంలో కర్నూల్‌రోడ్‌పై జరిగింది. ట్రాక్టర్ ట్రక్‌లో రాళ్ళపై కూర్చుని పయనిస్తుండగా జరిగిన సంఘటనలో బిహార్ రాష్ట్రానికి చెందిన ఔదేష్ సహణి(28) మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వీరందరిని చీమకుర్తి సీహెచ్‌సీకి తీసుకురాగా ఔదేష్ సహణి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. క్షతగాత్రులకు వైద్యసేవలు అందిచారు. సీఐ దుర్గాప్రసాద్ సంఘటనాస్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను పరామర్శించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అవీ..ఇవీ..

గో సంరక్షణతోనే ధర్మ పరిరక్షణ



చక్రపాణిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 4: హిందువులు ఎంతో పవిత్రంగా పూజించే గోవుల సంరక్షణ ద్వారా ధర్మ పరిరక్షణ జరుగుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ చక్రపాణి పేర్కొన్నారు. ఆయన కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం సందర్శించారు. అక్కడి గోశాల నిర్వహణ, గోవుల ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలూరు ఝాన్సీరాణి, జ్వాలా రామారావు, జైశంకర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజలో పాల్గొనగా అక్కడి వేదపండితులు స్వామి వారి శేషవస్త్రాన్ని బహూకరించి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

పండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంచుతున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 4: జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని స్థానిక కమ్మపాలెం అప్పాయగుంట దగ్గర ఉన్న ఆశయం వృద్ధాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరానికి చెందిన మహిళా ఆర్‌ఎంపీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. వృద్ధాలయ నిర్వాహకురాలు లీలారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎంపీ సంఘ నాయకులు ఆంటోనీ, శాంతి తదితరులు ప్రసంగిస్తూ ఆర్‌ఎంపీలు సమాజంలో ఎంతో విలువైన సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆదేవిధంగా ఎటువంటి ఆసరా లేని వృద్ధుల కోసం వృద్ధాలయాన్ని నిర్వహిస్తున్న లీలారాణి సేవలను కొనియాడారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు.

మనసు పెట్టి చదివితే మంచి మార్కులు



మాట్లాడుతున్న శంకర్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 4: విద్యార్థులు మనసు పెట్టి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వెల్‌విషర్ శంకర్ పేర్కొన్నారు. ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఓల్డ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి బాలికలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తరగతి గదిలో టీచర్లు పాఠం చెప్పేటప్పుడు శ్రద్ధగా వినాలని, నేర్చుకున్న విషయాలను సమర్థవంతంగా రాయాలని శంకర్ తెలిపారు. ఏకాగ్రత పెంపొందించుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలను వివరించారు. చదువు పట్ల ఇష్టాన్ని పెంచుకొని కృషి చేస్తే అనుకున్నన్ని మార్కులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ప్రసన్నలక్ష్మి, సభ్యులు టీవీ.సుబ్బారావు, నరసింహశాస్త్రి, ఎం.శ్రీనివాసరావు, టీచర్లు మధు, జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

9,10 తేదీల్లో బాలోత్సవం



మాట్లాడుతున్న వీరాంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : ఒంగోలులోని పీవీఆర్‌బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 9,10వ తేదీల్లో నిర్వహించే ప్రకాశం బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవ ఉపాధ్యక్షుడు డి.వీరాంజనేయులు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన వర్క్‌షాపు లో ఆయన బాలోత్సవాల అకడమిక్ కమిటీలు, కల్చరల్ కమిటీలకు సంబంధించి విధి విధానాలను వివరించారు. ప్రధానకార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ బాలోత్సవం కార్యక్రమాలు విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నాయకులు బండారు లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్‌కే.అబ్దుల్ హై, జి.ఉమామహేశ్వరి, వి.బాలకోటయ్య, వినోద్‌బాబు, ఖాజాహుస్సేన్, బషీర్, తిరుపతయ్య, దామా శ్రీనివాసరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి4: వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ కడియాల బాలుసుమన్ పేర్కొన్నారు. ఒంగోలు మండలం మండవవారి పాలెంలోని కాకతీయాసేవాసంఘం ఆనందనిలయంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సీనియర్ సభ్యులు బండారు లక్ష్మీనారాయణ, అంజలి శ్రీనివాస్, రోటరీ అధ్యక్షుడు చుండూరి కిషోర్, కార్యదర్శి గోపాలకృష్ణ, మురళీకృష్ణ, సురేంద్రబాబు, మారెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

నాలుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి4: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి జరిగితేనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆదివారం ఆసరా నాలుగవ విడత డ్వాక్రా మహిళా గ్రూపులకు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ, నలమలపు కృష్ణారెడ్డి, కొమ్మూరి కనకారావు, పిచ్చిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, పోలినేని కోటయ్య, పేరాల చెన్నకేశవులు, మారెళ్ల బంగారుబాబు, పరంధామరెడ్డి, కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకయ్య

టంగుటూరు, ఫిబ్రవరి 4 : స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో ఆదివారం టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్య నిపుణుడు వెంకయ్య రోగులను పరీక్షించారు. ముందుగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం కూడా జరిగింది. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

• మాజీ కలెక్టర్ విజయ్‌కుమార్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 4 : ప్రజాభీష్టం మేరకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు రిటైర్డ్ జిల్లా కలెక్టర్ జీఎస్ఆర్‌కే. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. తుని నుంచి తడ వరకు ఆయన చేపట్టిన పాదయాత్ర ముగిసినన సందర్భంగా ఆదివారం ఒంగోలులోని ఓ హోటల్‌లో అభిమానులు, దళిత సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బడుగు, బలహీన వర్గాల వారిని, దళిత జాతిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. తాను ఒంగోలు ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అది ఏ పార్టీ అయినా సరేనని, దళితుల సంక్షేమం కోసం తాను పార్లమెంట్‌లో ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నాని తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.


ఎమ్మెల్యే స్వామిని మర్యాద పూర్వకంగా కలిసిన జువ్విగుంట బీసీ నాయకులు

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పిస్తాం

● ఎమ్మెల్యే స్వామి

మద్దిపాడు, ఫిబ్రవరి 4 : బీసీల భద్రత కోసం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ చట్టం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే డోలాశ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం మండలంలోరిన జువ్విగుంట గ్రామానికి చెందిన పలువురు బీసీ సంఘం నాయకులు టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఉన్న ఎమ్మెల్యే స్వామిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జగన్ అమలు చేయని హామీల పథకాలను పోస్టల్ రూపంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి, జడ్‌పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, జిల్లా నాయీబ్రహ్మణ సాధికారసమితి అధ్యక్షులు పాలూరి సత్యం, నియోజకవర్గ నాయీబ్రహ్మణ సాధికారసమితి అధ్యక్షుడు కొణిదేన మోహన్‌రావు, జువ్విగుంట మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీనివాసులు, బీసీ నాయకుడు పసుపులేటి సురేష్‌బాబు, పిచ్చయ్య, నారాయణ, వెంకటనారాయణ, ద్రోణాదులు తిరుపాలు, నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు బూదాల దాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కోటేశ్వరమ్మ

అధికారుల గైర్హాజరుతో మండల సమావేశం మమ

టంగుటూరు, ఫిబ్రవరి 4 : అధికారుల గైర్హాజరుతో టంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అధికారులు మ.మ అనిపించారు. ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన ఆదివారం జరిగిన అత్యవసర సమావేశానికి 60శాతం మంది అధికారులు గైర్హాజరయ్యారు. ఉదయం 10గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం కోరం కోసం ఎదురు చూస్తూ 12.30గంటలకు ప్రారంభించారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయనున్నట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం చెప్పారు. సమావేశంలో పాల్గొన్న అనంతవరం ఎంపీటీసీ సభ్యుడు కసుకుర్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ టంగుటూరు నుంచి అనంతవరం రోడ్డు మార్గం మందుబాబుల అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సుమన్‌రెడ్డి మాట్లాడుతూ కారుమంచిలో కొందరు పందాకు పేరుతో పొగతోటలను ధ్వంసం చేస్తున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, పోలీసులు రంగ ప్రవేశం రైతులకు కాపాడాలని కోరారు. ఎంఈవో-2 బాలాజీ మాట్లాడుతూ కొణిజేడు. తేటుపురం గ్రామాల్లో ధ్వంసం చేసిన పాఠశాల భవనాలను ఫేజ్-3లో నిర్మిస్తామని చెప్పారు. ఏపీవో సుభాషిణి పాల్గొన్నారు.

ఏలూరిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణం

కుంకలపర్రు(పర్చూరు), ఫిబ్రవరి 4: అవినీతి మచ్చలేని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయటం దారుణమని మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ కొల్లా సుబ్బారాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో జగన్ ప్రభుత్వ అవినీతి, అరాచకాన్ని నిలదీసి ప్రశ్నించటాన్ని కక్ష కట్టి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారన్నారు. ఏలూరిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

ఏలూరి అరెస్టుకు ఒత్తిడి

ఆయన్ను ఒక్కరోజైనా జైల్లో పెట్టాలని పోలీసులకు వైసీపీ పర్చూరు ముఖ్య నేత పదేపదే ఫోన్లు

ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించిన సాంబశివరావు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు ఎమ్మెల్యే, టీడీపీ బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావును ఎలాగైనా జైలుకు పంపించాలన్న లక్ష్యంతో వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ కేసులో ఆయన పేరును ఇరికించడమే కాక ఒక్కరోజైనా జైలులో పెట్టించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. పర్చూరు నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత అందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మార్టూరులో టీడీపీ అభిమానుల గ్రానైట్ క్వారీల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా అధికారులు ప్రైవేటు వ్యక్తుల కార్లలో రావడం, ఆప్రైవేటు వ్యక్తులు తమవెంట కర్రలు, కారం తీసుకురావడంతో గ్రానైట్ వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. అంతేగాక అధికారితో వచ్చిన ప్రైవేటు వ్యక్తి ఒకరు వైసీపీలోని ముఖ్యనేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాంబశివరావు అక్కడికెళ్లి వ్యాపారులకు మద్దతుగా నిలిచి నిబంధనల ప్రకారం క్వారీల్లో తనిఖీలు చేసుకోవాలని మైనింగ్ అధికారులకు సూచించారు. వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన కర్రలు, కారంపొడిని గుర్తించి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాలతో అక్కడికి వచ్చిన కిందిస్థాయి పోలీసు అధికారులకు వాటిని అప్పజెప్పి నియోజకవర్గంలో జరగనున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కార్యక్రమానికి వెళ్లిపోయారు.



ఏలూరితోపాటు మరో ఆరుగురిపై కేసు

వైసీపీ నేతల ఒత్తిడితో విధి నిర్వహణలో అధికారులను అడ్డుకున్నారనే నెపంతో అదేరోజు సాయంత్రం సాంబశివరావుతోపాటు మరో ఆరుగురిపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితో మరో 20 మంది ఉన్నట్లుగా ఫిర్యాదులో పేర్కొనగా వారిపైనా కేసు బనాయించారు. ఉద్యోగులతో వచ్చిన రౌడీల వ్యవహారంపై వ్యాపారులు పెట్టిన ఫిర్యాదులను మాత్రం పట్టించుకోకుండా పక్కనేశారు. అనంతరం ఆ కేసులో ఆరుగురు వ్యాపారులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపగా వారికి ఒక్కరోజులోనే బెయిల్ వచ్చింది. ఈనేపథ్యంలో మార్టూరు సీఐగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న రాజశేఖర్‌రెడ్డికి వైసీపీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేత ఫోన్‌చేసి 'మీరు వెంటనే ఆ కేసుపై దృష్టిపెట్టాలి. ఎమ్మెల్యే సాంబశివరావును అరెస్టు చేయాలి. కేసుకు సంబంధించిన మరో 20 మంది వ్యాపారులను కూడా జైలుకు పంపాలి' అని మాట్లాడినట్లు తెలిసింది. ఆయన ఇప్పుడే బాధ్యతలు చేపట్టాను మాట్లాడదామని చెప్పగా ఆ తర్వాత జిల్లా, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి అరెస్టు చేయాలని కోరుతున్నట్లు సమాచారం.

కోర్టు నిర్ణయం వచ్చే లోపే అరెస్టుకు ఒత్తిడి

ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం తీర్పు వెలువడనుంది. ఈనేపథ్యంలో శనివారం మార్టూరు పోలీసుస్టేషన్‌కు కొంతమంది వైసీపీ నాయకులు వెళ్లి ఆకేసులో మిగిలిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. ఆతర్వాత సదరు ముఖ్యనాయకుడు నియోజకవర్గ, జిల్లాస్థాయి పోలీసు అధికారులతోపాటు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఒక్కరోజైనా ఏలూరిని కటకటాల వెనక్కు పంపాలి. మీరు వెంటనే ఆపనిచేస్తారా? లేదా? అని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. మంగళగిరి పార్టీ ఆఫీసులో ఆదివారం టీడీఎల్పీ సమావేశం ఉన్నందున అక్కడికి ఎమ్మెల్యే ఏలూరి వస్తారని, అరెస్టు చేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. అయితే ఏలూరి ఆ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సోమవారం అసెంబ్లీ సమావేశాలకు ఆయన వచ్చే అవకాశం ఉందని, అక్కడ అరెస్టు చేయాలని సదరు నేత పోలీలకు పదేపదే ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టులో దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై జడ్జి నిర్ణయం సోమవారం వెలువడే అవకాశం ఉంది. అయితే 'అసలే కుట్ర కేసు. ముందుగా అరెస్టు అయి రిమాండ్ కెళ్లిన నిందితులకు ఒక్కరోజులోనే బెయిల్ లభించింది. ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో తీర్పురానుంది. ఈనేపథ్యంలో వైసీపీ నేతలు ఎంత ఒత్తిడిచేసినా మేమేమి చేయగలం' అని పోలీసు అధికారులు వాపోతున్నారు. అయితే వైసీపీ నేతలు ఆశించినట్లు ఒక్కరోజైనా సాంబశివరావును అరెస్టు చేసి జైలుకు పంపుతారా? సోమవారం ఆయనకు హైకోర్టులో బెయిల్ వస్తుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

వైసీపీ నేతల కనుసన్నల్లో ప్రభుత్వ స్థలం ఆక్రమణ

» ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

» జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

అద్దంకి, ఫిబ్రవరి 4: మండలంలోని చినకొత్తపల్లిలో అధికారుల తీరుపై టీడీపీ మద్దతురాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న దళితులు తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న వాగు పోరంబోకు వ్యవసాయ భూమిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఇక గ్రామంలో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉండగా సుమారు 30 సెంట్ల స్థలంలో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం భవనాలు నిర్మించారు. మిగిలిన 30 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. వైసీపీ నేతల అండదండలతో కొందరు వ్యక్తులు వరిగడ్డి వాములు, రేకుల షెడ్డులు ఏర్పాటుచేసి తమ ఆధీనంలోకి తీసుకువచ్చే విధంగా చేస్తున్నారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.

ఈవిషయమై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదన్నారు. సచివాలయ సిబ్బంది సెలవు పెట్టి ఆక్రమణదారులు ఆక్రమించే విధంగా అవకాశం కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చాగంటి గణపతి తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేసమయంలో స్పందించని స్థానిక అధికారులపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.


చినకొత్తపల్లిలో ప్రభుత్వ భూమిలో వేసిన గడ్డివామి

అక్రమ అరెస్టులు దుర్మార్గం

పర్చూరు, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పర్చూరులో ఏలూరి గెలుపును ఆపడం అసాధ్యమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను అన్నారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు, టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తిరుమలశెట్టి మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం కర్రలు, కారం ప్యాకెట్లతో వైసీపీ గూండాలు మైనింగ్ అధికారులతో కలసి మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలో తనిఖీలకు వచ్చారని చెప్పారు. దానిని ప్రశ్నించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. వైసీపీ గుండాలను వదిలి ఫిర్యాదు చేయటానికి వెళ్ళిన టీడీపీ నాయకులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. అక్రమ కేసులతో ఎమ్మెల్యే ఏలూరి ప్రతిష్టను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. ప్రజానాయకుడు ఏలూరి అని, అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో సముచిత స్థానం సంపాదించుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఏలూరికి హ్యాట్రిక్ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, పార్లమెంట్ ఎస్సీ సెల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాసరవు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పాలపర్తి శ్రీను, పొన్నరుసు వెంకటేశ్వర్లు, లింగేశ్వరరావు, చెంచమ్మ, పేరం శోభన్, శ్రీను, పొట్లూరి శ్రీను, కోటి, బాబు, నాగేశ్వరమ్మ, పోతురాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకులు

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 4: చంద్రన్న బీమా సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని కావూరివారిపాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఆసోది శ్రీనివాసరెడ్డి ప్రమాదవశాత్తు మరణించారు. పార్టీపరంగా అందించే రూ.2 లక్షల చెక్కును ఆదివారం ఇన్‌చార్జ్ కొండయ్య ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం కుటుంబసభ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా కుటుంబ పెద్దగా చంద్రబాబు అండగా ఉంటారని చెప్పారు. అందుకు చంద్రన్న బీమా ఒక నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మంచాల వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, గుడిపల్లి అంజయ్య, మంచాల తారకరాముడు, అంకమ్మరావు, పోలిరెడ్డి, రత్తమ్మ, కొతవరపు జనార్దనరావు, పురుషోత్తం, డోలా శివకుమార్, మోహన్‌గౌడ్, బోయిన వెంకన్న, బోయిన శ్రీను, యారం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

చీరాల, ఫిబ్రవరి 4: మండలంలోని వాడరేవుకు చెందిన పలువురు మత్స్యకారులు ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి తెలుగుదేశం పార్టీ కండువాలను వారి మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరేందుకు కృషి చేసిన టీపీడబ్ల్యూ మండల అధ్య క్షుడు ధోని కనకరాజును కొండయ్య ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు, చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే రాష్ట్రం అంధకారంలోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వాడరేవు మత్స్యకారులతో కొండయ్య

టీడీపీ గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి

» మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

» వరుస చేరికలతో క్యాంప్ కార్యాలయంలో సందడి

» వైసీపీని వీడిన పామూరు, పీసీపల్లి మండలాలకు చెందిన 99 కుటుంబాలు

కనిగిరి, ఫిబ్రవరి 4 : తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి మలుపు తిరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం పీసీపల్లి మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన 17 కుటుంబాలు, పామూరు మండలం దాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలన రావణాసురిడి పాలన తలపించేలా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తూ జగన్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోకపోతే రాష్ట్రం కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలో పేద, దళితులను బెదిరించి వైసీపీ నేతలు వారి భూములను ఆక్రమించుకున్నారన్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలోనే అన్ని వర్గాల కు సముచిత స్థానం లభిస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీలో చేరిన వారికి సూచించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్ర తి ఇంటినీ సందర్శించి టీడీపీ, వైసీపీ పాల నకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ ప్రాంతంలో వలసలు, ఫ్లోరైడ్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు నీళ్లు అన్ని మండలాలకు మళ్లించేలా చొరవ చూపతాన న్నారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, నిరుద్యోగులకు ఉపాధి, మెరుగైన రవాణా వంటివి చేసి చూపిస్తాన న్నారు. వచ్చే ఎన్నిక ల్లో తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించేలా శ్రేణులు, నా యకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.


వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు మండలం దాదిరెడ్డిపల్లి వాసులు

వైసీపీలో 420 బ్యాచ్

2019 ఎన్నికల్లో వైసీపీని, ఆ నేతలను నమ్మి ఓట్లేసి గెలపించడమే కాకుండా వైసీపీకి ఎంతో నమ్మకంగా పనిచేశామని, కానీ గెలిచాక తమను కానీ, తమ గ్రామాన్ని వైసీపీ నేత పట్టించుకోవలేదని ముద్దపాడు గ్రామ ఉపసర్పంచ్, వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారు డాక్టర్ ఉగ్ర ఎదుట వాపోయారు. వైసీపీలో ఉ న్న నాయకులంతా 420 బ్యాచ్ అని తెలుసుకోటానికి నాలుగేళ్లు పట్టిందని ఉపసర్పంచ్, గ్రామస్థులు పేర్కొన్నారు.


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

వైసీపీని వీడి టీడీపీలోకి 10 కుటుంబాలు

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో చేరిక

సింగరాయకొండ, ఫిబ్రవరి 4 : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బావివద్ద పల్లెపాలెం వైసీపీకు చెందిన 10 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించటానికి పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సింగోతు సుబ్బారావు, వల్లభుని రాజు, యానాది, గొల్లపోతు బాబురావు, హరిచంద్రరావు వారికి చెందిన పలు కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నూతలపాటి కృష్ణచైతన్య, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, వల్లభుని వెంకటేశ్వర్లు, వి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

● మంత్రి సురేష్

మద్దిపాడు, ఫిబ్రవరి 4 : మహిళా సాధికారతే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగిన నాల్గో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 6600 మందికి 22 కోట్ల 22 లక్షల రూపాయులు వారి ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీకి మంచి పట్టు ఉందనే అహంకారంతో ఆ పార్టీ నేతలు ప్రవర్తిస్తున్నట్లు విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనకు విజయాన్ని అందిస్తే నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని చెప్పారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఏరియా కోఆర్డినేటర్ సరిత, మద్దిపాడు, చిమట సొసైటీ అధ్యక్షులు బీవి భాస్కర్‌రెడ్డి, మాకినేని వెంకటరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కదిరి భాస్కర్‌రావు, వైసీపీ నాయకులు మల్లికార్జునరావు, బోదా రమణారెడ్డి, బీవీ భాస్కర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, మెళ్లల శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చిరంజీవి, ఏపీఎం బాబురావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

రైలు ఢీకొని తిమ్మసముద్రం వాసి మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న సంఘటనలో తిమ్మసముద్రంకు చెందిన పులుగు బాబు(43) మృతిచెందిన సంఘటన ఆదివారం వేటపాలెం- చినగంజాం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై కొండయ్య కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడు పట్టాలు దాటుతుండగా ఘటనజరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

9లోగా ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మార్టూరు, ఫిబ్రవరి 4: జగనన్న కాలనీలలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ వారి పరిధిలోని గ్రామ సచివాలయాలలో ఈనెల 9లోపు ఇళ్ల పట్టా లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బాపట్ల ఆర్‌డీవో రవీంద్ర అన్నారు. ఆదివారం మార్టూరులోని ఒకటో గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషను ప్రక్రియను ఆయన పరిశీలించారు.

రేపు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



దొనకొండ, ఫిబ్రవరి 4 : మండల కేంద్రమైన దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో టీడీపీ యువ నాయకుడు కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ని యోజకవర్గ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కుందుర్తి లక్ష్మణ్ కోరారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

దొనకొండ, ఫిబ్రవరి 4 : వీరవెంకటాపురంకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యకర్త మాలపోటు వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మార్కాపురంలో వైద్య సేవలు పొంది ఇంటికి చేరారు. సమాచారం తెలుసుకు న్న టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆదివారం వెంకటయ్య ఇంటికి వెళ్లి ప్రమాదం తీరు, ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. అధైర్యపడొద్దన్నారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం కొంత మేర నగదును అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్
- చట్లమిట్ల వద్ద ఖాళీ బిందెలతో నిరసన
- చింతల అగ్రహారంలో నీటి ఎద్దడి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 4: పెద్దారవీడు మండలం కర్రోల, వైడీపాడు గ్రామాలలో నీటి సమస్యతో అల్లాడుతున్నామని వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై చట్లమిట్ల వద్ద ఆదివారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. తాగునీటి ట్యాంకర్లను వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లకు నీరు రాక నీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొంతకాలంగా ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్న ఇటీవల అర్థాంతరంగా నిలిపివేయటంతో నీటి కోసం కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని మోసుకొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్నవారు నీరు తెచ్చుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీటి కోసం కూలి పనులు మానుకొని ఇంటి వద్ద ఉండి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి తమను ఆదుకోవాలని కోరారు. పెద్దారవీడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న వారిని విరమింప జేశారు.

పెద్ద దోర్నాల : మండలంలోని చింతల అగ్రహారంలో నీటిఎద్దడి తీవ్రమయ్యింది. దీంతో గ్రామస్థులు ఖాళీ బిందెలతో మార్కాపురం - దోర్నాల రోడ్డుపై ఆదివారం ఆందోళనకు దిగారు. నీటిసమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో చింతల అగ్రహారం ఒకటి. ట్యాంకర్ల సరఫరాతో నీటి సమస్య తీరేది. ఇప్పుడు ట్యాంకర్లను నిలిపి వేయడంతో నీటి సమస్య తీవ్రమయిందని ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని కోరారు.

త్రిపురాంతకం : మండలంలోని నాలుగు గ్రామాల్లో ఇటీవల నిలిపివేసిన మంచినీటి ట్యాంకర్లు, తాగునీటి సమస్యపై మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా ఆదివారం విచారించారు. లేళ్లపల్లిలో గ్రామస్థులతో మాట్లాడి తాగునీటి సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎన్ని ట్యాంకర్ల మంచినీటి సరఫరా చేస్తున్నారు, సక్రమంగా అందుతున్నాయా..? లేదా..? అని ప్రశ్నించారు. రోజు మార్చి రోజు నీటి సరఫరా చేస్తున్నారని, నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలిపి వేశారని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని భూగర్భ జలాలు అడుగంటాయని, విద్యుత్ మోటార్ల ద్వారా కొద్ది నీరు మాత్రమే వస్తుందని వివరించారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. సబ్ కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దారు భ్రమరాంబ, వీఆర్వో, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఉన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కొనకనమిట్ల : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మోరబోయిన మురళీక్రిష్ణ అన్నారు. మండల కేంద్రం కొనకనమిట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండ ల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాగునీటి ఎద్దడిపై రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు పగడ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు ప్రణాళికతో అధికారులు గ్రామాల్లో పరిశీలించి మరమ్మతులకు గురైన డీప్‌బోర్లు, చేతిపంపులను మరమ్మతులు చేయించాలన్నారు. మండల ఉపాధ్యక్షులు మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయని వాటర్‌ట్యాంక్‌లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా మండలంలో ఉపాధికూలీలకు ఎటువంటి పనులు చేపడుతున్నారో చెప్పాలని ఏపీవో బులెన్‌రావును కోరారు. ముఖ్యంగా ప్రతి మండల సర్వసభ్య సమావేశాలకు పలుశాఖల అధికారులు గైర్హజరు అవుతున్నారని దీంతో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయని మండిపడ్డారు. ప్రతి సమావేశానికి అధికారులు రాకపోవడం ఏమిటని పలువురు సభ్యులు తీవ్రఅసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలకు జిల్లా ఉన్నతాధి కారులు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, ఈవోఆర్డీ జనార్ధన్, రేగడపల్లి సొసైటి అధ్యక్షులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న చింతల అగ్రహారం గ్రామస్థులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, అధికారులను నిలదీస్తున్న పలువురు సభ్యులు

ఇంటర్ విద్య జీవితంలో మలుపు



వార్షికోత్సవంలో పాల్గొన్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 4: ఇంటర్ విద్య జీవితంలో ఎంతో కీలకమైనదని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక సిద్దార్థ జూనియర్ కాలేజీ, సాయిడిగ్రీ కళాశాల మొదటి వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని, పట్టుదలతో చదవాలన్నారు. టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన ఆలోచనలు, విలువలు అవసరమన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. అనంతరం కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

ఆలయాల్లో మంత్రి కారుమూరి పూజలు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయాల్లో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భాగంగా చినమస్తాదేవికి నిమ్మకాయల పూజ, హోమం, అభిషేకం, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను అందజేశారు. ఈసందర్భంగా మండల రేషన్‌డీలర్లసంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు.


పూజలు చేస్తున్న నాగేశ్వరరావు

విలేజ్ క్లినిక్ ప్రారంభం


విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పొదిలి, ఫిబ్రవరి 4 : మండలంలోని ఏలూరు సచివాలయంతోపాటు పలు విలేజ్‌క్లినిక్‌లను ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని సచివాలయం2, 4, 5, 6 సచివాలయాల్లో నిర్మించిన విలేజ్ క్లీనిక్‌లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అన్ని వ్యవస్థలు ఒకే చోటుకు వచ్చాయన్నారు. గ్రామాల్లో సచివాలయం, హెల్త్ క్లీనిక్, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తీర్చారని కొనియాడారు. అనంతరం ఏలూరు పంచాయితీలోని సల్లూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

పొదిలి, ఫిబ్రవరి 4 : పొదిలి జూనియర్ కళాశాల రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కలిశ ప్రతిష్ఠ ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. 41 రోజులుగా నూతనంగా నిర్మించిన దేవాలయంలో పూజలు చేశారు. పురవీధుల్లో కలిశాలను అంగరంగ వైభవంగా కార్యక్రమం ఊరేగించి దేవాలయంలో వేద పండితుల మత్రోచ్చరణలతో శిఖరంపై ప్రతిష్టించారు. ఈప్రతిష్ఠ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సీతారామ సమేత ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు.


కలిశాలను ఊరేగిస్తున్న భక్తులు

మహిళల అభివృద్ధికి ఆసరా

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 4: మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పలు విధాలుగా ఆసరానిస్తోందని ఎర్రగొండపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శివసదన్‌లో వైకేపీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు నాల్గొవ విడత ఆసరా చెక్కుల పంపిణీ ఆదివారం నిర్వహించారు మండలంలోని 573 స్వయం సహాయక సంఘాలకు రూ.3.10 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ డ్రైవర్ల సంఘంతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ.పద్మజ, సర్పంచి చిత్తూరి హారిక, మండల వైసీపీ కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, ఏపీఎం దర్శనం పోలయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న చంద్రశేఖర్

ఐటా జిల్లా కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 4: స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్(ఐటా) జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటా జాతీయ కార్యదర్శి షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. దేశంలో ఏకైక జాతీయ ఉపాధ్యాయ సంఘం ఐటా అన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడటమే కాకుండా వారి బాధ్యతలను ఐటా తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటా రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైపాలెంలో వైసీపీని వీడి టీడీపీలో చేరికలు

పుల్లలచెరువు, ఫిబ్రవరి 4: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగలింది. ఆ పార్టీని వీడి 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఐటి.వరం ఎస్సీపాలెంలో 50 కుటుంబాలు, ఆదయ్య పాకాల్లో సుగాలిలు 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., గత ఎన్నికల్లో వైసీపీ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసంతో గెలుపొందిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలన చేసిన మంత్రి సురేష్‌కు ఐటి.వరంలో జరిగిన అభివద్ధి పనులు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సీసీరోడ్లులు, డ్రైనేజీ లేక మురుగునీరు రోడ్డుపై పారుతోందన్నారు. ఇక్కడ నాయకుడు షాడోగా మారి మండల పరిషత్ నిధులు రూ.40 లక్షలు మింగేసి అభివృద్ధిని తుంగలో తొక్కారన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని మంత్రి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అక్టోబరు మొదటి వారంలో వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇక్కడ పోటీ చేస్తే ఓడిపోతారన్న భయంతోనే మంత్రి సురేష్ ఇక్కడ నుంచి పరారయ్యారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు శనగా నారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, పోట్ల గోవిందు, మన్నెయ్య పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి టీడీపీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గజ్జల కొండ గ్రామంలో బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవాజి రామానుజులరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పార్టీ నాయకులు నారు వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

మురుగు కదలక, దుర్గంధం వీడక

- విజృంభిస్తోన్న దోమలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 4 : ఎర్రగొండపాలెంలో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటరు పొడవున ఉన్న సైడు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోజుల తరబడి మురుగునీరు ముందుకు కదలకపోవడంతో దోమలువ్యాప్తి చెందుతున్నాయి. చలికాలం అయినప్పటికీ, సాయంత్రం 5 గంటలైతే దోమలు విజృంభిచేస్తున్నాయి. కాల్వలో పెరిగే దోమలు పక్కనే నివాసగృహాల్లో చేరి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. సాయంత్రం అయిందంటే బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై, వీధుల్లో నిల్చోవాలంటే దోమకాట్లకు గురికావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఎర్రగొండపాలెంలోని ఇందిరానగర్ ఏరియాలో మసీదు బజారులో సైడు కాల్వలు లేక మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండి ముందుకు కదలడం లేదు. జాతీయ రహదారి పక్కన 1000 మీటర్లు పొడవునా లక్షలాది రూపాయలు ఖర్చుచేసి సైడు కాల్వలు నిర్మించినా ఉపయోగం లేకుండా ఉంది. సైడు కాల్వలపై భవనాల యజమానులు కొన్నిచోట్ల బడ్డీ బంకులు ఏర్పాటు చేయించి, రేకుల షెడ్లు నిర్మించి అద్దెలకు ఇచ్చారు. సైడు కాల్వలు శుభ్రం చేయాలంటే అడ్డంకులు ఉండడంతో నెలల తరబడి శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో దోమలు వ్యాపించి వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సైడు కాల్వలపై అడ్డంకులు తొలగించి శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


మురుగుతో నిండిన కాలువ

ఎదురెదురుగా ఆర్టీసీ బస్సులు ఢీ..

- తప్పిన పెను ప్రమాదం


ఎదురెదరుగా ఢీకొన్న బస్సులు

తర్లుపాడు, ఫిబ్రవరి 4: మండలంలోని తాడివారిపల్లె ఘాట్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. బస్సులకు ముందు భాగాలు స్వలంగా ధ్వంసం అయ్యాయి. ప్రయాణికులు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గిద్దలూరు నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఒంగోలు నుంచి గిద్దలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తాడివారిపల్లె ఘాట్ రోడ్డులోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇరువురు డ్రైవర్లు నిర్లక్ష్యం కారణంగానే బస్సులు ఢీకొన్నట్లు తెలుస్తోంది. తాడివారిపల్లె ఎస్‌ఐ వేముల సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న కారు- ఒకరి మృతి

పొదిలి, ఫిబ్రవరి 4 : కారు చెట్టును ఢీకొన్న ఘటనలో మాలపాటి సంధ్య(24) మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన అన్నా, చెల్లెలు అయిన మాలపాటి అశోకొరెడ్డి, మాలపాటి సంధ్యలు కారులో ఒంగోలు వెళ్లి తిరిగి స్వగ్రామం పునుగోడు కు వస్తున్నారు. సమయంలో పొదలి మండలం కాటూరివారిపాలెం గ్రామం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో సంధ్య అక్కడిక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరు కొని క్షతగాత్రులను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అశోకొరెడ్డికి కాళ్లు స్టీరింగ్ మధ్యపడి తీవ్రగాయాలయ్యాయి. ఆయన ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను సేకరిస్తున్నారు.


మృతిచెందిన సంధ్య


చెట్టును ఢీకొన్న కారు

ఏలూరి అరెస్టుకు ఒత్తిడి

- ఆయన్ను ఒక్కరోజైనా జైల్లో పెట్టాలని పోలీసులకు వైసీపీ పర్చూరు ముఖ్యనేత పదేపదే ఫోన్లు
- ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు ఎమ్మెల్యే, టీడీపీ బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావును ఎలాగైనా జైలుకు పంపించాలన్న లక్ష్యంతో వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ కేసులో ఆయన పేరును ఇరికించడమే కాక ఒక్కరోజైనా జైలులో పెట్టించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. పర్చూరు నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత అందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మార్టూరులో టీడీపీ అభిమానుల గ్రానైట్ క్వారీల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా అధికారులు ప్రైవేటు వ్యక్తుల కార్లలో రావడం, ఆప్రైవేటు వ్యక్తులు తమవెంట కర్రలు, కారం తీసుకురావడంతో గ్రానైట్ వ్యాపారులు భయ భ్రాంతులకు గురయ్యారు. అంతేగాక అధికారితో వచ్చిన ప్రైవేటు వ్యక్తి ఒకరు వైసీపీలోని ముఖ్యనేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాంబశివరావు అక్కడికెళ్లి వ్యాపారులకు మద్దతుగా నిలిచి నిబంధనల ప్రకారం క్వారీల్లో తనిఖీలు చేసుకోవాలని మైనింగ్ అధికారులకు సూచించారు. వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన కర్రలు, కారంపొడిని గుర్తించి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాలతో అక్కడికి వచ్చిన కిందిస్థాయి పోలీసు అధికారులకు వాటిని అప్పజెప్పి నియోజకవర్గంలో జరగనున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కార్యక్రమానికి వెళ్లిపోయారు.

ఏలూరితోపాటు మరో ఆరుగురిపై కేసు

వైసీపీ నేతల ఒత్తిడితో విధి నిర్వహణలో అధికారులను అడ్డుకున్నారనే నెపంతో అదేరోజు సాయంత్రం సాంబశివరావుతోపాటు మరో ఆరుగురిపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితో మరో 20 మంది ఉన్నట్లుగా ఫిర్యాదులో పేర్కొనగా వారిపైనా కేసు బనాయించారు. ఉద్యోగులతో వచ్చిన రౌడీల వ్యవహారంపై వ్యాపారులు పెట్టిన ఫిర్యాదులను మాత్రం పట్టించుకోకుండా పక్కనేశారు. అనంతరం ఆ కేసులో ఆరుగురు వ్యాపారులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపగా వారికి ఒక్కరోజులోనే బెయిల్ వచ్చింది. ఈనేపథ్యంలో మార్టూరు సీఐగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న రాజశేఖర్‌రెడ్డికి వైసీపీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేత ఫోన్‌చేసి 'మీరు వెంటనే ఆ కేసుపై దృష్టిపెట్టాలి. ఎమ్మెల్యే సాంబశివరావును అరెస్టు చేయాలి. కేసుకు సంబంధించిన మరో 20 మంది వ్యాపారులను కూడా జైలుకు పంపాలి' అని మాట్లాడినట్లు తెలిసింది. ఆయన ఇప్పుడే బాధ్యతలు చేపట్టాను మాట్లాడదామని చెప్పగా ఆ తర్వాత జిల్లా, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి అరెస్టు చేయాలని కోరుతున్నట్లు సమాచారం.

కోర్టు నిర్ణయం వచ్చే లోపే అరెస్టుకు ఒత్తిడి

ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం తీర్పు వెలువడనుంది. ఈనేపథ్యంలో శనివారం మార్టూరు పోలీసుస్టేషన్‌కు కొంతమంది వైసీపీ నాయకులు వెళ్లి ఆకేసులో మిగిలిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. ఆతర్వాత సదరు ముఖ్యనాయకుడు నియోజకవర్గ, జిల్లాస్థాయి పోలీసు అధికారులతోపాటు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఒక్కరోజైనా ఏలూరిని కటకటాల వెనక్కు పంపాలి. మీరు వెంటనే ఆపనిచేస్తారా? లేదా? అని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. మంగళగిరి పార్టీ ఆఫీసులో ఆదివారం టీడీఎల్పీ సమావేశం ఉన్నందున అక్కడికి ఎమ్మెల్యే ఏలూరి వస్తారని, అరెస్టు చేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. అయితే ఏలూరి ఆ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సోమవారం అసెంబ్లీ సమావేశాలకు ఆయన వచ్చే అవకాశం ఉందని, అక్కడ అరెస్టు చేయాలని సదరు నేత పోలీసులకు పదేపదే ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జడ్జి నిర్ణయం సోమవారం వెలువడే అవకాశం ఉంది. అయితే 'అసలే కుట్ర కేసు. ముందుగా అరెస్టు అయి రిమాండ్ కెళ్లిన నిందితులకు ఒక్కరోజులోనే బెయిల్ లభించింది. ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో తీర్పురానుంది. ఈనేపథ్యంలో వైసీపీ నేతలు ఎంత ఒత్తిడిచేసినా మేమేమి చేయగలం' అని పోలీసు అధికారులు వాపోతున్నారు. అయితే వైసీపీ నేతలు ఆశించినట్లు ఒక్కరోజైనా సాంబశివరావును అరెస్టు చేసి జైలుకు పంపుతారా? సోమవారం ఆయనకు హైకోర్టులో బెయిల్ వస్తుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

అవీ..ఇవీ..

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అవకాశం

కంభం, ఫిబ్రవరి 4 : కంభం బీఆర్‌అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చాముండేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న బాలికలు ఈనెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 4: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయదండలు, వివిధ పుష్ప మాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


అమ్మవారి విశేష అలంకరణ

రేపు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 4: ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న మార్కాపురంలోని మార్కెట్ యార్డులో దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఏడీఏ అర్చన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జనవరిలో యర్రగొండపాలెం, మార్కాపురంలో ఉపకరణాల గుర్తింపునకు శిబిరం నిర్వహించి అర్హులను ఎంపిక చేశారన్నారు. వీరందరికీ వీల్‌ఛైర్స్ ట్రై సైకిళ్లు, బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లు, చంకల కర్రలు, అందుల చేతి కర్రలు, వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేస్తారన్నారు. అప్పటిలో ఈ శిబిరానికి హాజరై రశీదు పొందిన వారు రశీదుతో పాటు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికేట్, ఆదాయ సర్టిఫికేట్, యూడీఐడీ కార్డు, 3ఫోటోలు తీసుకుని 6వ తేదీ ఉదయం మార్కెట్‌యార్డులో హాజరు కావాలన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

గిద్దలూరు, ఫిబ్రవరి 4 : గిద్దలూరు పట్టణంలో పారిశుధ్య కార్మికులు వీధుల్లో చేపడుతున్న పనులను ఆదివారం ఉదయం మున్సిపల్ కమీషనర్ వి.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజారోగ్య రక్షణలో మెరుగైన పారిశుధ్యం చాలా అవసరమని, పరిసరాల పరిశుభ్రత ద్వారానే ప్రజా ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని, పారిశుధ్యంపై అశ్రద్ధ చేయవద్దని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణ కోసం రిక్షాలు వస్తున్నందున ప్రజలు వ్యర్థాలను రోడ్లపై పారవేయవద్దన్నారు. ముఖ్యంగా కాలువల్లో అసలు వేయవద్దని, చెత్తరిక్షాలలో మాత్రమే చెత్తను వేసి సహకరించాలని ఆయన ప్రజలను కోరారు.


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేపు ప్రజా సంఘాల ధర్నా

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 4: వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 6న స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘాల నాయకులు సోమయ్య, గుమ్మా బాలనాగయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రతినిధులు

గిద్దలూరు, ఫిబ్రవరి 4 : పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని మరియాల స్వామి దేవాలయం ఆవరణలో రజక సేవాసంఘ ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమయ్యారు. పేద రజకుల అభివృద్ధికి చొరవ చూపాలని సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రజక సేవా సంఘం అధ్యక్షులుగా పాలకవీటి బాలచెన్నయ్య, గౌరవాధ్యక్షులుగా కొమరోలు శ్రీనివాసులు, అలసందలపల్లి పాండు, కార్యదర్శిగా చలిజాముల పెద్దకాదరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని రజక సేవాసంఘం ప్రతినిధులు ఆవులమంద శ్రీనివాసులు, రాజు, తదితరులు ఘనంగా సన్మానించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు : పీడీ


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

తర్లుపాడు, ఫిబ్రవరి 4: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 1.4.2022 నుంచి 31.3.2023 వరకు మండలంలో జరిగిన 466 పనులకు రూ.9 కోట్ల వరకు హెచ్చించారు. ఈ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన అవకతవకలపై తనిఖీ బృందాలు ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఎక్కువగా కొలతల్లో తేడా మస్టర్లలో మాయాజాలం, మొక్కలు లేకుండనే బిల్లులు చేసినట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన వారిపై రికవరికి ఆదేశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, విజిలెన్స్ అసిస్టెంట్ పీడీ వెంకటస్వామి, ఎంపీడీఓ నరసింహులు, ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు, ఏపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రేపు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

దొనకొండ, ఫిబ్రవరి 4 : మండల కేంద్రమైన దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో టీడీపీ యువ నాయకుడు కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి మంగళవారం సాయంత్రం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గ పరిశీలకుడు నాదెండ్ల బ్రహ్మంచౌదరి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు తదితరులు హాజరవుతారని కుందుర్తి లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పామూరులో ట్రాఫిక్ కష్టాలు

- యథేచ్ఛగా మార్జిన్ల ఆక్రమణ
- పార్కింగ్ స్థలాలు కరువు
- నడిరోడ్డుపైనే నిలిపివేస్తున్న వాహనాలు

పామూరు, ఫిబ్రవరి 4 : పామూరు పట్టణంలో దశాబ్దాలుగా రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్ల ఆపై ఆక్రమణలతో పార్కింగ్ సౌకర్యం లేకుండా పోయింది. దుకాణాల ఎదుట నడిరోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నడిచివెళ్లే ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. మరోపక్క పెరుగుతున్న వాహనాలతో రోడ్లన్నీ ఇరుకుగా మారాయి. దుకాణదారులు వ్యాపార హోర్డింగ్‌లు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను రోడ్డు మార్జిన్‌ల వద్ద ఏర్పాటు చేస్తుండడంతో ఎదురెదురు వాహనాలు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పట్టణంలో 25వేల జనాభా నివాసం ఉంటున్నారు. పామూరుకు ప్రతి రోజు వివిధ గ్రామాల నుంచి రాకపోకలు ఎక్కువయ్యాయి. పట్టణంలో మమ్మీడాడీ సెంటర్, సీఎస్‌పురంరోడ్ జంక్షన్, విరువూరు రోడ్, కనిగిరి రోడ్ సెంటర్‌లలో ఉన్న దుకాణాలకు ఇరువైపులా ఆక్రమణ జరిగింది. నిత్యావసర సరుకుల కోసం వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్ల పైనే పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. ఒకవైపు విస్తరణకు నోచుకోని రోడ్లు, మరో వైపు బహుళ అంతస్తుల దుకాణాల సముదాయాలు, వాటికి తగ్గ పార్కింగ్ స్థలాలు లేక వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ వరకు ఆక్రమించి సామగ్రిని ఉంచడంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ, ఇటు పోలీసు, పంచాయతీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న పాత బస్టాండ్ సెంటర్



నెల్లూరు రోడ్‌లో దుకాణాల ముందు ఉన్న బోర్డ్



మిషన్ కుడుతూ మహిళలను ఉత్సాహపరుస్తున్న డాక్టర్ కవిత

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు కవిత

కనిగిరి, ఫిబ్రవరి 4: మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదగాలని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర సతీమణి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు ముక్కు కవిత అన్నారు. టీడీపీ మహిళాశక్తి కార్యాలయంలో ఆదివారం మహిళలు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత మాట్లాడుతూ చేతి వృత్తుల ద్వారా ఎంతో మంది మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు అండగా ఉన్నారన్నారు. కనిగిరి ప్రాంతంలో ఉపాధి పరిశ్రమలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఇలాంటి చేతి వృత్తులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా ఆధునికంగా ఎదిగేందుకు మహిళల్లో చైతన్యం రావాలన్నారు. కుట్టు, అల్లికలు, ఎంబ్రాయిడరీ వంటి పనులు గతంలో చేతి పనులు చేశావారని వాటిల్లో కూడా అత్యాధునిక మిషన్లు వచ్చాయన్నారు. వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. స్టిచ్చింగ్ ద్వారా ఎంతో మంది మహిళలకు ఉపాధి తెచ్చి పెడుతుందన్నారు. మహిళలు స్వయం సహాయాభివృద్ధికి జననీ చారిటబుల్ ట్రస్టు చేయూత అందిస్తుందన్నారు. శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక పురోగతి చెందాలన్నారు. తొలుత డాక్టర్ కవిత మిషన్ ద్వారా కుట్టి చూపించడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. కార్యక్రమంలో తెలుగు మహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్లు షేక్ వాజిదా బేగం, బొగ్గరపు శ్రీలత, తులసి, దొరసాని, నారాయణమ్మ, అమ్ములమ్మ, వెంకటలక్ష్మమ్మ, ఫాతిమా, సుధ, దుర్గ, ధనలక్ష్మీ, రమణ, కరిమున్నీసా, షేక్ జహీరా, మహిళలు పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో ప్రజాధనం దోపిడీ



మస్తానయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణ

పామూరు, ఫిబ్రవరి 4 : నవర్నాల పేరుతో వైసీపీ పాలకులు ప్రజాధనాన్ని దోపిడీ చేశారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఆరోపించారు. మత సామరస్యవాది, పామూరు ప్రాంత బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సీరుకట్టు మస్తానయ్య వర్ధంతి కార్యక్రమం జీవైఆర్ భవన్‌లో ఆకుల మోహన్‌రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముందుగా కందుకూరు రోడ్‌లోని మస్తానయ్య స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం పేరుతో జగన్‌రెడ్డి లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చారన్నారు. ఇలాంటి దోపిడీ పాలకులకు వచ్చే ఎన్నికల్లో గద్దెదింపాలన్నారు. మస్తానయ్య ఆశయ సాధనగా కార్యకర్తలు కృషి చేయాలని నారాయణ పిలుపునిచ్చారు. సభలో జిల్లా కార్యవర్గసభ్యుడు సచ్చద్ మౌలాలి, నియోజకవర్గ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, పామూరు, సీఎస్‌పురం మండల కమిటీ కార్యదర్శులు కే ప్రభాకర్, షేక్ పెదమస్తాన్, రాగిపాటి సూరిబాబు, పి.మస్తాన్, ఇర్రి వెంకటరెడ్డి, రఘునాథరెడ్డి, నరసింహారావు, షేక్ సత్తార్, నాగూర్, మహేష్, అబ్బిశెట్టి, ఎస్టీయు సంఘం నాయకులు, భైరెడ్డి వెంగళరెడ్డి, రఘునాథరెడ్డితోపాటు కార్యకర్తలు, మస్తానయ్య అభిమానులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానం

మున్సిపల్ చైర్మన్ గఫార్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి, ఫిబ్రవరి 4: విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం విజేత కళాశాల ఐఐటీ, నీట్ అకాడమీ వారి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఏటా విజేత కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధిస్తూ పోటీతో ముందుకు దూసుకు పోతున్నారరన్నారు. అంతే కాకుండా విజేత కళాశాలలో ఉత్తమ విలువలు, క్రమశిక్షణ, పర్యవేక్షణతో కూడిన విద్యను అందిస్తూ తోటి కళాశాలలకు దీటుగా నిలుస్తుందన్నారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధించడం శుభ పరిణామమన్నారు. ఇస్కాన్ సంస్థ సభ్యుడు జీ శ్రీధర్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు తమ సంస్థ ఆర్థికంగా ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పసుపులేటి ఆరుణోదర్, ప్రిన్సిపాల్ శ్రీరాములు, గోమతి స్కూల్ కరస్పాండెంట్ బాలు ప్రసాద్‌రెడ్డి, పీఎస్‌వరం సాయి స్కూల్ కరస్పాండెంట్ ముక్కు వెంకటేశ్వరరెడ్డి, నరసింహారావు, మాలకొండయ్య, కోటిరెడ్డి, మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, రసూల్, పసుపులేటి వాణి, కౌన్సిలర్ దీప, వాగిచర్ల వెంకటేశ్వర్లు, కేవి రమణారెడ్డి, కనమర్లపూడి లక్ష్మీమోహన్, మానవతా, మదర్ సేవా సమితి సభ్యులు, అధ్యాపక బృందం, బల్లిపల్ల సర్పంచ్ మోహన్‌రావు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పిచ్చయ్య

దర్శి ఫిబ్రవరి 4 : దర్శి పట్టణంలోని 14వ వార్డులో ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి ఆ ప్రాంతంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాల ని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాల ని, మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. గత కొద్దిరోజులుగా దోమలబెడద విపరీతమైనట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామగిరి పాల్గొన్నారు.

నాగంబొట్లపాలెం జట్టుకు అభినందనలు

తాళ్లూరు, ఫిబ్రవరి 4 : మారుమూల గ్రామానికి చెందిన నాగంబొట్లపాలెం సచివాలయం జట్టు జిల్లా స్థాయిలో క్రికెట్ విజేతగా నిలిచి తాళ్లూరు మండలానికి మంచి పేరు తీసుకు వచ్చారని జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి అభినందించారు. ఆడుదాం-ఆంధ్రాలో భాగంగా నిర్వహించిన పోటీల్లో నాగంబొట్లపాలెం సచివాలయ జట్టు క్రికెట్‌లో మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి విజేతగా నిలవడంతో ఆదివారం క్రీడాకారులను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రియాంక నాగార్జునరెడ్డి, సర్పంచ్ చిమటాసుబ్బారావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, ఎంపీడీవో కెవైకీర్తి, పలుశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

పామూరు, ఫిబ్రవరి 4 : పామూరు విశ్వబ్రాహ్మణ సంఘం మండల, పట్టణ, మహిళా కమిటీలను విరాట్‌నగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ఎన్నుకున్నట్లు జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు ఎం.దొరసానయ్యచారి తెలిపారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షునిగా సీ హెచ్ శ్రీనివాసచారి, అధ్యక్షునిగా నొస్సం నాగేంద్రచారి, ఉపాధ్యక్షుడిగా పీ బాలబ్రహ్మచారి, వీ సురేష్, కార్యదర్శి, విశ్వరూపచారి, సహాయ కార్యదర్శి మహంకాళి విజయ్, కోశాధికారిగా బీ రమణాచారి, సహయ ఖోశాదికారి, లంకనపల్లి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంటుగా సానాల శ్రీశైలం, పట్టణ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా తాండాయి కృష్ణ, పట్నం పెంచలయ్య, అప్పారావు, కార్యదర్శి బీ చెంచురత్నం, ఉపకార్యదర్శి పి శ్రీనివాసులు, నాగేంద్రచారి, కోశాధికారి బీ బాలబ్రహ్మచారి, రఘు, వర్కింగ్ అధ్యక్షులు పీ నీలకంఠచారి, మహిళా కమిటీ గౌరవ అధ్యక్షులుగా బీ లక్ష్మీప్రసన్న, అధ్యక్ష ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, ధనలక్ష్మి, ఎస్.రామతులసితోపాటు మరో 10 మందిని ఎన్నుకొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

దొనకొండ, ఫిబ్రవరి 4 : వీరవెంకటాపురంకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యకర్త మాలపోటు వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మార్కాపురంలో వైద్య సేవలు పొంది ఇంటికి చేరారు. సమాచారం తెలుసుకు న్న టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు ఆదివారం వెంకటయ్య ఇంటికి వెళ్లి ప్రమాదం తీరు, ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితిని తెలుసుకున్నారు. అధైర్యపడొద్దన్నారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం కొంతమేర నగదును అందజేశారు. ఆయన వెంట టీడీపీ బీసీ సెల్ దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, షేక్ తోహీద్ ఉన్నారు.

వృత్తే దైవంగా భావించిన వీరాంజనేయులు



వీరాంజనేయులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పామూరు, ఫిబ్రవరి 4 : ఉపాధ్యాయ వృత్తే దైవంగా భావించి విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన హస్తీ వీరాంజనేయులు ప్రజల మన్ననలు పొందారని ఎంఈవో ప్రసాదరావు అన్నారు. సీఎస్ పురం మండలం సీనాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన హస్తీ వీరాంజనేయులు సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎలాంటి రిమార్కులు లేకుండా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు, కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరాంజనేయులుతో పాటు పామూరు యూటీఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, ఎం.శ్రీనివాసరాజు, గల్లా చెన్నయ్య, షేక్ ఖాజాహుసేన్, కే నాగేశ్వరరావు, ఎన్.వీరబ్రహ్మం, ఏవీ సుబ్బరాజు, వీపీ వెంకటసుబ్బయ్య, ముప్పాళ్ల సురేష్, కృష్ణారావు, డీ ఉదయ్‌కుమార్, జీ మాలకొండయ్య, ఎం.రామారావు, డీ సత్యనారాయణ ఎం, నరసరాజు, సీహెచ్.మోహన్‌రావు, మేడసాని సుబ్బరావు, దేవరపు శ్రీనివాసులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు మండలం దాదిరెడ్డిపల్లి, సట్టుమడుగు వాసులు

టీడీపీ గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి

- మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- వరుస చేరికలతో క్యాంప్ కార్యాలయంలో సందడి
- వైసీపీని వీడిన పామూరు, పీసీపల్లి మండలాలకు చెందిన 99 కుటుంబాలు

కనిగిరి, ఫిబ్రవరి 4 : తెలుగుదేశం పార్టీ గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి మలుపు తిరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం పీసీపల్లి మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన 17 కుటుంబాలు, పామూరు మండలం దాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలన రావణాసురిడి పాలన తలపించేలా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తూ జగన్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోకపోతే రాష్ట్రం కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలో పేద, దళితులను బెదిరించి వైపీపీ నేతలు వారి భూములను ఆక్రమించుకున్నారన్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీలో చేరిన వారికి సూచించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి టీడీపీ, వైసీపీ పాలనకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ ప్రాంతంలో వలసలు, ఫ్లోరైడ్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని డాక్టర్ ఉగ్ర హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు నీళ్లు అన్ని మండలాలకు మళ్లించేలా చొరవ చూపతానన్నారు. విద్యార్థులకు ఉన్నత చదువులు, నిరుద్యోగులకు ఉపాధి, మెరుగైన రవాణా వంటివి చేసి చూపిస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించేలా శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

వైసీపీలో 420 బ్యాచ్

2019 ఎన్నికల్లో వైసీపీని, ఆ నేతలను నమ్మి ఓట్లేసి గెలపించడమే కాకుండా వైసీపీకి ఎంతో నమ్మకంగా పనిచేశామని, కానీ గెలిచాక తమను కానీ, తమ గ్రామాన్ని వైసీపీ నేత పట్టించుకోవలేదని ముద్దపాడు గ్రామ ఉపసర్పంచ్, వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారు డాక్టర్ ఉగ్ర ఎదుట వాపోయారు. వైసీపీలో ఉన్న నాయకులంతా 420 బ్యాచ్ అని తెలుసుకోటానికి నాలుగేళ్లు పట్టిందని ఉపసర్పంచ్, గ్రామస్థులు పేర్కొన్నారు. జగన్ పాలనలో తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని నమ్మిన తనను పీసీపల్లి మండల నాయకులతో పాటు, ముఖ్యనేత మోసం చేశారన్నారు. ప్రజల్ని, కార్యకర్తల్ని మోసం చేసిన వారికి ఎప్పుడు మనుగడ ఉండదన్నారు. టీడీపీ హయాంలో తమ గ్రామానికి వేసిన రోడ్డే ఇప్పటి వరకు దిక్కైందన్నారు. వైసీపీ వచ్చాక ఏ అభివృద్ధీ జరగులేదన్నారు. డాక్టర్ ఉగ్ర కార్యదక్షత ను నమ్మి ఆయన కోసం పని చేయడానికి తెలుగుదేశం పార్టీలో చేరానన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి కలసి కట్టుగా పనిచేసి ముద్దపాడు గ్రామంలో అత్యధిక మెజార్టీ తీసుకువస్తామన్నారు. తమ ఊరికి తారు రోడ్డు వేయించాలని ఉపసర్పంచ్ బండారు విష్ణు, ముద్దపాడు గ్రామస్థులు కోరారు. డాక్టర్ ఉగ్ర ఎన్నికల గెలిచిన అనతి కాలంలోనే మద్దపాడుకు తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు.

ముద్దపాడు నుంచి 17 కుటుంబాలు చేరిక

ముద్దపాడు గ్రామ ఉపసర్పంచ్ బండారు విష్ణు ఆధ్వర్యంలో ఆయా గ్రామానికి చెందిన 17 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బండారు వెంకటేశ్వర్లు, పెద వెంకటేశ్వర్లు, శ్రీను, తిరుపతయ్య ప్రసాద్, సురేష్, శివ, బాబు, నాగరాజు, నూకతోటి చెన్నకేశవులు, నోసిన రవి, మాల్యాద్రి, మాల్యాద్రి, బాలయ్య, రామ్మూర్తి, అంద్రా రామాంజనేయులు, తదితరులు చేరినవారిలో ఉన్నారు.

దాదిరెడ్డిపల్లి గ్రామం నుంచి 40 కుటుంబాలు ..

పామూరు మండలంలోని దాదిరెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ బద్దిపూడి సారమ్మ, మార్క్ ఆధ్వర్యంలో 40కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన 25 కుటుంబాలు

పామూరు : ఒక్క చాన్స్‌తో వచ్చిన జగన్‌రెడ్డి అవినీతి అరాచక పాలనతో అక్రమార్కుడులా తయారయ్యారని మాజీ ఎమ్మెల్యే ఉగ్ర అన్నారు. దాదిరెడ్డిపల్లి పంచాయతీ సట్టుమడుగు గ్రామ ఎస్సీకాలనీకి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఉగ్ర వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బలహీనవర్గాల ద్రోహి జగన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. పార్టీలో చేరినవారిలో కొలనీడి నారాయణ, నడవ పెద్ద గురవయ్య, పెద బాలయ్య, వెంకటనారాయణ, హరి, ప్రసాద్, నరేష్, ఆదినారాయణ, బాబు, నవీన్, నాగార్జున తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలకమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య కల్లూరి బద్దిపూడి మార్కు, కొంపెల్లి రాజేంద్ర, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో ఉగ్ర పాల్గొన్నారు. ముందుగా వాసవీ మాత దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం తరఫున ఉగ్రను ఘనంగా సన్మానించారు. అనంతరం ఫంక్షన్‌మాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు వై బాలకొండలు, ఎం.సుబ్బారావు, రమేష్, పరకోటి చంద్ర, లక్ష్మణరావు, దరిశి మస్తాన్‌రావు, శేగు కృష్ణయ్య, నరసింహారావు, పందిటి హరీష్, తడికమళ్ల సుబ్బారావు, మెంటా నరసింహారావు, వేణుగోపాల్, హరగోపాల్, నరసింహారావు, వెంకటస్వామి, బాల పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండలం కృష్ణంపల్లి పంచాయతీ మాసాయిపేట గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన 17 కుటుంబాల వారు డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో హైజాక్, నాగేష్, జ్యోతిబాబు, కృపయ్య చిన్నబాబు, జీవయ్య, రూబేను, ఏసురత్నం, ఆమోతు, యాకోబు, సాల్మన్‌తోపాటు మరికొన్ని ఎస్సీ కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తాతిరెడ్డి తిరుపతిరెడ్డి, అచ్చయ్య, శ్రీనివాసరెడ్డి, ఎస్.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల నిర్వహణపై సభ్యుల ఆగ్రహం

- మా సహకారం లేకుండా అభివృద్ధి ఎలా ..?
- రైతులకు పంట నష్ట పరిహారం చెల్లింపులో జాప్యంపై నిలదీత



ప్రశ్నిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు

తాళ్లూరు, ఫిబ్రవరి 4 : గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజాప్రతినిధుల సహకారం లేకుండా అధికారుల కమిటీలతో చేపడితే ఎలా ముందుకు సాగుతాయని, పనులు ఎలాజరుగుతాయని అధికారజడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంపీడీవో కేవై యుగకీర్తి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పరిధిలో మంజూరైన నిధులు, పనుల వివరాలను ఏఈ వాలి వివరిస్తుండగా పనులు ఎవరి పర్యవేక్షణలో జరుగుతాయని ఎంపీపీ, జడ్పీటీసీలు ప్రశ్నించారు. పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పనులు చేపట్టే సమయంలో ఏవైనా అభ్యంతరాలు వస్తే పరిష్కరించేందుకు ఎవరు ముందుకు వస్తారని ప్రశ్నించారు. గతంలో నాడు-నేడు కింద కూడా అధికారుల కమిటీలవల్ల పనులు పూర్తి కాకపోగా ప్రభుత్వం నుంచి విడుదలైన సిమెంట్ గడ్డకట్టిపోగా, ఇనుము తుప్పు పట్టి ప్రజా ధనం వృథా అయిందని సభ్యులు నిలదీశారు. విఠలాపురం సర్పంచ్‌మారం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే పనులకు సర్పంచ్‌లతో కూడిన కమిటీలతో చేయిస్తే త్వరితగతిన పూర్తవుతాయన్నారు. దీనిపై ఎంపీడీవో కీర్తి మాట్లాడుతూ తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వం చేపట్టిన పాలసీ మేటర్ ప్రకారం నడుచుకోవాలన్నారు. ప్రజాధనం వృథాకాకుండా పనులు చేయించాలని సభ్యులు ఎంపీడీవోకు సూచించారు. పంట నష్టపరిహారం కొందమందికి రైతులకు అందలేని, పలుమార్లు అధికారం దృష్టికి తీసుకెళ్లినా ఎందుకు అందడం లేదని సర్పంచ్ మారం ఏవోని ప్రశ్నించారు. వెంటనే న్యాయం చేయాలన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటులో జాప్యంపై సర్పంచ్‌లు ఇంద్రసేనారెడ్డి, మంచాల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు విద్యుత్ ఏఈని నిలదీశారు. మల్కాపురం గ్రామంలో జగనన్న ఇళ్ల కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లపై విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయని సర్పంచ్ కాలేషావలి అన్నారు. ఇళ్ల నిర్మాణాలు, బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై సభ్యులు హౌసింగ్ ఏఈని ప్రశ్నించగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో ఆలస్యం జరుగుతున్నదని త్వరలో విడుదల అవుతాయని ఏఈ కోటిరెడ్డి తెలిపారు. పలుశాఖలపై చర్చ నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపాధి కింద చేపట్టే రైతువారీ పనులకు ప్రాధాన్యత నివ్వాలని, ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నందున ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఒత్తిడి చేయవద్దని అధికారులకు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్‌ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక, మండల కోఆప్షన్ కరిముల్లా, వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్, పశువైద్యాధికారి రాంబాబు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరెడ్డి, సీడీపీవో సీహెచ్.భారతి, ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు పాల్గొన్నారు.

గ్రామోత్సవాలతో ఐక్యతను చాటాలి

కనగిరి, ఫిబ్రవరి 4: గ్రామోత్సవాల నిర్వహణతో ప్రజల్లో ఐక్యతను చాటాలని కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని గురవాజీపేట గ్రామంలో ఆదివారం సంగమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కస్తూరిరెడ్డి అమ్మవారి ఊరేగింపు ప్రభలను ప్రారంభించారు. కార్యక్రమంలో పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.





పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు

గరం గరం

ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో వైసీపీలో పరిస్థితి గరంగరంగా మారుతోంది. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పార్టీకి దూరమయ్యారు. తాజాగా పలువురు ఆయన బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఇప్పటి వరకు సమావేశాలు, ప్రకటనలకే పరిమితమైన అసమ్మతి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమైంది. జగన్‌పై కినుకతో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నేరుగా రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు. మరోవైపు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కొద్దిరోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న మక్కెన తన అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలోనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పల్నాట అధికార పార్టీలో రాజకీయం రంజుగా మారుతుండగా.. స్థానిక నేతపై వివక్ష చూపుతూ రాజకీయ బదిలీపై తీసుకువచ్చిన నేతపై అధిష్ఠానం ఆపేక్ష చూపుతుండటంపై క్యాడర్ అయోమయానికి గురవుతోంది.

- పల్నాడు వైసీపీలో విభేదాలు
- గురజాలలో కాసు వర్సెస్ జంగా
- ఫ్లెక్సీల్లో జంగా ఫొటో లేదని తొలగింపు
- స్వగ్రామంలో కార్యక్రమానికి పిలుపులేదని ఎమ్మెల్సీ ఆగ్రహం
- గామాలపాడులో కాసు, కృష్ణమూర్తి వర్గీయుల మధ్య ఉద్రిక్తత

ప్రొటోకాల్ రగడ.. సభ వాయిదా

- ఎందుకొచ్చారని అధికారులపై జంగా ప్రశ్నల వర్షం

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: గురజాలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్సీ అయినా నియోజకవర్గంలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని జంగా ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సొంత గ్రామంలో జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేకపోవడంపై జంగా మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ జంగా వర్గీయుల మధ్య దాచేపల్లి మండలంలోని గామాలపాడులో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జంగా కృష్ణమూర్తి స్వగ్రామమైన గామాలపాడులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం, కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన తదితర కార్యక్రమాలను ఆదివారం ఏర్పాటు చేశారు. స్వగ్రామమైన గామాలపాడులో జరిగే ఆసరా సభకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కాని, స్థానిక అధికారుల నుంచి కాని ఎటువంటి పిలుపు లేకపోవడంతో జంగా తీవ్ర అవమానంగా భావించారు. మాట మాత్రమైనా చెప్పకుండానే గ్రామంలో సభ ఎలా పెడతారని సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వరా అంటూ జంగా మండిపడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు వర్గీయులు గ్రామంలోని సచివాలయం, పంచాయతీ కార్యాలయం, ప్రధాన కూడలిలో జంగా, సర్పంచ్ ఫొటోలు లేకుండా ఎమ్మెల్యే కాసు, ఇతర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సురేష్ జంగా తనయుడే. ఈ క్రమంలో సమాచారం అందుకున్న జంగా వర్గీయులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు. తమకు తెలియకుండా తమ గ్రామంలో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం ఏమిటి.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ సహించబోమని ఫ్లెక్సీలు కట్టే వారిని హెచ్చరించారు. దీంతో కాసు, జంగా వర్గీయుల మధ్య తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఫ్లెక్సీల తొలగింపుపై వైసీపీ నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్‌ఐ సంధ్యారాణి గామాలపాడు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గుంటూరు నుంచి ఆదివారం ఉదయమే స్వగ్రామం గామాలపాడు చేరుకున్న జంగా నేరుగా సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న సీఐ సురేంద్రబాబు, ఇతర అధికారులతో మాట్లాడుతూ ఇక్కడ ఏమి జరుగుతుందని మీరందరు వచ్చారు.. ప్రశాంతంగా ఉన్న గ్రామాన్ని ఐక్యంగా ఉన్న గ్రామస్థులను ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని కోరారు. అధికారులే కావాలని ఉత్సాహం చూపుతున్నారని జంగా ప్రశ్నించారు. అనవసరమైన చోట ఉత్సాహన్ని చూపవద్దని, నేను ప్రభుత్వ విప్‌ను, ఎమ్మెల్సీని నాకు కార్యక్రమాలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా.. తనను గౌరవించాల్సిన అవసరం ఉందా లేదా అంటూ అని ప్రశ్నించారు. అధికారం ఎప్పుడూ ఒకేవైపు ఉండదు.. ఎవరికిచ్చే మర్యాదలు వారికి ఇవ్వాలని అధికారులను మీరంతా వెళ్లిపోవచ్చు.. ఇక్కడ ఏమీ జరగడం లేదు.. అని జంగా అధికారులకు స్పష్టం చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై తాను ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలోని తన నివాసంలో జంగా సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రొటోకాల్ విషయంపై ఏర్పడిన ఉద్రిక్తత వాతావరణంతో అధికారులు ఎమ్మెల్యే కాసుతో మాట్లాడి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

బీసీలంటే లోకువా?

మేము బీసీలు కావడమే నేరమా.. బీసీలుగా ఉండటమే మా తప్పా.. ప్రజాప్రతినిధులుగా ఉన్న సొంత గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించరా.. గౌరవించరా.. బీసీలంటే అంత లోకువయ్యామా.. బడుగు బలహీన వర్గాలంటే మాకు ఎంతో అభిమానమని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.. అంటూ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక నాయకుడిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీగా ఉన్న తనకు స్వగ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికే చెప్పకుండా ఎమ్మెల్యే కాసు ఎలా వస్తారని జంగా కృష్ణమూర్తి మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవి కన్నా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అయిన తన పదవి పెద్దదే అయినా అధికారుల నుంచి నేతల వరకు బీసీలంటే చిన్నచూపు అని తెలిపారు.



గామాలపాడు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ సురేంద్ర బాబు తదితరులు

దొరల పాలన సాగదు

- గురజాలకు ఎమ్మెల్యే కాసు చేసిందేమీలేదు
- అధికారం, డబ్బు, దోపిడీ శాశ్వతంగా ఉండదు
- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఆరోపణ

గురజాలలో అంబేడ్కర్ రాజ్యాంగం కొనసాగడం లేదు.. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రాజ్యాంగం నడుస్తుంది.. దొరల పాలన నడుస్తుంది.. ఇది ఎంతోకాలం సాగదు.. దీనికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. అని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యే కాసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గామాలపాడులో జంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమానికి తననుగాని, సర్పంచ్‌కి గాని సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులుగా తమను గౌరవించడం లేదని మండిపడ్డారు. అధికారం, డబ్బులు, దోపిడీ శాశ్వతం కాదని, అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే బలహీనవర్గాల ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే కాసుపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ అయిన తనను, సర్పంచ్ అయిన తన కుమారుడికిగాని మాటమాత్రమైనా చెప్పకుండానే అధికారులు తమ స్వగ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గామాలపాడు వాసిగా గుర్తించి ఆహ్వానించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. బడుగు బలహీనవర్గాలను వేధించడం, ఇబ్బందులు పెట్టడమే ధ్యేయమా, అవమానించడమే మీ లక్ష్యమా అని ప్రశ్నించారు. నిన్న గాక మొన్న గురజాలకి చెందిన కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజును బెదిరించడం, స్వామిమాలలో ఉన్నా మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టించారన్నారు. గతంలో కూడా భట్రుపాలెం, శ్రీనగర్ గ్రామాలకు చెందిన ఎస్సీ ఎస్టీలైన ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. గ్రామాల్లో చిచ్చుపెట్టి, మద్యం పోసి, డబ్బులిచ్చి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారని ఇది ఎంతమాత్రం తగదన్నారు. కోట్ల రూపాయలతో గురజాల అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కాసు చెబుతున్నారని కానీ ఆయన చేసింది ఏమీలేదని జంగా స్పష్టం చేశారు. 70 ఏళ్లుగా పిడుగురాళ్లకి నీళ్ల లేకపోతే తాను తెచ్చానని చెబుతున్నారని కాని ఎప్పుడు.. ఎక్కడ తెచ్చారని కాసును ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గోవిందాపురం నుంచి రూ.37 కోట్లతో కృష్ణా జలాలను పిడుగురాళ్లకు తీసుకొచ్చానని జంగా తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులతో చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ తాను చేసినట్లు కాసు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, మాజీ జడ్పీటీసీ భూషణం చెన్నయ్య, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మాశెట్టి పుల్లారావు, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్, మాజీ ఎంపీటీసీ జక్కా జానకిరామయ్య తదితరులున్నారు.

బొల్లా అహంకారి, డబ్బు గర్వం

- ఎమ్మెల్యే ధోరణితోనే వైసీపీని వీడుతున్నా
- పార్టీకి రాజీనామా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పదవి, డబ్బు గర్వంతో రాజకీయాలు చేస్తున్నారు. ఓట్లు వేసిన ప్రజలను అవమానిస్తున్నారు.. ఎమ్మెల్యే బొల్లా అహంకార ధోరణితోనే వైసీపీని వీడుతున్నాను.. అని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి రాజీనామా చేశారు. బొల్లా వ్యవహార శైలి వినుకొండలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన పది మందికి భిన్నంగా ఉందని, దౌర్జన్యాలు, అరాచకాలు, అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని కేజీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన తన రాజీనామాను ప్రకటించారు. తొలుత గుర్రం జాషువా, పులుపుల వెంకటశివయ్య, మక్కెన చినరామయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మక్కెన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై, వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి మీద అభిమానంతో జగన్‌ను సీఎం చేసేందుకు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను వీడి వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. పదవులు, అధికారం కోరుకోలేదని, గౌరవం మాత్రమే కోరుకున్నానని, కానీ అది లేకపోగా వ్యక్తిగతంగా నష్టం చేశారన్నారు. గతంలో వేల్పూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయుల సమక్షంలోనే గడిపూడి నరేంద్ర అనే రైతును ఎమ్మెల్యే చెప్పుతో కొట్టబోయారన్నారు. గతంలో నన్నపనేని సుధ భర్త డాక్టర్ లతీఫ్‌రెడ్డిపైన, ఇటీవల వినుకొండలో అంగన్‌వాడీలపై బొల్లా ప్రవర్తించిన తీరు బాధ వేసిందని, ఇవన్నీ ఆయన అహంకారానికి నిదర్శమన్నారు. బొల్లాపల్లిలో ఏర్పాటు కావాల్సిన ఆశ్రమ పాఠశాల శ్రీశైలం ప్రాంతానికి తరలివెళ్లిందన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో వెంకుపాలెం సమీపంలో ఏర్పాటు కావాల్సిన పథకం సత్తెనపల్లికి పోయిందన్నారు. ఐదు డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్‌లకు అనుమతి వచ్చినా పనులు నిలిచిపోయాయని, వీటికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. తనకు కేటాయించిన ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌ను కూల్చివేయవద్దని స్వయంగా ఎమ్మెల్యేకు తెలిపినా రాత్రికి రాత్రే కూల్చివేయించారన్నారు. బొల్లా తీరుపై అధిష్ఠానానికి చెప్పానని, వినుకొండ ప్రాంతంలో డబ్బు పెట్టుకునే వారు లేకపోవడం వల్ల మళ్లీ టికెట్‌ను బ్రహ్మనాయుడుకే కేటాయిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈ పరిస్థితుల్లో బొల్లాతో కలిసి వెళ్లలేనని అధిష్ఠానానికి తేల్చిచెప్పినట్లు మక్కెన తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు, నూజెండ్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ బ్రిడ్జి, సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు చేయించిన శ్రీకృష్ణదేవరాయలుకు వైసీపీ సీటు ఇవ్వలేమని చెప్పడం బాధేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు ఇక్కడే ఉంటానని, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభీష్టం మేరకు త్వరలో రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వరికపూడిశెల సాధన సమితి నాయకుడు డి.రమణారావు, తుమ్మా వెంకటరెడ్డి, గుత్తా కోటేశ్వరరావు, అనుముల ప్రసాద్, కౌన్సిలర్ నన్నేసా, సూర్యానాయక్, ఎలిశెట్టి నరసింహారావు, గుడివాడ చినగుర్నాథం, ఎ.వినయ్‌కుమార్, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, హాజరైన అనుచరులు

సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లలో జాప్యం

- కార్యాలయాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు



పిల్లలతో పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కొల్లూరు, ఫిబ్రవరి 4: సర్వర్ డౌన్‌తో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. దీంతో కొన్ని రోజులుగా లబ్ధిదారులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొల్లూరులోని సచివాలయం 1, 2, 3 పరిధిలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులను రిజిస్ట్రేషన్ నిమిత్తం ఆదివారం సచివాలయాల వద్దకు రావాలని వలంటీర్లు సమాచారం ఇచ్చారు. దీంతో లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పిల్లలతో కలిసి ఉదయం 9గంటలకే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. సాంకేతిక సమస్యలతో రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటు చేసిన సర్వర్లు మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు అసహనానికి గురయ్యారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 4: మండలంలోని ఓలేరు వద్ద కృష్ణానదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను ఆదివారం గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. నదిలో అడ్డగోలుగా ఇసుకను తవ్వడం వల్ల పంట పొలాలు నదిలో కలిసిపోతాయని, తవ్వకాలు చేస్తే ఊరుకునేది లేదని వాహనాలకు అడ్డుగా నిలిచారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నాయని తవ్వకందారులు చెప్పగా ఆ పత్రాలు తీసుకురావాలని అప్పటి వరకు ఇక్కడే ఉంటామని రైతులు భైఠాయించారు. దీంతో చేసేది లేక వాహనాలతో తవ్వకందారులు వెళ్లిపోయారు.

7 నుంచి ఢిల్లీలో హోదా కోసం నిరసన



పోస్టర్లు విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు జిలాని, పవన్‌తేజ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 4: ప్రత్యేక హోదాతో పాటు బడ్జెట్‌లోనూ వివక్షపై ఈనెల 7, 8, 9వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రత్యేకహోదా విద్యార్థి, యువజన జేఏసీ నేత జిలాని పిలుపునిచ్చారు. అరండల్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. జిలాని మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి స్వార్థ ప్రయోజనాలకు పాకులాడుతున్న వైసీపీకి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌర్య శీలం, షేక్ మహమూద్, ప్రదీప్, ఆరిఫ్ బాషా తదితరులున్నారు.

ఈ నెలా.. వేతలే



- ఐదో తేదీ వచ్చినా అందని వేతనం
- గత నెల 24న పెట్టిన బిల్లులకే జీతాలు
- దయనీయంగా ప్రభుత్వ పెన్షనర్ల కష్టాలు
- నాలుగేళ్లుగా జీతాల జాప్యంతో ఉద్యోగుల పాట్లు
- ఎన్నికలు సమీపిస్తున్నా మార్పులేని ప్రభుత్వ వైఖరి

గుంటూరు ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేతన వెతలకు విముక్తి కలగడంలేదు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ నెలలో జీతాలకు జాప్యం ఉండదు.. పరిస్థితులు మారతాయి.. అని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. 5వ తేదీ వచ్చినా అనేక విభాగాల ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఇక పెన్షనర్ల పరిస్థితి దయనీయంగా ఉంది. నాలుగేళ్లుగా ఏదైతే పరిస్థితి ఉందో అదే పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం వేతన జీవుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఒకటో తేదీ పోయి ఐదు రోజులు కావస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సగం మంది ఉద్యోగులకు కూడా కష్టార్జితం దక్కలేదు. తొలివిడతగా కిందటి నెల 24వ తేదీ నాటికి వేతన బిల్లులు పెట్టుకున్న ఒకటి అరా బిల్లులకు మాత్రమే వేతనాలు వచ్చినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతన బిల్లులను డ్రాయింగ్ అధికారులు ప్రతి నెలా 25వ తేదీ, ఆ తర్వాత మాత్రమే ట్రెజరీ కార్యాలయాలకు పంపుతారు. అతి కొద్దిమంది మాత్రమే 25వ తేదీలోపు బిల్లులు పెట్టుకుంటారు. అలా పెట్టుకున్న ఒకటి రెండు విభాగాల ఉద్యోగులకు మాత్రమే వేతనాలు ఇచ్చి ప్రభుత్వం మిగిలినవారి వేతనాలను పెండింగ్ పెట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా మారింది. రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వీరికి తోడయ్యారు. ప్రతి నెలా పదో తేదీ దాటకుండా వీరికి పెన్షన్లు, వేతనాలు దక్కడం లేదు. ఆర్బీఐ వద్ద ప్రతి మంగళవారం జరిగే బాండ్ల వేలం, రుణ పరిమితిపైనే వీరి వేతనాలు ఆధారపడ్డాయా అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 40శాతం మంది ఉపాధ్యాయులకు కూడా వేతనాలు దక్కలేదు. ఉమ్మడిజిల్లాలో ఇప్పటివరకూ ఒక్కరికి కూడా పెన్షన్ అందలేదు. ఆర్థికశాఖ కేంద్రకార్యాలయం చుట్టూ తిరిగితే తప్ప తమకు వేతనాలు, పెన్షన్లు పడే పరిస్థితిలేదని ఉపాధ్యాయులు, పెన్షనర్లు వాపోతున్నారు.

పోలీసు, సచివాలయ ఉద్యోగులకే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో దాదాపు 70 ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 50 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి తోడుగా వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సచివాలయ ఉద్యోగులు మరో 12 వేల మంది వరకూ ఉన్నారు. కార్యకలాపాల నిర్వహణలో కీలకమైన అన్ని ప్రభుత్వ శాఖలను వదిలేసి ప్రభుత్వం పోలీసు, సచివాలయ, వైద్య, న్యాయ శాఖల ఉద్యోగులకు మాత్రమే తొలివారం వేతనాలు అందుతున్నాయి. ప్రధానంగా పోలీసు, సచివాలయ ఉద్యోగులే ప్రభుత్వ ప్రాధాన్యంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలు సహా అన్ని ప్రాధాన్య శాఖల ఉద్యోగులకు మాత్రం రెండో వారంలోనో, పదో తేదీ తర్వాతనో ప్రభుత్వం వేతనాలు ఇస్తోంది.

రెండు నెలల తర్వాతైనా పరిస్థితి మారుతుందా?

మరో రెండు నెలల్లో వచ్చే ఎన్నికలపైనే వేతన జీవులు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే తమ కష్టాలు తీరుతాయని వారు బలంగా నమ్ముతున్నారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, తిరిగి కోలుకోలేనంతగా అప్పుల ఊబిలో ముంచేసిన ప్రస్తుత ప్రభుత్వ విధానాల నుంచి రాష్ట్రం ఎప్పుడు బయటపడుతుంది అనేది సమాధానం లేని ప్రశ్న! రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడేవరకూ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ కష్టాలు తప్పకపోవచ్చన్న భావన కూడా వారిలో ఉంది.

అద్దంకి యార్డులో వసూళ్లు

- కొత్త దండాకు తెరలేపిన పాలకవర్గం
- పూర్తిగా గాడితప్పిన సంత నిర్వహణ

అద్దంకి, ఫిబ్రవరి 4: అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలో, బుధవారం మేదరమెట్లలో సంత నిర్వహిస్తున్నారు. అటు రైతులకు, ఇటు కొనుగోలుదార్లకు ఉపయోగకరంగా టీడీపీ హయాంలో సంత నిర్వహణను చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నగారి సంత కాస్త రాజన్న సంతగా మారింది. రైతుల స్థానంలో వ్యాపారులు రంగప్రవేశం చేసి కూరగాయల అమ్మకాలు చేపట్టారు. దీంతో గతంలో ఉన్న సంత నిర్వహణ మొత్తం పూర్తిగా గాడితప్పింది. ఇదిలాఉంటే ఇటీవల బాధ్యతలు చేపట్టిన పాలకవర్గం కొత్త దండాకు తెరలేపింది. సంతలో కూరగాయలు అమ్ముకునేందుకు ఒక్కో షాపునకు రూ.50 చొప్పున చెల్లించాలని హుకుం జారీచేసింది. ఆదివారం నుంచి వసూళ్ల పర్వం ప్రారంభించారు. ఎలాంటి సమాచారం లేకుండా వసూళ్లు చేయడంపై రైతులు, వ్యాపారులు అవాక్కయ్యారు. ఈవిషయమై మార్కెట్ కమిటీ సిబ్బందితో కొందరు వాగ్వివాదానికి దిగారు. దీన్ని సాకుగా చూపి కూరగాయల ధరలు మరింత పెంచి అమ్మే అవకాశం ఉందని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.



యార్డులో నగదు వసూలు చేసి రైతులకు ఇచ్చిన రశీదు



ఎమ్మెల్యే స్వామిని మర్యాద పూర్వకంగా కలిసిన జువ్విగుంట బీసీ నాయకులు

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పిస్తాం

● ఎమ్మెల్యే స్వామి

మద్రిపూడి, ఫిబ్రవరి 4 : బీసీల భద్రత కోసం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ చట్టం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే డోలాశ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం మండలంలోరిన జువ్విగుంట గ్రామానికి చెందిన పలువురు బీసీ సంఘం నాయకులు టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఉన్న ఎమ్మెల్యే స్వామిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జగన్ అమలు చేయని హామీల పథకాలను పోస్టల్ రూపంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు తుళ్లూరి నరసింహారావు, జిల్లా నాయీబ్రహ్మణ సాధికారసమితి అధ్యక్షులు పాలూరి సత్యం, నియోజకవర్గ నాయీబ్రహ్మణ సాధికారసమితి అధ్యక్షుడు కొణిదేన మోహన్‌రావు, జువ్విగుంట మాజీ సర్పంచ్ బొమ్మినేని శ్రీనివాసులు, బీసీ నాయకుడు పసుపులేటి సురేష్‌బాబు, పిచ్చయ్య, నారాయణ, వెంకటనారాయణ, ద్రోణాదులు తిరుపాలు, నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు బూదాల దాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

రైతుల పంట రుణాలను మాఫీ చేయాలి

● రైతు సంఘం నాయకుల డిమాండ్

● 8న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్న రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కరువు, తుఫాన్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు బీమా పథకాన్ని వెంటనే అమలు చేయడంతో పాటు రైతులు, కౌలు రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రూ.15వేలను ప్రభుత్వం సాయం అందించాలన్నారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డె హనుమారెడ్డి, కె.వీరారెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆరోపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు సకాలంలో సాగునీరు అందించి సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకొని పోవడంతో వాటి స్థానంలో కొత్త గేట్లు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వతేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్

వైసీపీ అవినీతి పాలనను తరిమికొడదాం

● సైకోను సాగనంపేందుకే టీడీపీతో పొత్తు

● జనసేన పార్టీ అధ్యక్షుడు రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అవినీతి పాలనను తరిమికొట్టేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో సైకో పాలనను అంతమొందించేందుకే తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. అధినేతను నమ్మి పార్టీలోకి వస్తున్నవారందరికీ ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఒంగోలు నగరం బలరాంకాలనీలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు ఆదివారం సాయంత్రం జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి రియాజ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఓటుతో తరలిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమిగా వచ్చాయని చెప్పారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గతంలో ఇచ్చిన హామీలు విస్మరించి మళ్లీ ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్త నాటకాలు ఆడుతున్నారని అన్నారు. ఒంగోలు ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే కనీసం మంచినీళ్ళు కూడా అందించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ఒంగోలు అభివృద్ధి చెందాలంటే జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలన్నారు. అంతకు ముందు అద్దంకి బస్టాండు నుంచి గోరంట్ల కాంప్లెక్స్ మీదుగా బలరాం కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ యూనిస్, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, పల్లి రాజేష్, దండే అనిల్, పల్ల ప్రమీల, టీడీపీ నాయకులు ముంతాజ్, అరిఫా తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో మెక్కేశారు..!

పొదుపు పేరుతో భారీగా బోగస్ రుణాలు

నకిలీ గ్రూపులతో కొందరు ఆర్పీలు

రూ.50 కోట్ల అవినీతి

వైసీపీ మహిళా నాయకులు సూత్రధారులు

పలుచోట్ల బ్యాంకులకు బురిడీ

మరికొన్నిచోట్ల బ్యాంకు సిబ్బంది చేతివాటం

నకిలీ సంఘాలపై తీగలాగితే డొంక కదిలే అవకాశం

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పాటుచేసిన మెప్మా ఇప్పుడు అవినీతిపరులకు ఆదాయ వనరుగా మారింది. కొందరు ఆర్పీలు, వైసీపీ నాయకులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కై అక్రమాలకు తెరతీశారు. పొదుపు మహిళల పేరుతో రూ.కోట్లు మెక్కేశారు. లేని పొదుపు సంఘాలను ఉన్నట్లుగా చిత్రీకరించి మాయచేశారు. ఆధార్ కార్డులను మార్చేశారు. ఆన్‌లైన్‌లో గ్రూపులు కనిపించకుండా మాయచేశారు. మొత్తంగా బోగస్ రుణాలతో భారీగా దోచేశారు. కొందరు వైసీపీ మహిళా నాయకులు మెప్మాతో సంబంధం లేకపోయినా, తాము అధికారపార్టీ నేతలమంటూ రుణాల పేరుతో కొన్ని బ్యాంకులను బురిడీ కొట్టించారు. అయితే ఈ బాగోతం మెప్మా జిల్లా అధికారులకు తెలిసినప్పటికీ చర్యలకు వెనుకడుగు వేయడం అనుమానాలకు తావిస్తోంది. అవినీతి వ్యవహారంలో వారికీ వాటా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఒంగోలు అద్దంకి బస్టాండ్‌లోని మెప్మా కార్యాలయం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 4 : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అవినీతిలో కూరుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంస్థలో బోగస్ రుణాల బాగోతం నడిచింది. అధికారపార్టీ నాయకురాళ్ల ప్రోద్బలంతో పేర్లు మార్చి నకిలీ గ్రూపులతో ఆ సంస్థలోని ఆర్పీలు పెద్ద దందానే నడిపారు. వాస్తవానికి ఒక గ్రూపులో పది మంది సభ్యులు ఉంటారు. ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు నడుస్తుంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళా సభ్యుల పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును కూడా పూర్తిగా మార్చకుండా ముందు శ్రీ అనే పదాన్ని చేర్చి మరో గ్రూపుగా చూపెట్టారు. ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా వారికి పరిచయం చేశారు. దీంతో వారికి లక్షల్లో రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఇలా వందల సంఖ్యలో నకిలీ పొదుపు గ్రూపులను తయారుచేసి బ్యాంకర్లను బురిడీ కొట్టించి ఒంగోలు నగరంలోనే సుమారు రూ.50 కోట్ల అవినీతికి పాల్పడినట్లు సమాచారం.

బయటపడింది ఇలా..

బోగస్ రుణాలు తీసుకున్న కొన్ని గ్రూపులు సకాలంలో రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో మూడు నెలల క్రితం బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. సభ్యులను నెల వాయిదాలు చెల్లించాలని కోరడంతో అసలు తాము రుణాలే తీసుకోలేదని వాపోయారు. దీంతో ఆర్పీల మోసం బయటకు వచ్చింది. ఆతర్వాత ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. నగరంలోని పలువురు ఆర్పీలు ఈ తరహా మోసానికి పాల్పడి పొదుపు పేరుతో రుణాలు దండుకున్నట్లు తేలింది. అయితే ఈ వ్యవహారంలో మెప్మా అధికారులు మౌనందాల్చగా, కొందరు బ్యాంకర్లు సైతం అన్నీ తెలిసి కూడా కిమ్మనకుండా ఉన్నట్లు సమాచారం. అందిన సమాచారం మేరకు యాభైకి పైగా నకిలీ సంఘాల ద్వారా రుణాల పేరుతో దోపిడీ జరిగినట్లు సమాచారం.

అవినీతి బాగోతంలో వైసీపీ నాయకులు..!

ఇటీవల ఒంగోలులో వైసీపీ నాయకుల అవినీతి వ్యవహారాలు అధికమయ్యాయి. నిన్న మొన్నటి వరకూ భూకబ్జాలతో చెలరేగిపోయిన విషయం విదితమే. అదేసమయంలో వైసీపీకి చెందిన కొందరు మహిళా నాయకులు రుణాల పేరుతో భారీగా బొక్కేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పొదుపు సంఘాలకు సంబంధించి మూడు జిల్లాల నాయకురాలిగా చెప్పుకునే ఓ మహిళా నేత 'బడుగు'ల పేరుతో భారీగా దోచుకున్నట్లు సమాచారం. ఆమె ఒంగోలులోని అలహాబాద్ బ్యాంకులో రుణాలు తీసుకోవడమే కాకుండా మెప్మాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ఓ మహిళా కార్పొరేటర్ భర్త కూడా ఆర్పీల సహకారంతో కొన్ని నకిలీ పొదుపు గ్రూపులను తయారు చేసి రుణాలు పొందారు. దీన్ని ఆప్రాంతానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) గుర్తించినట్లు సమాచారం. ఇలాంటి అవినీతి వ్యవహారాలు చేస్తే తన ఉద్యోగం పోతుందని ఆమె అడ్డం తిరగడంతో సదరు మహిళా కార్పొరేటర్ భర్త తిరిగి చెల్లించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మెప్మాకు సంబంధం లేని ఓ మహిళ తాను అధికారపార్టీకి చెందిన మనిషినని చెప్పుకుంటూ బ్యాంకర్లను దారికి తెచ్చుకుని బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు పొందినట్లు తెలిసింది. కొన్ని గ్రూపుల వద్ద వసూళ్లకు కూడా పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈమెపై మెప్మా పీడీ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఇదేతరహాలో మరో మహిళా వైసీపీ నేత రూ.కోట్లు దండుకున్నట్లు సమాచారం. మొత్తంగా అధికారపార్టీలో కొందరు నాయకులు భూకబ్జాలకు పాల్పడగా, నాయకురాళ్లు తామేమీ తక్కువ కాదన్నట్లు మహిళల పేరుతో నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి రుణాలు పొందిన విషయం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది.

ఆర్పీలు, వైసీపీ నాయకులు, బ్యాంకు సిబ్బంది కుమ్మక్కు

బాగా చదువుకుని స్వయం ఉపాధి రుణాల కోసం బ్యాంకర్ల వద్దకు వెళితే సవాలక్ష ఆంక్షలతో కొర్రీలు వేసి, పైసా కూడా రుణం ఇవ్వని బ్యాంకర్లు ఇలాంటి బోగస్‌లకు మాత్రం కోట్లు మంజూరు చేయడం అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇందులో కొందరు ఆర్పీలు, వైసీపీ నాయకులు, ఆయా బ్యాంకుల సిబ్బంది కుమ్మక్కైనట్లు సమాచారం. రుణాలు మంజూరుచేసిన కొన్ని బ్యాంకుల సిబ్బందికి భారీగానే వాటాలు అందినట్లు తెలుస్తోంది. అయితే రుణాలు పొందిన అధికార పార్టీకి చెందిన నాయకులు, ఆర్పీలు పైసా చెల్లించకుండా దర్జాగా కార్లలో తిరుగుతున్నారు. కాగా ఆయా బ్యాంకుల ఉద్యోగులు ఇప్పుడు తిరిగి రుణాలను రికవరీ చేయలేక అల్లాడుతున్నారు.

వాస్తవాలు వెలికితీస్తే మరిన్ని బోగస్ రుణాలు

ఈ బోగస్ రుణాలలో కొంతమంది ఆర్పీలు కీలకంగా వ్యవహరించారు. వైసీపీకి చెందిన నాయకులు వారికి అండదండలు అందించినట్లు సమాచారం. అయితే పొదుపు మహిళల పేరుతో నకిలీ గ్రూపులు సృష్టించి కోట్ల రూపాయలు కాజేసిన వ్యవహారంపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా భవిష్యత్‌లో ఇలాంటి అక్రమాలకు కళ్లెం వేసినట్లు అవుతుందని, అలాగే వారిపై చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని పొదుపు మహిళలు కోరుతున్నారు.

వైద్యారోగ్యశాఖలో కలకలం

వణుకుతున్న అధికారులు

2020లో ఉద్యోగం పొందిన అభ్యర్థుల్లో ఆందోళన

విచారణ నివేదికను అమలు చేస్తే ఉద్యోగాలు ఉఫ్

ఎన్నికల సమయం కావడంతో అమలుపై అనుమానాలు

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 : వైద్యారోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కమిటీ కలెక్టర్‌కు అందజేసిన నివేదిక ఇప్పుడు కలకలం సృష్టిస్తోంది. 2020 పోస్టుల భర్తీలో చోటుచేసుకున్న పరిణామాలన్నింటినీ నివేదికలో కమిటీ పొందుపర్చడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు విభాగాల్లో 395 ఉద్యోగాలు భర్తీచేయగా 41 మంది అనర్హులకు పోస్టులు ఇచ్చినట్లు కమిటీ గుర్తించడంతోపాటు అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంకోవైపు ఉద్యోగ నియామక ప్రక్రియ అంతా తప్పులతడకగా ఉందని కూడా తేల్చింది. దీంతో అనర్హులతోపాటు అప్పట్లో నియామకాలు చేపట్టిన అధికారుల్లో కూడా టెన్షన్ నెలకొంది. ఆ నివేదికను పూర్తిస్థాయిలో అమలు చేస్తారా? లేక మరో కమిటీని నియమించి సమగ్ర విచారణ చేయిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఆ నియామకాల్లో 41మంది అనర్హులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వారంతా ఉద్యోగాల్లో చేరి మూడున్నరేళ్లు కావడంతో ఇప్పుడు తొలగింపు సాధ్యమేనా? అన్న ప్రశ్న ఉత్పన్నమతోంది. ఈనేపథ్యంలో కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది. విచారణ నివేదిక ఇచ్చినట్లు బహిర్గతం కావడంతో అప్పట్లో నియామకాలు చేపట్టిన అధికారులతోపాటు ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఈ గండం నుంచి ఎలా బయటపడాలన్న విషయమై మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ నియామకాల సమయంలో ముగ్గురు డీఎంహెచ్‌వోలు పనిచేసినా ఫైళ్లపై సంతకాలు చేసింది ఒక్క అధికారేనని నిర్ధారించారు.



ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయం

ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు కూడా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆ నివేదిక అమలుపై అనుమానాలు ఉన్నాయి. ఆ నివేదికను వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి కలెక్టర్ దినేష్‌కుమార్ పంపనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అటెండెన్స్.. అలజడి

● ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ

● మూడుసార్లు ఆలస్యంగా వేస్తే ఒక రోజు సెలవుగా పరిగణన

● రాష్ట్రస్థాయి నుంచే సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు

● క్షేత్రస్థాయి వైద్యసిబ్బందిలో ఆందోళన

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 4 :ముఖఆధారిత హాజరు విషయమై ఉద్యోగుల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలోనే ఆయా శాఖల పరిధిలో పర్యవేక్షణ జరగ్గా ఇప్పుడు దాన్ని రాష్ట్రస్థాయికి మార్చారు. నెలవారీ ఉద్యోగి ముఖ ఆధారిత హాజరు నమోదు వివరాలు నేరుగా వారి సెల్‌ఫోన్‌లకే మేసేజ్ రూపంలో వస్తున్నాయి. ఉద్యోగులు తమ సెల్‌ఫోన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ఉదయం సమయంలో ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంది. అయితే సమయానికి కార్యాలయానికి వెళ్లినా నెట్‌వర్క్ సక్రమంగా పనిచేయని పక్షంలో కొంత ఆలస్యంగా హాజరు నమోదు చేసుకుంటున్నారు. అయితే దాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. నెలలో మూడుసార్లు ముఖ ఆధారిత హాజరు ఆలస్యంగా వేస్తే ఒక రోజు సెలవు దినంగా నమోదు చేస్తోంది. సాయంత్రం సమయంలో నిర్దేశిత సమయం కన్నా ముందుగా హాజరు వేసినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ప్రధానంగా వైద్యశాఖలో పనిచేసే ఉద్యోగులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల కోసం నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా వైద్యశాఖలో సుమారు 2,600 మంది వరకు పనిచేస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులతోపాటు వివిధ కార్యక్రమాల్లో వైద్యశాఖను భాగస్వామ్యం చేశారు. దీంతో ఉద్యోగులు ఆ కార్యక్రమాల్లో పాల్గొనాలా? లేక ఆఫీసుకు వెళ్లి ముఖ ఆధారిత హాజరు వేయాలా? అన్నది అర్థంకాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

దాహం కేకలు

తాగునీటి కోసం తల్లడిల్లుతున్న పశ్చిమప్రాంత ప్రజలు

ట్యాంకర్లతో సరఫరా నిలిపివేతతో ఇక్కట్లు

రోడ్డెక్కి ఆందోళనలు

నీటి వనరుల పరిశీలనలో అధికార యంత్రాంగం



నీటి కోసం రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమప్రాంత ప్రజానీకం తాగునీటి కోసం తల్లడిల్లుతోంది. దాహార్తితో అల్లాడుతోంది. గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేయడంతో నానాపాట్లు పడుతోంది. అధికారుల చర్యను నిరసిస్తూ ఆందోళనలకు దిగుతోంది. శనివారం దోర్నాల మండలం తిమ్మాపురంలో, ఆదివారం పెద్దారవీడు మండలం వైడిపాడులో జనం నీటికోసం రోడ్డెక్కారు. ట్యాంకర్లతో నీటి సరఫరాలో వైసీపీ నేతల దోపిడీని అరికట్టేందుకు హేతుబద్ధమైన చర్యలకు బదులు అధికారులు ఏకంగా సరఫరా నిలిపివేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

వైసీపీ నేతల నిర్వాకంతోనే సమస్య

జిల్లాలో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో శాశ్వత తాగునీటి వనరులు లేక వర్షాకాలం, వేసవి కాలం అన్న తేడా లేకుండా అనేక గ్రామాల్లో నీటి కోసం జనం అవస్థలు పడుతున్నారు. నిన్నమొన్నటి వరకూ ఆ ప్రాంతంలోని 12 మండలాల్లో 82 ఆవాసాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగింది. అయితే ట్యాంకర్లతో నీటి సరఫరాలో కాంట్రాక్టర్లుగా ఉన్న స్థానిక వైసీపీ నేతలు, కింది స్థాయి ప్రజాప్రతినిధులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అదేవిషయం ప్రభుత్వ ఉన్నతాధికారుల పరిశీలనలో కూడా తేలడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా నిలిపివేతకు ఆదేశించారు. దీంతో నాలుగు రోజులుగా పల్లె ప్రజల అవస్థలు వర్ణనాతీతమయ్యాయి.

ఆందోళనలకు దిగుతున్న ప్రజలు

దోర్నాల మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీ వాసులు నీటి కోసం శనివారం రోడ్డెక్కగా, పెద్దారవీడు మండలం వైడిపాడు గ్రామస్థులు ఆదివారం ధర్నాకు దిగారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు, కొనకనమిట్ల, పొదిలి, త్రిపురాంతకం, దొనకొండ తదితర మండలాల్లో సమస్య తీవ్రంగా ఉండగా ఎక్కడికక్కడ ప్రజలు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

ప్రత్యామ్నాయంపై అధికారులు దృష్టి

ఆయా గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏమిటన్నది పరిశీలించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. దీంతో పశ్చిమప్రాంత అధికారులు నీటి సమస్య ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ ఆదివారం త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలోనూ, ఇతర గ్రామాల్లో పలువురు ఇతర అధికారులు పరిశీలనలు చేశారు. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది, తిరిగి నీటి సరఫరా చేస్తారా? లేదా? అన్నది అర్థంకాక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఏలూరి అరెస్టుకు ఒత్తిడి

అయన్ను ఒక్కరోజైనా జైల్లో పెట్టాలని పోలీసులకు వైసీపీ పర్చూరు ముఖ్యనేత పదేపదే ఫోన్లు

ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించిన సాంబశివరావు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు ఎమ్మెల్యే, టీడీపీ బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావును ఎలాగైనా జైలుకు పంపించాలన్న లక్ష్యంతో వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ కేసులో ఆయన పేరును ఇరికించడమే కాక ఒక్కరోజైనా జైలులో పెట్టించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. పర్చూరు నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత అందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల మార్టూరులో టీడీపీ అభిమానుల గ్రానైట్ క్వారీల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా అధికారులు ప్రైవేటు వ్యక్తుల కార్లలో రావడం, ఆప్రైవేటు వ్యక్తులు తమవెంట కర్రలు, కారం తీసుకురావడంతో గ్రానైట్ వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారు. అంతేగాక అధికారితో వచ్చిన ప్రైవేటు వ్యక్తి ఒకరు వైసీపీలోని ముఖ్యనేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్న వారిగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాంబశివరావు అక్కడికెళ్లి వ్యాపారులకు మద్దతుగా నిలిచి నిబంధనల ప్రకారం క్వారీల్లో తనిఖీలు చేసుకోవాలని మైనింగ్ అధికారులకు సూచించారు. వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు తెచ్చిన కర్రలు, కారంపొడిని గుర్తించి ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాలతో అక్కడికి వచ్చిన కిందిస్థాయి పోలీసు అధికారులకు వాటిని అప్పజెప్పి నియోజకవర్గంలో జరగనున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కార్యక్రమానికి వెళ్లిపోయారు.



ఏలూరితోపాటు మరో ఆరుగురిపై కేసు

వైసీపీ నేతల ఒత్తిడితో విధి నిర్వహణలో అధికారులను అడ్డుకున్నారనే నెపంతో అదేరోజు సాయంత్రం సాంబశివరావుతోపాటు మరో ఆరుగురిపై మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితో మరో 20 మంది ఉన్నట్లుగా ఫిర్యాదులో పేర్కొనగా వారిపైనా కేసు బనాయించారు. ఉద్యోగులతో వచ్చిన రౌడీల వ్యవహారంపై వ్యాపారులు పెట్టిన ఫిర్యాదులను మాత్రం పట్టించుకోకుండా పక్కనేశారు. అనంతరం ఆ కేసులో ఆరుగురు వ్యాపారులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపగా వారికి ఒక్కరోజులోనే బెయిల్ వచ్చింది. ఈనేపథ్యంలో మార్టూరు సీఐగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న రాజశేఖర్‌రెడ్డికి వైసీపీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేత ఫోన్‌చేసి 'మీరు వెంటనే ఆ కేసుపై దృష్టిపెట్టాలి. ఎమ్మెల్యే సాంబశివరావును అరెస్టు చేయాలి. కేసుకు సంబంధించిన మరో 20 మంది వ్యాపారులను కూడా జైలుకు పంపాలి' అని మాట్లాడినట్లు తెలిసింది. ఆయన ఇప్పుడే బాధ్యతలు చేపట్టాను మాట్లాడదామని చెప్పగా ఆ తర్వాత జిల్లా, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు ఫోన్‌చేసి అరెస్టు చేయాలని కోరుతున్నట్లు సమాచారం.

కోర్టు నిర్ణయం వచ్చే లోపే అరెస్టుకు ఒత్తిడి

ఎమ్మెల్యే ఏలూరి ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం తీర్పు వెలువడనుంది. ఈనేపథ్యంలో శనివారం మార్టూరు పోలీసుస్టేషన్‌కు కొంతమంది వైసీపీ నాయకులు వెళ్లి ఆకేసులో మిగిలిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. ఆతర్వాత సదరు ముఖ్యనాయకుడు నియోజకవర్గ, జిల్లాస్థాయి పోలీసు అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఒక్కరోజైనా ఏలూరిని కటకటాల వెనక్కు పంపాలి. మీరు వెంటనే ఆపనిచేస్తారా? లేదా? అని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. మంగళగిరి పార్టీ ఆఫీసులో ఆదివారం టీడీఎల్పీ సమావేశం ఉన్నందున అక్కడికి ఎమ్మెల్యే ఏలూరి వస్తారని, అరెస్టు చేయాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. అయితే ఏలూరి ఆ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సోమవారం అసెంబ్లీ సమావేశాలకు ఆయన వచ్చే అవకాశం ఉందని, అక్కడ అరెస్టు చేయాలని సదరు నేత పోలీలకు పదేపదే ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టులో దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై జడ్జి నిర్ణయం సోమవారం వెలువడే అవకాశం ఉంది. అయితే 'అసలే కుట్ర కేసు. ముందుగా అరెస్టు అయి రిమాండ్ కెళ్లిన నిందితులకు ఒక్కరోజులోనే బెయిల్ లభించింది. ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో తీర్పురానుంది. ఈనేపథ్యంలో వైసీపీ నేతలు ఎంత ఒత్తిడిచేసినా మేమేమి చేయగలం' అని పోలీసు అధికారులు వాపోతున్నారు. అయితే వైసీపీ నేతలు ఆశించినట్లు ఒక్కరోజైనా సాంబశివరావును అరెస్టు చేసి జైలుకు పంపుతారా? సోమవారం ఆయనకు హైకోర్టులో బెయిల్ వస్తుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్



రామకూరులో పెనుబోతు పేరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 4: మండలంలోని రామకూరు, ముప్పవరం గ్రామాలలో ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పలువురిని పరామర్శించారు. రామకూరు గ్రామంలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న పెనుబోతు పేరయ్యతో పాటు చింతకాయల కోటయ్య, కల్లూరి భూలక్ష్మిని గొట్టిపాటి పరామర్శించారు. పిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న గోకనకొండ చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన వెంపరాల సాంబయ్య, కొల్లూరి రామకోటేశ్వరరావు, మాలెంపాటి ఆంజనేయులు రాయిణి సీతారావమ్మల నివాసాలకు వెళ్ళి ఆయా కుటుంబసభ్యులను పరామర్శించారు. ముప్పవరం గ్రామంలో శనివారం గుండెపోటుకు గురై మృతి చెందిన తాళ్ళూరి శివ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు కుక్కపల్లి ఏడుకొండలు, మానం సుబ్బారావు, పెదవల్లి అశోక్, మానం రమేష్, మానం వెంకటరావు, తదితరులు ఉన్నారు

బల్లికురవలో.. బల్లికురవ, ఫిబ్రవరి 4: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యం బారిన పడిన పలువురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో మోకాలు శస్త్ర చికిత్స చేయించుకొన్న టీడీపీ కార్యకర్త దూళిపాళ్ల హనుమయ్యను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తలు దాసరి సుబ్బారావు, గుత్తా భైరాగయ్య, గొనుగుంట్ల వెంకటేశ్వర్లు, అడిగోప్పుల వెంకటేశ్వర్లు, చల్లగుండ్ల శ్రీనివాసరావును పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఉప్పుమాగులూరు గ్రామంలో తిరుపతమ్మ అనే మహిళ మృతి చెందగా, కుటుంబసభ్యులను పరామర్శించారు.

తువ్వ ఇసుక తరలింపును అడ్డుకున్న సీనరేజ్ నిర్వాహకులు

అద్దంకి, ఫిబ్రవరి 4: గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతం నుంచి తరలిస్తున్న తువ్వ ఇసుక తరలింపును సీనరేజ్ నిర్వాహకులు ఆదివారం అడ్డుకున్నారు. అద్దంకి పట్టణంలో ఇళ్ళ నిర్మాణ సమయంలో ఫౌండేషన్ కోసం తువ్వ ఇసుకతో నింపుతారు. గుండ్లకమ్మ నది నుంచి తరలించే ఇసుకకు సీనరేజ్ వసూలు చేస్తున్న నేపథ్యంలో తువ్వ ఇసుకకు కూడా కొంతమేర చెల్లించాలని సీనరేజ్ వసూలుచేసే వ్యక్తులు డిమాండ్ చేశారు. గతంలో సీనరేజ్ వసూలు సమయంలో కూడా ఎలాంటి సీనరేజ్ వసూలు చేయలేదని, ఇప్పుడు కొత్తగా ఎలా వసూలు చేస్తారని రవాణాదారులు పెద్ద సంఖ్యలో చేరి వాదనకు దిగారు. దీంతో కొద్దిసేపు వాళ్ళ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదాలు జరిగాయి. ఎట్టకేలకు వైసీపీ నాయకులు రంగప్రవేశం చేసి ఎలాంటి సీనరేజ్ చెల్లించకుండా సర్దుబాటు చేయటంతో వివాదం సద్దుమణిగింది.

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీరాం



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకుడు హరిప్రసాద్

పర్చూరు, ఫిబ్రవరి 4: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా శ్రీరాం వెంకటసుబ్బారావు నియమితులయ్యారు. ఆదివారం స్థానిక ఆలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో కమిటీ నియామకంపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం నూతన కమిటీ నియామకం నిర్వహించారు. అధ్యక్షుడిగా గతంలో విధులు నిర్వహించిన శ్రీరాం వెంకటసుబ్బారావును ఏకగ్రీవంగా తిరిగి నియమించారు. ఉపాధ్యక్షులుగా పోలిశెట్టి గురుబాబు, పల్లబోతు రాఘవయ్య నియమితులయ్యారు. కార్యదర్శులుగా నంబోరి వెంకట రమణ, లింగమల్లు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా యక్కల వెంకటసుబ్బారావు, సహాయకార్యదర్శిగా తమ్మన శివశంకరరావు ఎంపికయ్యారు. బాపనపల్లి అవినాష్, కొత్తూరి కనక దుర్గారావును సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపికచేశారు. మహిళా అధ్యక్షులుగా గోపు అనసూర్యమ్మ, సభ్యులుగా శ్రీరాం కనకదుర్గ, కొల్లా శ్యామలాదేవి, శిఖాకొల్లి రాజ్యలక్ష్మీ కుమారి, అర్వపల్లి సునీత, మామిడిపాక ఝాన్సీ, మామిడిపాక సువర్చ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మామిడిపాక హరిప్రసాద్, ఊటుకూరి నిర్మల, కొత్తూరి వెంకటేశ్వరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వర్‌లు పనిచేయక ప్రజల పడిగాపులు



రిజిస్ట్రేషన్‌లు జరగక వెలవెలబోతున్న పర్చూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పర్చూరు, ఫిబ్రవరి 4: సర్వర్‌లు పనిచేయక పోవటంతో రిజిస్ట్రేషన్‌లు జరగక ప్రజలు కార్యాలయాల వద్ద పడికాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. భూములు, ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్‌ల కోసం కార్యాలయాలకు వస్తున్న ప్రజలకు సర్వర్‌లు పనిచేయక పోవటంతో ఏమిచేయాలో పాలుపోక కార్యాలయాల చుట్టు ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వినియోగిస్తున్న 2.0 సర్వర్‌ను గ్రామ సచివాలయాల్లో పేదలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం అనుసంధానం చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోజుమొత్తం ఒకటి రెండు రిజిస్ట్రేషన్‌లు కూడా పూర్తిచేయలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. కనీసం సచివాయాలకు సైతం సర్వర్‌లు సక్రమంగా పరిచేస్తున్న దాఖలాలు లేవు. దీంతో ఆయా గ్రామ సచివాలయాల వద్ద రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో కూలీ పనులను మానుకొని కార్యాలయం వద్ద పడికాపులు కాసినా రిజిస్ట్రేషన్‌లు కావటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వర్‌లు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకొని ప్రజల అవస్థలను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

9లోగా ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మార్టూరు, ఫిబ్రవరి 4: జగనన్న కాలనీలలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ వారి పరిధిలోని గ్రామ సచివాలయాలలో ఈనెల 9లోపు ఇళ్ల పట్టా లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బాపట్ల ఆర్డీవో రవీంద్ర అన్నారు. ఆదివా రం మార్టూరులోని ఒకటో గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషను ప్రక్రియను ఆ యన పరిశీలించారు. అనంతరం డిజిటల్ అసిస్టెంట్లు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, పంచాయతీ కార్యదర్శులు తన్నీరు శ్రీనివాసరావు, షేక్ మీరావలి, డీటీ శివ శ్రీను, పి.హర్షవర్ధన్, తదిత రులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ఇంకొల్లు, ఫిబ్రవరి 4: ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నేత్రదానం జరిగింది. కొడవలివారిపాలెం గ్రామానికి చెందిన బుషికే శవ వెంకటసుబ్బారావు(83) మృతి చెందగా రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వ ర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు. నేత్రదానం కు సహకరించిన మృతుని భార్య శ్రీదేవి, కుమార్తెలు మంజరి, పద్మజ, మాధ వీలతను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి, కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు అభినందించారు.

ఏలూరిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణం

కుంకలపర్రు(పర్చూరు), ఫిబ్రవరి 4: అవినీతి మచ్చలేని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయటం దారుణమని మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ కొల్లా సుబ్బారాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో జగన్ ప్రభుత్వ అవినీతి, అరాచకాన్ని నిలదీసి ప్రశ్నించటాన్ని కక్ష కట్టి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారన్నారు. ఏలూరిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

వైసీపీ నేతల కనుసన్నల్లో ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు



చినకొత్తపల్లిలో ప్రభుత్వ భూమిలో వేసిన గడ్డివామి

అద్దంకి, ఫిబ్రవరి 4: మండలంలోని చినకొత్తపల్లిలో అధికారుల తీరుపై టీడీపీ మద్దతురాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న దళితులు తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న వాగు పోరంబోకు వ్యవసాయ భూమిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఇక గ్రామంలో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉండగా సుమారు 30 సెంట్ల స్థలంలో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం భవనాలు నిర్మించారు. మిగిలిన 30 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. వైసీపీ నేతల అండదండలతో కొందరు వ్యక్తులు వరిగడ్డి వాములు, రేకుల షెడ్డులు ఏర్పాటుచేసి తమ ఆధీనంలోకి తీసుకువచ్చే విధంగా చేస్తున్నారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.

ఈవిషయమై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదన్నారు. సచివాలయ సిబ్బంది సెలవు పెట్టి ఆక్రమణదారులు ఆక్రమించే విధంగా అవకాశం కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చాగంటి గణపతి తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అదేసమయంలో స్పందించని స్థానిక అధికారులపై కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ సెల్ నాయకులు

పర్చూరు, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పర్చూరులో ఏలూరి గెలుపును ఆపడం అసాధ్యమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను అన్నారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు, టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులకు నిరసనగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తిరుమలశెట్టి మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం కర్రలు, కారం ప్యాకెట్లతో వైసీపీ గూండాలు మైనింగ్ అధికారులతో కలసి మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలో తనిఖీలకు వచ్చారని చెప్పారు. దానిని ప్రశ్నించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. వైసీపీ గుండాలను వదిలి ఫిర్యాదు చేయటానికి వెళ్ళిన టీడీపీ నాయకులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. అక్రమ కేసులతో ఎమ్మెల్యే ఏలూరి ప్రతిష్ఠను దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతి రాజ్యమేలుతుందని ఆరోపించారు. ప్రజానాయకుడు ఏలూరి అని, అభివృద్ధి, సేవా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో సముచిత స్థానం సంపాదించుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఏలూరికి హ్యాట్రిక్ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసరావు, పార్లమెంట్ ఎస్టీ సెల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాసరవు, మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు పాలపర్తి శ్రీను, పొన్నరుసు వెంకటేశ్వర్లు, లింగేశ్వరరావు, చెంచమ్మ, పేరం శోభన్, శ్రీను, పొట్లూరి శ్రీను, కోటి, బాబు, నాగేశ్వరమ్మ, పోతురాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య



టీడీపీలో చేరిన వాడరేవు మత్స్యకారులతో కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 4: బీమా సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని కావూరివారిపాలెంకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఆసోది శ్రీనివాసరెడ్డి ప్రమాదవశాత్తు మరణించారు. పార్టీపరం గా అందించే రూ.2 లక్షల చెక్కును ఆదివారం ఇన్‌చార్జ్ కొండయ్య ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం కుటుంబసభ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా కుటుంబ పెద్దగా చంద్రబాబు అండగా ఉంటారని చెప్పారు. అందుకు చంద్రన్న బీమా ఒక నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మంచాల వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, గుడిపల్లి అంజయ్య మంచాల తారకరాముడు, అంకమ్మరావు, పోలిరెడ్డి, రత్తమ్మ, కౌతవరపు జనార్దనరావు, పురషోత్తం, డోలా శివకుమార్, మోహన్‌గౌడ్, బోయిన వెంకన్న, బోయిన శ్రీను, యారం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

చీరాల, ఫిబ్రవరి 4: మండలంలోని వాడరేవుకు చెందిన పలువురు మత్స్యకారులు ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి తెలుగుదేశం పార్టీ కండువాలను వారి మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరేందుకు కృషి చేసిన టీపీడబ్ల్యూ మండల అధ్య క్షుడు ధోని కనకరాజును కొండయ్య ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు, చంద్రబాబు మరలా ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే రాష్ట్రం అంధకారంలోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- జనసేన నేతల పిలుపు



మాట్లాడుతున్న జనసేన నాయకురాలు రాయపాటి అరుణ

మార్టూరు, ఫిబ్రవరి 4: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేయాలని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మార్టూరులో నాగరాజుపల్లి సెంటరు నుంచి మండల కాంప్లెక్స్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభకు మండల పార్టీ అధ్యక్షుడు మందపాటి కిషోర్ అధ్యక్షత వహించారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, పొత్తులో భాగంగా టీడీపీతో కలిసి నడవాలని ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రియాజ్, కందుకూరి బాబూరావు పిలుపునిచ్చారు. తొలుత రియాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తదుపరి పూజా కార్యక్రమాన్ని అరుణ నిర్వహించారు. పార్టీ జండాను విజయ్‌కుమార్ ఆవిష్కరించారు.

అంతకుముందు మార్టూరులో ద్విచక్రవాహనాలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల శెట్టి శ్రీనివాసరావు, పసుపులేటి నాగరాజు, రాయుడు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

పంటలు చేతికందేలా చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే బలరాంకు రైతుల వినతి



ఎమ్మెల్యే బలరాంకు బొకే అందజేసి మద్దతు తెలుపుతున్న ఆమంచి మద్దతుదారులు

చీరాల, ఫిబ్రవరి 4: తమ పంటలు చేతకందేలా చర్యలు చేపట్టాలని వేటపాలెం మండల రైతులు ఎమ్మెల్యే బలరాంను కోరారు. స్థానిక రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రైతులు బలరాంను కలిశారు. పంటలకు సాగునీరు అవసరాన్ని వివరించారు. అందుకు సంబంధించి స్కీమ్‌ల ద్వారా సాగునీరు అందించేందుకు అవసరమైన విద్యుత్ సరఫరాకు జరిగిన అంతరాయాన్ని తెలిపారు. ఈ క్రమంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో బలరాం ఫోన్‌లో మాట్లాడారు. రైతులందరికీ ప్రయోజనం చేకూరేవిధంగా ఎక్కువ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం అవుతందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బలరాంకు పలువురు మద్దతు

చీరాల, ఫిబ్రవరి 4: స్థానిక రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు బలరాం, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులను కలసి మద్దతు తెలిపారు. పుష్పగుచ్చం అందజేశారు. పూర్తిస్థాయిలో కలసి పనిచేస్తామని వారు తెలిపారు. వీరంతా గతంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మద్దతుదారులు. ఆమంచి వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో దశలవారీగా ఆమంచి వర్గీయులు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లతో కలసి ప్రయాణం చేసేందుకు ముందడుగు వేస్తూవస్తున్నారు. అయితే, కొందరు దూరంగానే ఉంటూ వస్తున్నారు. తాజాగా కౌన్సిలర్ సత్యానందం, పైడి రాజేష్, గరికపాటి సుధీర్‌బాబులు బలరాం, వెంకటేష్‌లకు మద్దతు తెలపటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

తక్కువ సమయంలో పురుగుమందుల పిచికారీ

- పెరిగిన డ్రోన్ కెమెరాల వినియోగం





బలరామకృష్ణాపురం పునరావాస కాలనీ సమీపంలో పొగాకుకు పురుగుల మందు పిచికారి చేస్తున్న డ్రోన్

అద్దంకి, ఫిబ్రవరి 4: వ్యవసాయంలో సాంకేతికతను జోడిస్తుండటంతో తక్కువ శ్రమతో పురుగుమందుల పిచికారి జరుగుతుంది. డ్రోన్‌ల ద్వారా పురుగుమందుల పిచికారి బాగా పెరిగింది. గతంలో పురుగుల మందును రైతులు, కూలీలు పిచికారి చేయాల్సి రావటంతో అధిక శ్రమ చేయాల్సి వచ్చేది. దీనికితోడు ఎక్కువ ఖర్చు కూడా అయ్యేది. డ్రోన్‌ల ద్వారా అయితే పది ఎకరాల విస్తీర్ణంలో కూడా గంటల వ్యవ ధిలోనే పురుగు మందుల పిచికారి జరుగుతుంది. గత రెండు, మూడు సంవత్సరాలుగా చిన్న డ్రోన్‌ల ద్వారా అక్కడక్కడా పురుగుమందుల పిచికారి జరగగా, ప్రస్తుతం పెద్ద డ్రోన్‌లు సైతం అందుబాటులోకి రావటంతో మరింత సులువుగా మారింది. అన్నిరకాల పంటలకు డ్రోన్‌ల ద్వారా పిచికారి చేస్తున్నారు. పంట ఎత్తుగా ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా పిచికారి చేసే అవకాశం ఉంది. ఎకరా విస్తీర్ణంలో పురుగుమందుల పిచికారికి రూ.250 నుంచి రూ.350 తీసుకుంటున్నారు. దీంతో స మయం, నగదు మరింత ఆదా అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



బల్లికురవ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగశివారెడ్డి

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

బల్లికురవ, ఫిబ్రవరి 4: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై పోలీసు శాఖ నిఘా పెట్టినట్టు ఎస్ఐ నాగ శివారెడ్డి అన్నారు. ఎవరైన ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం బల్లికురవ పోలీసు స్టేషన్ వద్ద అన్ని గ్రామాలలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు గ్రామాల నుంచి ఎక్కడికైనా వెళితే స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్నపాటి కేసులు నమోదయినా నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ప్రశాంతంగా ఉండేలా అందరు సహకరించాలని కోరారు. నిబంధనల మేర నడుచుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో ఎవరిపైనయినా వరుసగా మూడు కేసులు నమోదయితే రౌడీషీట్ ఓపెన్ అవుతుందని అయన తెలిపారు.

తహసీల్దార్ పద్మావతికి సన్మానం

పంగులూరు, ఫిబ్రవరి 4: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తహసీల్దార్ పద్మావతిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. పద్మావతి మచిలీపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ కాగా, శనివారం రాత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. పంగులూరు తహసీల్దార్‌గా నాలుగు సంవత్సరాలకు పైగా పనిచేసిన ఐ.పద్మావతి రైతులకు నిజాయితీగా సేవలందించి పలువురి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్‌గా దీర్ఘకాలం పనిచేసి మండల స్థాయిలో రైతాంగ సమస్యలు పరిష్కరించడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో డీటీ భాగ్యరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆర్ఐ రామకృష్ణ, నాగార్జున, శరత్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఇంకొల్లు, ఫిబ్రవరి 4: రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరంలో సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ హెల్ప్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జ్వాలా సాయి, వైద్య సిబ్బంది గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి స్వామి, కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు డాక్టర్ కృష్ణమూర్తి, మద్దినేని హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మేకల రవీంద్రారెడ్డి, నిమ్మగడ్డ హనుమంతరావు, పేర్ని సత్యనారాయణ, రాఘవరాజు, ప్రధానోపాధ్యాయులు ఉదయకుమారి, గోపాలరావు, ఆవుల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని తిమ్మసముద్రం వాసి మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న సంఘటనలో తిమ్మసముద్రంకు చెందిన పులుగు బాబు(43) మృతిచెందిన సంఘటన ఆదివారం వేటపాలెం- చినగంజాం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై కొండయ్య కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడు పట్టాలు దాటుతుండగా ఘటనజరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

బైకు ఢీకొని పాదచారికి తీవ్రగాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 4: మండలంలోని చెన్నుపల్లి గ్రామం వద్ద శనివారం రాత్రి బైకు ఢీకొట్టటంతో పాదచారి తంగిరాల వీరయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మార్టురు వైపు నుంచి చెన్నుపల్లి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనచోదకుడు రాత్రి కావటంతో లైటింగ్ సరిగా కనిపించక రోడ్డున నడిచి వెళుతున్న వీరయ్యను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైకిస్టుకు కూడా తీవ్రగాయాలు అయ్యాయి. బైకిస్టు వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

బల్లికురవ, ఫిబ్రవరి 4: మండలంలోని వల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తొరటి సలోమాన్ అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆదివారం గ్రామ టీడీపీ నేతలు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని భార్యకు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబాన్ని టీడీపీ అధికారంలోకి రాగానే గృహం మంజూరు చేయించి ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పరుసు ప్రేమ ప్రసాదబాబు, ముట్లూరి మహేష్, మోషే, తదితరులు పాల్గొన్నారు.

దేవపాలన కావ్యాలు యువ రచయితలకు స్ఫూర్తి




రచయిత దేవపాలనకు పురస్కారం అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు, సాహితీ మిత్రమండలి సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 4: అభ్యుదయభావాలతో చక్కని, చిక్కని కవిత్వాన్ని అందించే డాక్టర్ యు.దేవపాలన కావ్యాలు నేటి యువ రచయితలకు స్ఫూర్తిదాయకమని పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక మారం వారి సేవా సదన్‌లో కవి, రచయిత డాక్టర్ యు.దేవపాలనకు సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ సాహిత్య పురస్కారం-2024 సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రచయిత మట్టిని, కర్షకుణ్ణి, కార్మికుణ్ణి, వస్తువులుగా తీసుకుని తన చక్కని కవిత్వాన్ని కావ్యాలలో అందించారన్నారు. ఆయన రాసిన వేటకొడవలి, వేదనావిపంచి, బ్రతుకుబాట, జ్ఞానపథం, చందలూరి చరిత్ర పుస్తకాలపై శాయి ప్రసంగించారు. జానపదకళలకు జైకొట్టిన సాహితీకారుడు, పల్లెపాటకు పట్టం కట్టిన కవి, అన్నం పెళ్లను నోటికి అందించిన అన్నదాతకు పెద్ద పీటవేసిన కర్షక పక్షపాతి దేవపాలన అని వక్తలు కొనియాడారు.

ఈసందర్భంగా దేవపాలనకు సాహిత్య పురస్కారాన్ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు, మిత్రమండలి సభ్యులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వామరాజు వెంకటేశ్వరరావు, ఓరుగంటి శ్రీనివాసరావు, కొండకావూరి కుమార్, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డీవీఎం సత్యనారాయణ, రఘురామశర్మ, లక్కరాజు శ్రీనివాసరావు, శేషతల్పసాయి, ఇప్పగంటి మల్లికార్జునరావు, కేవీ పోలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

చినగంజాం, ఫిబ్రవరి 4: ఎదురుగా వెళ్తున్న ఖైరుబండిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చినగంజాం సమీపంలోని రొంపేరు బ్రిడ్జివద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్.ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల స్వర్ణగేటు ప్రాంతానికి చెందిన రాజు స్వామిరెడ్డి(21) ద్విచక్రవాహనంపై ఒంగోలు నుంచి చీరాల వెళ్తున్నాడు. ఈక్రమంలో చినగంజాం సమీపంలోని రొంపేరు బ్రిడ్జి వద్ద ఎదురుగా గడ్డిలోడుతో చినగంజాం వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని ఖైరుబండిని ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో స్వామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్య శాలకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోలీసులు వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.



సోమశిలలో 24.611 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 4: సోమశిల జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 24.611 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రూ.100 కోట్ల భూమి స్వాహా!

ప్రభుత్వ భూమి, అటవీ, సాగునీటి కాలువ, చెరువు ఇలా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడకు కబ్జారాయుళ్లు వాలిపోతున్నారు. అధికార దర్పంతో రెవెన్యూ వర్గాలను మచ్చిక చేసుకోవడంతోపాటు నకిలీ పట్టాలు సృష్టించి భూమిని హస్తగతం చేసుకుంటున్నారు. గడిచిన నాలుగేళ్లలో అనేక భూ కుంభకోణాలు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెలుగుచూడగా వాటన్నిటినీ తలదన్నేలా భారీ కుంభకోణం నెల్లూరు నగర పరిధిలో జరిగింది. అత్యంత పకడ్బందీగా, సామాన్యులకు అర్థంకాని విధంగా పక్కా స్కెచ్ వేసి రూ.వంద కోట్ల విలువైన కాలువ భూమిని కొట్టేశారు. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం రెవెన్యూ పరిధిలో జరిగిన ఈ భూ కుంభకోణం సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది.



- నెల్లూరు రూరల్ అల్లీపురంలో భారీ భూ కుంభకోణం
- 15.09 ఎకరాల కాలువ భూమి ధారాదత్తం
- ఆర్ఎస్ఆర్‌లో కాలువ.. నేడు పట్టాగా మార్పు
- ఏడాదిన్నర క్రితం 22ఏ నుంచి తొలగింపు
- తెలివిగా సబ్ డివిజన్ చేసి స్వాహాకు స్కెచ్ వేసిన అక్రమార్కులు

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అల్లీపురం రెవెన్యూ పరిధిలోని ఓ సర్వే నంబరులో 11.31 ఎకరాల కాలువ, మరో సర్వే నంబర్‌లో 3.78 ఎకరాల కాలువ ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లను ఆర్ఎస్ఆర్‌లో పరిశీలించగా కాలువ అని నమోదై ఉంది. అయితే, ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌ను పరిశీలిస్తే ఆ భూములన్నీ వేర్వేరు వ్యక్తుల పేర్లపై ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని చూసి రెవెన్యూ వర్గాలే విస్తుపోయాయి. కాలువ అనే సహజ వనరు చాలా విలువైనది. కాలువ భూములను పేదల ఇళ్లకు లేదా అసైన్‌మెంట్ కింద కాని పంపిణీ చేసేందుకు వీల్లేదని నిబంధనలు చెబుతున్నాయి. మరి అల్లీపురంలో 15.09 ఎకరాల కాలువను అధికారులు మరొకరి పేర్లపైకి ఎలా మార్చారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఏడాదన్నర క్రితం ఈ రెండు సర్వే నంబర్లలోని 15.09 ఎకరాల భూమి నిషేధిత జాబితాలో ఉంది. అయితే నెల్లూరు ఆర్డీవో నివేదిక ప్రకారం అప్పటి కలెక్టర్.. ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జిల్లా రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. దీంతో కాలువ భూములను 22ఏ నుంచి తొలగించారు. ఈ ప్రాంతంలో అంకణం విలువ రూ.రెండు లక్షల వరకు పలుకుతోంది. మొత్తంగా భూమి విలువ చూసుకుంటే రూ.వంద కోట్ల పైమాటగానే కనిపిస్తోంది. దీంతో ఇప్పుడు అత్యంత వేగంగా ఆ భూముల అమ్మకాలు జరిగిపోతున్నాయి.

విస్తీర్ణం ఎక్కువగా చూపించి..

వందేళ్ల క్రితం ఆర్ఎస్ఆర్ తయారు చేశారు. అంటే అప్పటికి, ఇప్పటికి భూ విస్తీర్ణం పెరిగిపోతుందా? కానీ అల్లీపురంలో అదే జరిగింది. సర్వే నంబర్‌లో ఉండాల్సిన విస్తీర్ణానికి, వెబ్‌ల్యాండ్‌లో చూపిస్తున్న విస్తీర్ణానికి భారీ తేడా కనిపిస్తోంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం ఓ సర్వే నంబర్‌లో 11.31 ఎకరాలు కాలువగా నమోదై ఉంది. ఆ సర్వే నంబర్‌ను మూడు సబ్ డివిజన్లుగా చేసి ఇప్పుడు 22.62 ఎకరాలుగా చూపిస్తున్నారు. అందులో రెండు సర్వే నంబర్లలోని 16.61 ఎకరాలను 22ఏ నుంచి తొలగించాల్సిందిగా జిల్లా రిజిస్ట్రార్‌కు రాసిన లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు. అలానే అదే సర్వే నంబర్‌లోని మూడో సబ్ డివిజన్‌లో మిగిలిన 6.01 ఎకరాలను కాలువగా చూపిస్తూ దానిని మాత్రం 22ఏ జాబితాలో కొనసాగించాలని ఆదేశించారు. దీనిని బట్టి చూస్తే ఆ సర్వే నంబర్‌లో మొత్తం విస్తీర్ణం 11.31 ఎకరాలు కాగా దానిని రెట్టింపు చేశారు. అంటే ఒక సర్వే నంబర్లో కాలువగా ఉన్న దానిని సగం కాలువగా, మిగిలిన దానిని పట్టాగా అధికారులు ధ్రువీకరించారన్నమాట. ఎందుకిలా చేశారు? ఏ రికార్డుల ఆధారంగా కాలువను పట్టాగా మార్చారన్నది ఇప్పుడు అనేక అనుమానాలకు తెరతీస్తోంది. ఈ కాలువ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఆర్డీవో ఇచ్చిన నివేదికను ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా ఆ వివరాలు తహసీల్దార్ కార్యాలయంలో గానీ ఆర్డీవో కార్యాలయంలో గానీ లేవు. ఆ ఫైల్ మొత్తాన్ని కలెక్టరేట్‌కు అప్పగించినట్లు సమాధానం ఇవ్వడం గమనార్హం.

'చేయూత'లో కోత !

- లబ్ధిదారుల తగ్గింపునకు అడ్డదారులు
- విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటించేయత్నం
- ఆరునెలల నుంచి అదిగో.. ఇదిగో అంటూ జాప్యం
- పథకం అమలుపై అనుమానాలు

సంగం, ఫిబ్రవరి 4: సంక్షేమ పథకాల లబ్ధిదారులను ప్రతిఏటా తగ్గించడమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోంది. ఈ కోవలోకి ఇప్పుడు చేయూత పథకం చేరింది. వైస్సార్ చేయూత అంటే 45 ఏళ్ల నిండిన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ. 18,750ల చొప్పున నాలుగేళ్లలో రూ. 75,000లు ఆయా కార్పొరేషన్ ద్వారా ఉచితంగా అందచేసే పథకం. దీని అమలుకు ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటరాదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఐటీ చెల్లింపులు చేసి ఉండకూడదు. ఇంట్లో ప్రభుత్వ పింఛను తీసుకునేవారు ఉండకూడదు. ఇంటి స్థలం, పొలం నిర్ణీత విస్తీర్ణాన్ని మించి ఉండకూడదు ... అంటూ షరతులు విధించింది. వాటిని అమలు చేసిన కారణంగా గత మూడు దఫాల్లోనే పలువురు చేయూత పథకానికి అనర్హులుగా మారిపోయారు. ఈసారి లబ్ధిదారులను ఏరివేసేందుకు అవకాశం దొరకలేదు. దీంతో అడ్డదారుల్లో లబ్ధిదారులను మోసం చేసేందుకు పన్నాగం పన్నింది.

విద్యుత్ వినియోగం పేరుతో..

ఆరు నెలల సగటు కాకుండా, మొత్తం విద్యుత్ వినియోగంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించిన నెలల్ని ఎంచుకుని ఆ సగటును చూపించి చేయూత లబ్ధిదారులను తొలిస్తోంది. గతంలో ఎప్పుడో కారు కొని ఉండి అది ఇప్పుడు అమ్ముకుని ఉన్నా తొలగిస్తున్నారు. ఐటీ విషయంలో కూడా ఇదే జరుగుతుంది. గృహరుణం కోసం గతంలో చెల్లించిన ఐటీ చెల్లింపులు, ఐటీ కట్టినవారు రేషన్ కార్డులో ఉన్నారనే కారణంతో చాలా మందికి చేయూతను ఆపేశారు.

ఆరునెలలుగా ఊరిస్తూ...

వైసీపీ అధికారం చేపట్టిన 14 నెలల తరువాత 2020లో పథకాన్ని ప్రారంభించారు. 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం, 2022 సెప్టెంబరు 23 వరకూ మూడో దఫా అందించలేదు. అంటే 2021 తర్వాత మరో 16 నెలలకుగానీ లబ్ధిదారులకు చేయూత దక్కలేదు. కాగా గతేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తుందా ? అన్న అనుమానాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.



సీతారామపురంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి(ఫైల్)

మహీధరరెడ్డికే కందుకూరు ?

- త్వరలో ప్రకటించే అవకాశం

కందుకూరు, ఫిబ్రవరి 4: కందుకూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పేరు ఖరారైనట్లు తెలిసింది. కందుకూరు స్థానాన్ని బీసీలకు కేటాయిం చాలన్న ఆలోచనతో గత నెలరోజులుగా వివిధ ప్రయత్నాలు చేసిన పార్టీ అధిష్ఠానం సరైన అభ్యర్థి దొరక్కపోవటం, సర్వే నివేదికలు కూడా మహీధరరెడ్డికే అనుకూలంగా ఉండటంతో ఆయన పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. కాగా జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలు మహీధరరెడ్డికే కందుకూరు కేటాయించాలని జగన్‌పై ఒత్తిడి తేవటంతో మనసు మార్చుకున్న జగన్, మహీధరరెడ్డికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం వెల్లడించే జాబితాలో మహీధరరెడ్డి పేరును ప్రకటించనున్నట్లు సీఎంవో నుంచి ఇక్కడి నేతలకు సమాచారం అందింది. శనివారం రాత్రే సీఎంవో నుంచి సమాచారం వచ్చిందని స్థానిక పార్టీ నేతలు ధ్రువీకరించారు. కాగా నెల్లూరు పార్లమెంట్‌కు వీపీఆర్ పోటీ చేయని పక్షంలో మహీధ రరెడ్డి కూడా నిర్ణయం మార్చుకునే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంటున్నారు.



సరదాగా.. సంతోషంగా!

- ఉత్సాహంగా జిల్లా అధికారుల క్రికెట్ పోటీలు
- ఫైనల్‌కు చేరిన పోలీస్ టైగర్స్ కార్పొరేషన్ ఫైటర్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4: వారంతా నిరంతరం ఉద్యోగ బాధ్యతలతో బిజీబిజీగా గడిపే వివిధ శాఖల జిల్లా అధికారులు... ఎన్నికల సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పనిలో నిమజ్జమయ్యారు. అలాంటి అధికారులు ఆదివారం అన్నీ మరిచిపోయి క్రికెట్ పోటీల్లో తోటి ఉద్యోగులతో సరదాగా గడుపుతూ కనిపించారు. నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఆదివారం జిల్లా అధికారులు టీమ్‌లుగా విడిపోయి క్రికెట్ పోటీల్లో నువ్వానేనా అన్న రీతిలో తలబడ్డారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ లీగ్ పోటీలు జరిగాయి. కలెక్టర్ కెప్టెన్‌గా రెవెన్యూ రాయల్స్ టీమ్, ఎస్పీ కెప్టెన్‌గా పోలీస్ టైగర్స్ టీమ్, కార్పొరేషన్ కమిషనర్ కెప్టెన్‌గా మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ టీమ్, డీఆర్‌డీఏ పీడీ కెప్టెన్‌గా డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ టీమ్ పోటీల్లో పాల్గొన్నాయి. తొలత రెవెన్యూ రాయల్స్ జట్టు, పోలీస్ టైగర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసు టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి బ్యాటింగ్‌లో ఆకట్టుకోగా, కలెక్టర్ ఎన్ హరినారాయణన్ బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. రెండవ మ్యాచ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ జట్టు, డిస్ట్రిక్ ఆఫీసర్స్ జట్టు తలపడ్డాయి. కార్పొరేషన్ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 18వ తేదీ ఆదివారం విజేత జట్ల మధ్య ఫైనల్స్ జరగనుంది.

కుట్రను పసికట్టే పోటీకి దూరం ?

- మనస్తాపంతో వీపీఆర్
- జిల్లాను కుదిపేసిన నగర అభ్యర్థి నిర్ణయం
- అడకత్తెరలో పోకచెక్కలా అధికార పార్టీ
- నెల్లూరులో వైసీపీకి కర్ణశాపాలు

నెల్లూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వైసీపీని కర్ణశాపాలు చుట్టుముట్టాయి. దీంతో ఆ పార్టీ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పార్టీ సర్వేలు... జిల్లా నేతల ఫిర్యాదులు.. ఏమైతేఏం... ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను నెల్లూరు సిటీ నుంచి నరసారావుపేట ఎంపీ స్థానానికి పంపారు. అనిల్ పోతూ పోతూ తన స్థానంలో తన అనుచరుడు, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకుని వెళ్లారు. ఎవరి ఊహకు అందని విధంగా జరిగిన ఈ నిర్ణయం జిల్లా వైసీపీలో ముసలం పుట్టేలా చేసింది.

అజ్ఞాతంలోకి వీపీఆర్

తనతో మాటమాత్రం కూడా సంప్రదించకుండా నగర అభ్యర్థిని ప్రకటించడం పట్ల కలత చెందిన వీపీఆర్ రాజకీయాలకు స్వస్తి పలికి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేయకూడ దని ఆయన నిర్ణయించుకున్నారని వైసీపీ వర్గాల సమాచారం. ఆయన ఒక్కరే కాదు నెల్లూరు సిటీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు సైతం ఖలీల్ అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో కాడె పడేయడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పార్టీ నాయకు లకు సమాచారం కూడా పంపారు.

అటూఇటూ కదలలేని స్థితి

ఇప్పుడు అటూఇటూ కదలలేని పరిస్థితి వైసీపీకి ఏర్పడింది. ఖలీల్ అభ్యర్థి అయితే మిగతా నాయకులు పనిచేయరు. అభ్యర్థిత్వాన్ని మార్చితే ముస్లింకి టికెట్ ఇచ్చినట్లే ఇచ్చి, లాగేసుకున్నారనే అపవాదు. ఈ ప్రభావం జిల్లాలోని ముస్లింల ఓట్లపై పడుతుంది. ప్రధానంగా నెల్లూరు నగరంలో ముస్లిం ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. ఆ ప్రభావం కచ్చితంగా పార్టీపై పడుతుంది. పోనీ ముస్లింలలో మరొకరికి టికెట్ ఇద్దామనుకుంటే అనిల్ వర్గం పనిచేయదు. ఇప్పటికే అనిల్‌ను నరసారావుపేటకు పంపడాన్ని ఆయన వర్గం జీర్ణించుకోలేకపోతోంది. కాని ఏదో ఒకటి జరగక తప్పని పరిస్థితి. అంటే ఎటూచూసినా నగర వైసీపీ నష్టపోవడం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు.

వీపీఆర్‌పై వ్యూహాత్మక కుట్ర ?

నెల్లూరు నగర కేంద్రంగా జరిగిన ఈ పరిణామాలు రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిపై వ్యూహాత్మక కుట్రలో భాగంగా జరిగింది తప్ప మరొకటి కాదని వైసీపీ వర్గాలే చెప్పుకొంటున్నాయి. వీపీఆర్‌కు, అనిల్‌కు మధ్య మూడేళ్లుగా సరైన సంబంధాలు లేవు. హుందాతనం, మెతక స్వభావం కలిగిన వీపీఆర్ అనిల్‌తో ఇమడలేకపోయారు. అయితే ఈ విభేదాలు బహిరంగంగా రచ్చకెక్కిన సందర్భాలు లేవు. అయితే ఇటీవల అనిల్‌ను నగరం నుంచి తప్పించడం వెనుక వీపీఆర్ పాత్ర కూడా ఉందనే ప్రచారం జరిగింది.



అయితే ఇందులో ఏమాత్రం నిజముందో.. అనిల్‌ను తప్పించడానికి అసలు కారణాలేమిటో తెలియలేదు కానీ, ఇందులో వీపీఆర్ పాత్ర ఉందని అనిల్ శిబిరం మాత్రం గట్టిగా నమ్ముతోంది. ఈ కారణంతోనే వీపీఆర్‌ను దెబ్బతీయడానికి అనిల్ వ్యూహాత్మకంగా పావులు కదిపారనే ప్రచారం సాగుతోంది. నెల్లూరు పార్లమెంటుకు వీపీఆర్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన్ను ఇబ్బందులపాలు చేయాలనే ఉద్దేశంతోనే నెల్లూరు నగరం నుంచి ముస్లిం వర్గానికి చెందిన తన అనుచరుడు ఖలీల్ పేరును అనిల్ ఖరారు చేయించాడని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా అంచనా వేస్తే నెల్లూరు పార్లమెంట్ పరిధిలో నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలు టీడీపీకి చాలా బలంగా ఉన్నాయి. పార్లమెంట్‌లో జయాపజయాలను ఈ రెండు నియోజకవర్గాలే నిర్ణయిస్తాయనే అంచనాలున్నాయి. ఈ కారణంగానే అనిల్ అభ్యర్థిత్వం కూడా మార్పు చేసినట్లు ప్రచారం జరిగింది. అనిల్‌ను నరసరావుపేటకు పంపిన క్రమంలో అంతకన్నా బలమైన అభ్యర్థిని సిటీ నుంచి నిలబెడతారని వైసీపీ వర్గాలు ఊహించాయి. అయితే ఎవరి ఊహకు అందని విధంగా కేవలం అనిల్ మాటకు విలువిచ్చి జగన్ కొత్త అభ్యర్థిని ప్రకటించినట్లు అనుకొంటున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ముస్లిం ఓట్ల సంఖ్య గణనీయంగా ఉంది. ఈ ఓటు బ్యాంకు వీపీఆర్‌కు వ్యతిరేకంగా మారే ప్రమాదం ఉంది. ఈ కుట్రను పసిగట్టిన కారణంగానే వీపీఆర్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేయకూడని నిర్ణయించుకున్నారని అంటున్నారు. తనకు వ్యక్తిగతంగా ఆసక్తి లేకున్నా జగన్‌రెడ్డి కోరారని ఎంపీగా పోటీకి సిద్ధపడ్డానని, అయితే విలువలు లేని చోట్ల, ఈ కుట్రలు కుతంత్రాల మధ్య పోటీ చేయాల్సిన అవసరం తనకు లేదని వీపీఆర్ భావిస్తున్నట్లు అనుకుంటున్నారు.

అభ్యర్థుల్లో కలకలం

నెల్లూరు సిటీ అభ్యర్థి విషయం కేవలం సిటీకే పరిమితం కాలేదు. ఏకంగా జిల్లా మొత్తంలో పార్టీని సంక్షోభంలోకి నెట్టేసింది. వీపీఆర్ పార్ల మెంట్‌కు పోటీ చేయని పక్షంలో ఆ ప్రభావం మొత్తం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్య ర్థులపై పడుతుంది. వీపీఆర్ అర్థబలం, మంచి పేరు తమకు లాభిస్తాయని వైసీపీ అభ్యర్థులు ఆశప డ్డారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో తిప్పి ఆయన చేత ప్రజలకు పలు హామీలు ఇప్పించారు. దీనికి తోడు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ రెండు, మూడు వర్గాలుగా చీలిపోయింది. పార్లమెంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన వీపీఆర్ అసమ్మతి వర్గాలను శాంతపర చడంలో కొంత మేరకు విజయం సాధించారు. ఇప్పుడు ఆయన పోటీకి దూరమైతే జిల్లా మొత్తంపై ఆ ప్రభావం పడుతుంది. ఇలా ఏ కోణంలో చూసినా జిల్లా వైసీపీకి గడ్డుపరిస్థితులు తప్పవని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నిరుద్యోగుల నిరుత్సాహం !

- పోస్టులు తక్కువ... పోటీదారుల ఎక్కువ
- డీఎస్సీ ప్రకటనపై పెదవి విరుపు
- అప్రెంటీస్ విధానంపై ఆందోళన
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 4: ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీలు గుప్పించిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ హామీలను గాలికొదిలేసి, ఎన్నికల వేళ హడావిడిగా డీఎస్సీ డ్రామాకు తెరలేపారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ విడుదల చేస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల దాటినా ఒక్క డీఎస్సీ విడుదల చేయలేదని వారు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాజాగా మంత్రిమండలిలో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందని నిరుద్యోగులు ధ్వజమెత్తారు. పైగా ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి అమలు చేసేలా పావులు కదపడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

దగా డీఎస్సీ

వైసీపీ ప్రభుత్వం తమను దగా చేస్తున్నదని నిరుద్యోగ యువత మండిపడుతోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ మభ్య పెడుతోందని వారు వాపోతున్నారు. ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకుండా తాజాగా నిబంధనలు, షరతులతో డీఎస్సీ విడుదల చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. లక్షలాదిమంది బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన నిరుద్యోగులు చిన్నచిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా ప్రకటిం చిన డీఎస్సీ చూడగానే తమ గుండెలు బరువెక్కిపోయాయని వారు పేర్కొన్నారు.

ఖాళీలు 35 వేలు

రాష్ట్రవ్యాప్తంగా 35వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉన్న ఖాళీలను 117 జీవో ముసుగులో కుదించడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించారు. ఈ పోస్టుల్లో కూడా జడ్పీ, ప్రభుత్వ, పురపాలక, సంక్షేమ, ఆశ్రమ తదితర పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసి భర్తీ చేసేవారు. అన్నీ కలిపి ఒకే ప్రకటన ద్వారా భర్తీ చేయడం నిరుద్యోగులను దగా చేయడమే నని వాపోయారు.

అప్రెంటీస్ విధానంపై ఆందోళన

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతనాలు కూడా సకాలంలో ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 2024 డీఎస్సీ విడుదల చేయాలని, ఉపాధ్యాయులుగా నియమితులయ్యే వారికి అప్రెంటీస్ విధానం అమలు చేయాలని నిర్ణయించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్రెంటీస్ విధానాన్ని 2012 డీఎస్సీలో రద్దు చేశారు. 12 ఏళ్ల తరువాత మళ్లీ అప్రెంటీస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీన్ని పునరుద్ధరించడంపై నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి.

కొరవడిన స్పష్టత

డీఎస్సీ ప్రకటనకు ముందుగానే ఖాళీల వివరాలు సేకరించాల్సిన విద్యాశాఖలో స్పష్టత కొరవడింది. నిర్దిష్టమైన తేదీలోపు ఎన్ని ఖాళీలు ఉన్నాయో సమగ్ర వివరాలను ప్రభుత్వం కోరలేదని అధికారులు చెపుతున్నారు. ఇప్పుడు హడావిడిగా జనవరి 31వతేదీ లోపు ఉద్యోగ విరమణ చేసినవారు, మృతుల వివరాలు సేకరించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో కూడా తెలియదని, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఖాళీలు గుర్తించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్లు వారు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించిన తరువాత డీఎస్సీపై స్పష్టత వస్తుందని వారంటున్నారు. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు తక్కువగానే ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతుండగా, సమావేశం అనంతరం పోస్టుల సంఖ్య పెరగడం, తగ్గడంపై స్పష్టత వస్తుందంటున్నారు. తొలుత టెట్ నిర్వహించాలని విద్యాశాఖ భావిస్తుండగా, ముందు టెట్ నిర్వహిస్తారా లేక డీఎస్సీనే నిర్వహిస్తారనే విషయంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

హక్కులు కాలరాస్తున్నారు..



ఎన్నో ఉద్యమాలు, సమ్మె ల ద్వారా సాధించుకున్న అప్రెంటీస్ విధానం రద్దును ఈ ప్రభుత్వం తిరిగి తీసుకు రావడం తమ హక్కులు కాలరాయడమే. ఎవరూ అడగకుండానే పదవీ విరమణ వయసు పెంచడం ద్వారా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వం 35వేల టీచర్ పోస్టులకు కేవలం 6,100 పోస్టుల భర్తీకి ఆమోదం తెలపడం నిరుద్యోగులను మోసం చేయడమే.

- ఏ.సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బానిసత్వంలోకి నెట్టడమే..



ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పునరుద్ధరించాలని ఆలోచన చేయడం నిరుద్యోగులను బానిసత్వంలోకి నెట్టడమే. ఎన్నికల ముందు అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ, ఉద్యోగులను వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది. తాజాగా ఎన్నికల స్టంట్‌గా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించింది. ప్రభుత్వం పునరాలోచించి, అప్రెంటీస్ విధానాన్న రద్దు చేయాలి.

- మాసా ప్రసాద్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

జగన్‌కు బీసీలు గుణపాఠం చెప్పాలి : కురుగొండ్ల


బీసీ సదస్సులో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, జనవరి 4 : బీసీలకు అన్యాయం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. కలువాయిలో ఆదివారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు ఎలాంటి మంచి జరగలేదని, టీడీపీ హయాంలో అన్ని బీసీ కులాలకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయం గుర్తుపెట్టుకుని త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టీడీపీని గెలిపించి చంద్రబాబు నాయుడును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొలిగర్ల మస్తాన్ యాదవ్ మాటాడుతూ వైసీపీ పాలనలో బీసీల ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. కులానికి ఒక కార్పొరేషన్ పెట్టి కేవలం వారిని కుర్చీలకే పరిమితం చేసి అవమానించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మునుస్వామి, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సదాశివం, మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, జెన్ని రమణయ్య, ఏ వేణుగోపాల్‌రెడ్డి, ఏ మల్లికార్జునయ్య, చీపినాపి సర్పంచు పెంచలయ్య యాదవ్, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వరికుంటపాడు, ఫిబ్రవరి 4: ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుపతయ్య సూచించారు. ఆదివారం రాత్రి తూర్పు బోయమడగల బస్టాండ్ సెంటర్, ప్రధాన కూడళ్లల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం విక్రయించినా, జూదస్థావరాలు నిర్వహించినా చట్టారీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ నారాయణ సిబ్బంది తదితరులున్నారు.

మాతమ్మకు పాల పొంగళ్లు

కలువాయి, జనవరి 4: కలువాయిలోని అరుంధతీయ కాలనీలోని మాతమ్మ, పోతురాజులకు ఆదివారం పాల పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాలనీ వాసులు మేళతాళాలతో పూజా సామాగ్రితో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బండదేవరకు ప్రత్యేక పూజలు

అనంతసాగరం, ఫిబ్రవరి 4: మండల కేంద్రం అనంతసాగరంలో ఆదివారం రజకులు తమ కులదైవం బండదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో ఊరేగింపుగా కాలువ వద్దకు చేరుకొని బండదేవరకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు జోన్-4 ఇన్‌చార్జిగా వేలూరు కేశవ చౌదరి


వేలూరు కేశవచౌదరిని సన్మానిస్తున్న ఓబులాయపల్లి టీడీపీ నాయకులు శివ తదితరులు

చేజర్ల, ఫిబ్రవరి 4: ఆత్మకూరు నియోజకవర్గ జోన్-4 ఇన్‌చార్జిగా చేజర్ల మండల టీడీపీ సీనియర్ నాయకుడు, నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన వేలూరు కేశవ చౌదరిని రాష్ట తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. గత కొంత కాలంగా పార్టీకి చేస్తున్న సేవలు గుర్తించి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలుగుదేశం పార్టీ నిరూపిం చుకుందని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు, పూల మాలలతో పలువురు అభినందించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం, ఫిబ్రవరి 4: ఉదయగిరి నుంచి సీతారామపురం వరకు జరుగుతున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 167-బి పనులలో భాగంగా సీతారామపురం మండలంలోని 33/11 కేవీ విద్యుత్ సరఫరా సోమవారం, మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఇ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యుత్ వినియోగదారులు రెండు రోజులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ



మెమోంటోలను అందుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: అపస్మా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌లో అనంతసాగరం శాంతినికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. షేక్ అహ్మద్ అక్మల్, ఎస్‌డి మాహిర్ జిల్లా స్థాయిలో ద్వితీ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా వారిని కరస్పాండెంట్ జి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ అధికారి బడుగు శ్రీనివాసులురెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: విద్యతోనే ప్రగతి సాధ్యమని, క్రమ శిక్షణతో చదువుకుంటే విజయం తథ్యమని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఉద్దేశించి ఐఎఫ్ఎస్ అధికారి బడుగు శ్రీనివాసులురెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వై వెంకటయ్య ఉద్బోధించారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సహాయ బీసీ సంక్షేమశాఖ ఆత్మకూరు పరిధిలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీసీడబ్ల్యువో వై వెంకటయ్య మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం పరీక్షల్లో 10కి 10పాయింట్లు ఎలా సాధించాలన్న దానిపై పలువురు ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆత్మకూరు బీసీ సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసేందుకు ప్రేరణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఏబీసీడబ్ల్యువో ఎం శ్రీదేవి, బిఎస్ఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులనాయుడు తమ సొంత నిధులతో అందజేసిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావంతతో పనిచేసిన హాస్టల్ సంక్షేమాధికారులు (హెచ్‌డబ్ల్యువో)కు, హాస్టల్ సిబ్బందికి ప్రశంసాప్రతాలనే అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, హాస్టల్ సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారబందీ నిబంధనలు పాటించాలి : డీఈ


మాట్లాడుతున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 4: మోటార్ల కింద సాగు చేసే రైతులు వారబంది నిబంధనలు పాటించాలని బీపీఆర్ కాలువ డీఈ వెంకటరమణ సూచించారు. స్థానిక సోమశిల అతిథి గృహంలో బెజవాడ పాపిరెడ్డి కాలువ సెక్షన్ అధికారులు మోటార్ల కింద సాగుచేసే రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సోమశిల జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతోపాటు కాలువ కింద సాగు చేసిన విస్తీర్ణం అనుమతి కంటే పెరగడంతో నీటి కొరత ఏర్పడే పరిస్థితి నెలకొందని, నీటి కొరతను తగ్గించేందుకు నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా కాలువ పరిధిలో మోటార్ల ద్వారా సాగుచేసే రైతులు వారంలో సోమ, మంగళ, శుక్ర, శని వారం నాలుగు రోజులు మోటార్ల ద్వారా సాగునీరు తోడుకుని మిగిలిన బుధ, గురు, ఆదివారం మూడు రోజులపాటు మోటార్లను నిలిపివేయాలని సూచించారు. ఆ మూడు రోజులు అధికారిక ఆయకట్టు రైతులకు సాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ఇందుకు మోటార్ల రైతులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమణయ్య, వ్యవసాయాధికారి శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.


మొక్కుబడిగా వరికుంటపాడు మండల సమావేశం

వరికుంటపాడు, ఫిబ్రవరి 4: ప్రజా సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొడుతుండడంతో పీఏసీఎస్ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, ఎంపీడీవో శ్రీదేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో 18 శాఖలకు సంబంధించి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 8 శాఖల అధికారులే హాజరయ్యారు. అందులోనూ కిందిస్థాయి ఉద్యోగులు హాజరు కావడంతో ఆయా శాఖల పనితీరుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు సైతం విమర్శలు గుప్పించారు. ఆయా శాఖల అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మొక్కుబడిగానే సమావేశాన్ని కొనసాగించి చేతులు దులుపుకున్నారు. పీఆర్ ఏఈ నందకిశోర్ సచివాలయాలను పంచాయతీలకు అప్పగించామని చెప్పడంతో అక్కడే తూర్పురొంపిదొడ్ల పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా తమకు అప్పగించారని చెప్పడం ఏంటని నిలదీయంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ సమయంలో ఎంపీడీవో సైతం ఆయన్ను మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు, ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

ఉదయగిరి, ఫిబ్రవరి 4: మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఫరుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. పట్టణంలోని రంగనాయకుల ఆలయం నుంచి కోన కాలువ వరకు మురికి కాలువ నిర్మించాలన్నారు. పట్టణంలోని పలువీధుల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేయడంతోపాటు రహదారుల వెంట ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు నగదు బహుమతులు : కంచి


కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానించిన అపస్ నేతలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులలో పోటీతత్వం పెంచి, విలువలతో కూడిన విద్యను పెంపొందించే లక్ష్యంతో నగదు బహుమతులు అంద జేస్తామని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని నిత్యాన్నదాన భవనంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేల రూపాయలు అందిస్తామన్నారు. అదే క్రమంలో ప్రతి పాఠశాలలో 500 మార్కులు పైబడి సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 10,000, రూ. 7500, రూ. 5000 అందజేస్తామని తెలిపారు. ముందుగా కంచి పరమేశ్వరరెడ్డిని అపస్ నేతలు, పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శేషారెడ్డి, యానాదిరెడ్డి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని గండిపాళెం జలాశయం కుడి, ఎడమ ప్రధాన, ఉప కాలువల్లో జలవనరుల శాఖ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ జలాశయం పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఉప కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు, పూడికను తొలగిస్తున్నామన్నారు. మెట్ట పంటలను దృష్టిలో ఉంచుకొని విడుదల చేసే నీటిని ఆయకట్టుదారులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

బహిరంగ ప్రకటన

బయటమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ ...

SCHEDULE

...

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore-3. Cell :8374259828.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 4: త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి సూచించారు. ఆదివారం మండలం లోని జీ.చెరువుపల్లి పంచాయతీ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ కక్షలకు దూరంగా ఉంటూ స్నేహభావంతో మెలగాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం విక్రయాలు చేపట్టినా, జూద స్థావరాలు నిర్వహించినా, వివాదాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమిదే అంతిమ విజయం

● 21వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఫిబ్రవరి 4: జగన్ ఎంతమంది ఎమ్మెల్యేలను ఎన్నిచోట్లకు మార్చి పంపినా ఉపయోగం లేదని రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించటం ఖాయమని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 21వ వార్డు కాళిదాసు వారి వీధి ప్రాంతంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుతో పాటు పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేడని, ఇష్టారీతిగా పింఛన్లు తీసేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచేసి ఆ బిల్లులను సాకుగా చూపి ప్రభుత్వ పథకాలు కట్ చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఇసుక దర్జాగా అమ్ముకుంటుండగా సామాన్యులకు ఇసుక కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, ముచ్చు శ్రీను, పాకాల మల్లికార్జున, చిలకపాటి మధు, దాసరి సుబ్బరాయుడు, చల్లా మురళీకృష్ణ, నాదెళ్ల మధుబాబు, గుమ్మా శివ, సంగా వంశీ, శ్రీకాంత్, నటరాజ్, తదతరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన



కేన్సర్‌ను జయించవచ్చని విక్టరీ సింబల్ చూపుతున్న వైద్యులు

కావలి, ఫిబ్రవరి 4: ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ, ఉమెన్ డాక్టర్స్ వింగ్, పింక్ హెల్త్ మిషన్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కావలి పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, బీసీ పాఠశాల బాలికల వసతి గృహం విద్యార్థులకు ఆయా వసతిగృహాలలో అవగాహన కల్పించారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు కామంచి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ కేన్సర్ వ్యాధిని ఆదిలోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తే జయించవచ్చన్నారు. ఉమెన్ డాక్టర్స్ వింగ్ డాక్టర్లు ఉష, ఉషారాణి, పద్మజ, రాష్మి, రమ్య తదితరులు మహిళలకు సంభవించే కేన్సర్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ గోపి ఆర్థిక సహకారంతో 200 మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసి వారికి పోషకాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ పామూరు శివప్రసాద్, డాక్టర్లు వెంకటేష్, రేవంత్, భారతి, వసతిగృహ సంక్షేమాధికారులు విజయలక్ష్మి, నాగేశ్వరి, విశ్రాంత వార్డెన్ షేక్ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో కాబోయే సీఎం పవన్‌కల్యాణ్

● జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాసులు


కూనంపూడి శ్రీనివాసులును సత్కరిస్తున్న జనసేన కార్యకర్తలు

కావలిటౌన్, ఫిబ్రవరి 4: రాబేయే రోజుల్లో కాబోయే సీఎం పవన్‌కల్యాణ్ అని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయాన్ని శ్రీనివాసులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే వారాహి యాత్రను జయప్రదం చేయాలని, పవన్‌కల్యాణ్ ఆశయాలను ఆలోచనలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. జనసేన, టీడీపీ పొత్తును స్వాగతించాలని అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యమవ్వాలని టీడీపీతో కలిసి పనిచేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని వైసీపీ అరాచకాలు దోపిడీని ఎండగట్టాలన్నారు. త్వరలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నేతలు మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో సమావేశం కానున్నానన్నారు. కార్యక్రమంలో రిషికేష్, ఆలా శ్రీనాథ్, టీ సుధీర్, బీ మస్తాన్, అగస్టీన్, కృష్ణయ్య, మంద శ్రీను, మనోజ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం


క్రీడాకారుడిని సత్కరిస్తున్న టీడీపీ నేత కావ్య క్రిష్ణారెడ్డి, తదితరులు

కావలి, ఫిబ్రవరి 4: ఢిల్లీలో ఈ నెల 2వ తేదీన జరిగిన ఐజీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల విభాగంలో కావలి పట్టణం జండా చెట్టు సెంటర్‌కు చెందిన షేక్ హుస్సేన్ మొదిటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కావలి ముసునూరులోని టీడీపీ నేత కావ్యక్రిష్ణారెడ్డి ఇంటి వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడు హుస్సేన్‌ను ఆయన సత్కరించారు. భవిష్యత్తులో మరెన్ని మెడల్స్ సాధించి కావలికి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 4: బోగోలు మండలం జకేపల్లిగూడూరు పంచాయతీ కమ్మపాలెం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు సీఆర్‌డబ్ల్యూడీఎస్ డైరెక్టర్ ఏగూరి టోనీజయకర్ తన తండ్రి ఏగూరి జాకబ్ జయింతి సందర్భంగా ఆదివారం ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. చిన్నారులచే కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుధీర్, అంగన్వాడీ కార్యకర్త రమాభాయ్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు బీజేపీ సమన్వయకర్తగా ఘట్టమనేని


బీజేపీ సమన్వయ సమావేశంలో నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 4: కందుకూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సమన్వయకర్తగా సీనియర్ నాయకుడు ఘట్టమనేని హరిబాబును నియమించారు. ఇప్పటి వరకు సమన్వయకర్తగా ఉన్న ఉన్నం నళినీదేవి ఇటీవల పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ లో చేరిన విషయం విదితమే. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ నెల్లూరు నేత గాజుల వెంకయ్యనాయుడు పాల్గొని పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహణపై చర్చించి విధివిధానాలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన గట్టమనేని హరిబాబు నేతృత్వంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మారెళ్ల బ్రహ్మారెడ్డి, మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, మురళీధరన్, జగన్నాథం వైకుంఠం, మాటూరి రమేష్‌నాయుడు, ఎల్లంపల్లి శ్రీధర్, మువ్వల భూషయ్య, నవులూరి రాజేష్, గొడ్డలి బాలరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. యువత సామాజిక బాధ్యత



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టరు నేరెళ్ల

కందుకూరు, ఫిబ్రవరి 4: రక్తదానం చేయడం యువత సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని ప్రముఖ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టరు నేరెళ్ల ధర్మతేజ పేర్కొన్నారు. పొడపాటి చక్రీ తన సహచర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో కలిసి ప్రారంభించిన భారతదేశ యువ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు యువకులు రక్తదానం చేశారు. సక్షమ్, రెడ్‌క్రాస్ సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో ఒంగోలు రెడ్‌క్రాస్ సొసైటీవారు రక్తసేకరణ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు పేర్నమిట్ల సాయి, నవీన్, సమీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత !

లింగసముద్రం, ఫిబ్రవరి 4 : లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది.దీంతో పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు ఉండాలి. అయితే ప్రస్తుతం ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, 9 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరు కాక పోలీస్‌స్టేషన్‌లో నియమించిన ఒక మహిళా కానిస్టేబుల్ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో, మరో హెడ్ కానిస్టేబుల్ విజయవాడలో డీజీపీ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నట్లు తెలిసింది. ఉన్న 9 మంది కానిస్టేబుళ్లలో ఒకరు కోర్టుకు వెళ్లాల్సి ఉండగా మిగిలిన 8 మందిలో ముగ్గురు, నలుగురు బందోబస్తుకు వెళతారని తెలిసింది. దీంతో ఉన్న కొద్ది మంది సిబ్బందితో ఎస్సై పని చేస్తున్నారు. అంతేగాక మండలంలో జరిగే అసాంఘీక కార్యక్రమాల నివారణతో పాటు, ట్రాఫిక్‌ను పర్యవేక్షించాల్సి ఉంది. దీనికి తోడు ఎన్నికల సమయం కూడా వస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది, అధికారుల కొరతను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


రేపు కావలిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం కొరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కావలి విద్యుత్‌శాఖ ఈఈ జెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ ఉదయగిరి రోడ్డులోని విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విద్యుత్ అదాలత్‌లో చైర్మన్‌గా విశ్రాంత జడ్జి బీ.శ్రీనివాసాంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కే. రామమోహన్‌రావు, ఎస్‌ఎల్ అంజనీ కుమార్, జీ. ఈశ్వరమ్మలు పాల్గొని వినియోగదారుల సమస్యలకు పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. కావలి డివిజన్ పరిధిలోని కావలి, కలిగిరి, అల్లూరు సబ్‌డివిజన్లకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను తెలపండి.. పరిష్కరిస్తాం !

అల్లూరు, ఫిబ్రవరి 4 : సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె అల్లూరులోని చెర్లోసంఘం, ఆర్‌డీఆర్ కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ట్రస్ట్ ద్వారా వీలైనన్ని సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అదేవిధంగా అల్లూరులో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, దర్శిగుంట వాసు, గుమ్మడి రాజేష్‌బాబు, ఎల్లు సుబ్రహ్మణ్యం, వల్లపు అనీల్, కాకాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత చదవండి



ప్రచార రథం వద్ద భగవద్గీతను ప్రదర్శిస్తున్న సురమౌళి, కమిటీ సభ్యులు

బిట్రగుంట, ఫిబ్రవరి 4: త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరు చదివి కర్మ సిద్ధాంతం దైవీక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట, బోగోలు పంచాయతీలో భగవద్గీత, నీతికథలు, యోగి వేమన పద్యా లు వాటి అర్థాల పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, సుదర్శనమ్మ, అవినాష్, అన్నపూర్ణ, రఘురామయ్య, వేణు, ప్రవీణ, తదితరులు ఆల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కొండాపురం, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ కన్వీనర్, సాయిపేట మాజీ సర్పంచు తాటికొండ రామమూర్తి జయంతి సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని బాలికలకు ఆదివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నవీన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి నసీరుద్దీన్, ఆర్‌ఎంపీ ఆర్.క్రిష్ణమోహన్, ఫౌండేషన్ సభ్యుడు ప్రవీణ్, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మమ్మ, షబ్రీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న దాతలు